# గ్రంథాలయసర్వస్వము.

## సచిత్ర మాసపత్రిక

సంపుటము ౧౧ ఈశ్వర - ఆశ్వయుజము - అక్టోబరు ౧౯౩౭ సంచిక ౬

## విషయసూచిక


| | |
|---|---|
| సారస్వతాలయాలు | ౨౦౧ |
| ఆంధ్రదేశమునందు ప్రయోజన విద్య | ౨౦౩ |
| శ్రీ దుర్గాపూజ - పశుబలిదానము | ౨౦౯ |
| ఆంధ్రగ్రంథాలయములు | ౨౧౧ |
| గ్రంథాలయోపయోగము | ౨౧౨ |
| తెనుగుగుడి అంటే ఆంధ్రామ్యూజియమ్ | ౨౧౩ |
| తెనాలి తాలూకా గ్రంథాలయ మహాసభ | ౨౧౬ |
| కేంద్రగ్రంథాల యావశ్యకత | ౨౧౯ |
| లోకలుబోర్డుల శాసనము - గ్రామపంచాయతీల స్థానము | ౨౨౧ |
| వడిచక్రాలు | ౨౨౪ |
| గ్రామోద్యోగ పత్రిక | ౨౨౫ |
| జీవకారుణ్య ప్రచారము | ౨౨౯ |
| వృత్తాంతములు | ౨౩౦ |
| గ్రంథాలయ సేవ | ౨౩౧ |
| నివేదికలు | ౨౩౩ |
| కొవ్వూరు తాలూకా గ్రంథాలయయాత్ర | ౨౩౪ |
| సంపాదకీయములు | ౨౩౭ |
| ఉద్యోగ నియామకము | ౨౩౯ |
| గ్రంథవిమర్శ | ౨౪౦ |

# ఉత్తమగ్రంథములకానుక

ఆంధ్రదేశగ్రంథాలయసంఘసభ్యులై, చందాలుచెల్లించిన గ్రంథాలయములవారికి మాత్రమే

### I. గీతాభూమిక

౧౧౪ పుటలు - స్టిఫ్ బైండు - మేలుకాగితము - అమూల్యగ్రంథము. శ్రీ అరవిందయోగీంద్రుని బంగాళి గ్రంథమునకు శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారి తెనుగుఅనువాదము. ఇది శ్రీ చల్లపల్లి రాజాగారి ఔదార్యమువలన లభించినది. పోస్టేజీ ఉచితము.

### II. కీ. శే. వల్లూరి సూర్యనారాయణరావు, బి. ఏ., బి. ఎల్. గారు ప్రకటించిన ఉత్తమ గ్రంథములు.

వీనినిగూర్చి సిఫార్సు చేసియుంటిమి. ఇవి కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ కలాశాలనుండి రావలెను. మాదగ్గరలేవు.

కార్యదర్శి, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము, బెజవాడ.

షరా:— "గీతాభూమిక:" భీమవరము - తణుకు - తాడేపల్లిగూడెము - రేపల్లె - తెనాలి - బెజవాడ - ధర్మవరము తాలూకాలలోని గ్రంథాలయములవారు ఆయాతాలూకా గ్రంథాలయసంఘముల నుండియు, బెజవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖపట్టణములలోని గ్రంథాలయములవారు ఆయా పట్టణగ్రంథాలయ సంఘముల నుండియు పై గ్రంథమును పొందగలుగుదురు.

---

# గ్రంథాలయ సర్వస్వము

## బెజవాడ.

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును.

వ్యాసములు:-గ్రంథాలయశాస్త్రము - ఆంధ్ర వాఙ్మయము, ఆంధ్రాభ్యుదయము, జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘముల యొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు:—గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు, గ్రంథాలయ సేవకులయు, సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును. ఫోటోలుపంపువారు బ్లాకులఖర్చులు తామే భరింపవలెను. లేదా బ్లాకులుచేయించి పంపవలెను.

### హెచ్చరిక

ఈ పత్రిక ప్రతినెల ౨౦-వ తేదీని వెలువడును; కావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల ౧-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

### ప్రకటనముల రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

---

౨౧వ ఆంధ్ర దేశ గ్రంథాలయమహాసభ 1937 సం॥ 25-26-27 తేదీలయందు బెజవాడలో జరుగును.

అధ్యక్షులు: భాషోద్ధారక వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారు



“జాన్సుబర్గు” నగర ధర్మగ్రంథాలయము (ఆఫ్రికాదేశము.)

RSVM01A171

# గ్రంథాలయసర్వస్వము

సంపుటము ౧౧ | ఈశ్వర - ఆశ్వయుజము - అక్టోబరు ౧౯౩౭ | సంచిక ౬

సంపాదకులు:
గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎం. ఎ.
మారేపల్లి రామచంద్రశాస్త్రి.
అయ్యంకి వేంకటరమణయ్య.

## సారస్వతాలయాలు

రవీంద్రసారస్వతసమాజం.

కొండేపూడి వేంకటచలపతిరావు

పల్లెటూరులపాట్లు
పాటించి యోచించి
అజ్ఞానహీనులను
సుజ్ఞానులనుజేయ
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా!
జ్ఞానివగు నీవు!

అయ్యంకి ప్రముఖుండు
పట్టుపట్టినాడు -
భల్లూకపుంపట్టు -
ఆదర్శప్రాయుడై
ఆంధ్రదేశమంత
అరుగుతున్నాడు

అన్నపానీయాలు
మన కెంతవిధియో
గ్రంథాలయాలంతె
విధియంచుదెల్పు

సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా!
జ్ఞానివగు నీవు!

ఆరోగ్యవంతుడుగ
ఆనందమొందంగ
రోగమే లేకుండ
రాయిలా గుండంగ
నీరు గాలీ మనకు
నీటుగా రావంగ
సూర్యకిరణపుధాటి
సూటిగా తగులంగ
పల్లెటూళ్లే మనకు
పరమావధియని దెల్పు

సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా!
జ్ఞానివగు నీవు!

4

కూడుగుడ్డా లేక
కుములిపోకుండంగ
కులవృత్తులనె తిరిగి
కూర్చుకోనుడని తెల్పు
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా !
జ్ఞానివగునీవు !

అన్నదమ్ములవోలె
అక్కసెల్లిండ్రవలె
ఐకమత్యముతోడ
అలర వలెనని తెల్పు
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా !
జ్ఞానివగు నీవు !

ఉత్తముడ వీవైన
ఉత్తమాయిల్లాలు
నీభార్య, నీ సుతులు
ఉద్రేక వీరులగుదు
రడ్డ మెవ్వరురారు
అది తెలిసికోవంగ
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా!
జ్ఞానివగు నీవు!

అక్షరజ్ఞుడ వీవు
అయితీరవాలె
అన్యదేశపువార్త
లందుకోవాలె
పరదేశపాలన
పారద్రోలాలి
నీదేశపాలన
నీకు రావాలి
సాంతముగనీవది
తెలిసికోవంగ
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా!
జ్ఞానివగు నీవు!

కూటుగుడ్డకు నీకు
కొదువేమి లేనట్టి
విద్యలెన్నో నేర్వ
విధులు పన్నాలన్న
ఆకలి అప్పుల
ఆర్తిలేనట్టి
ఆర్థికమార్గాల
అరసివేయాలన్న
సారస్వతమ్మంత
తెలియాలనుచు తెల్పు
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా !
జ్ఞానివగు నీవు !

యువకుడవగునీవు
ఉద్యోగమే లేక
యుడికిపోకుండా
తిరిగి గ్రామాలన్ని
పూర్వపద్ధతినుండ
పంచాయితీలుండ
వలె నంచుదెల్పు
సారస్వతాలయా
లూరూర నెలకొల్ప
లేవరా సోదరా !!
జ్ఞానివగు నీవు !!

# ఆంధ్రదేశమునందు వయోజనవిద్య*

## అత్యంతావశ్యకము - అనుకూలమార్గ ప్రచారములు.

గరిమెళ్ళ సత్యనారాయణగారు ఎం. ఎ.

### వయోజనవిద్య

"విద్యలేనివాడు వింతపశువు" అని మన గ్రంథములెల్లయు ఘోషిల్లుచున్నవి. మన భరతఖండము విజ్ఞానమునకు జన్మభూమి; సభ్యతకు ఆటపట్టు. ఏ దేశముయొక్క విజ్ఞానమునుకాని సభ్యతనుకాని ఆదేశమునందలి స్వల్ప సంఖ్యాకుల సంఖ్యనుబట్టి నిర్ణయించి ఊరకొనుటకు వీలు లేదు. ఆ విజ్ఞానమును, ఆ సభ్యతయు జనసామాన్యమునందంతటను, స్త్రీపురుష లందరియందును ప్రసరించుటకు అందలి విద్యాధికు లెట్టియుపాయములను పన్నిరో వానిని బట్టియే నిర్ణయించవలెను.

### భారతదేశ వయోజనవిజ్ఞాన ప్రచారచరిత్ర.

మన దేశమునగల విజ్ఞానమంతయు వేదములందును ఉపనిషత్తులయందును సంపుటితమై యుండినను అవి సనాతనసంస్కృతభాషయం దుండుటచేత జనసామాన్యమునకు దూరమైయుండెను. పండితోత్తము లనబడువారికి కూడ అవి కంఠతా వచ్చునన్నమాటయేతప్ప, చక్కగా గ్రహింపబడెడివా యనిన సందేహాస్పదమే. కనుక ఆ రెండింటిని యే పండితులకో విడిచిపెట్టి జనసామాన్యము కొరకు ఆ విజ్ఞానము దేశభాషలలో నిముడ్చి వ్రాయబడెను. రానురాను ఈ గ్రంథముల భాషకూడ పూర్వకాలము నాటి దగుటచేత ఆవిజ్ఞానము మొదటి పండితులకంటె కాస్త దిగువతరగతికి చెందినవారి వశమై గుప్తమై పోవుచుండెను. జనసామాన్యమునకా విజ్ఞానము విశదము చేయుటకై ఆ పురాణములను పఠించి అర్థముచెప్పుట ఒక మార్గమై యుండెను. అట్టి పురాణకాలక్షేపములు నేటికిని మనలో వ్యాపించియున్నవిగదా?

అయినను పురాణకాలక్షేపముకూడ ఒక మాదిరి ఉన్నతతరగతులవారికి మాత్రమే సాధ్యమై సాధారణ జనులకు అనవగాహమగుస్థితి యేర్పడెను. జనసామాన్యము కొరకై ఆవిజ్ఞానమే సులభమగు శతకములు, యక్షగానములు, బొమ్మలాటలు, కలాపములు, వీథిభాగవతములు, హరికథలు, మొదలగువానిద్వారా సులభతరమైన భాషలో కీర్తనలరూపముగా, దరువులరూపముగా, నాట్యముల రూపముగా, అభినయముల రూపముగా చేయబడినది. నాటినుండి యివియెల్లయును ప్రత్యేకకళలైనవి. వీని నభ్యసించుట యే ఉత్తమవిద్యాధిక, లేక మధ్యమ విద్యాధిక తరగతుల వారి గుత్తయో కాక సాధారణజనుల సొత్తైనది. ఏదో జీవనాధారవృత్తుల నవలంబించువారు మాత్రమే కాక, ఇవి ప్రత్యేక తరగతులవారికి వృత్తులు కూడ నైనవి. ఇతరవృత్తులవారి కెట్టి సత్కారము జరుగుచుండెనో జనసామాన్యము వీరి కంతకంటె యెక్కువగౌరవముకూడ చేయుచుండెను. "అన్నము బట్ట కూర్చేది మాత్రమే విద్య, తక్కినది విద్యకాదు; ఇట్టివారు కష్టపడి జీవించెడివారిని దోచుకొనే క్షుద్రకీటకములు" అనే భావమేనాడును మన ఖండమున లేకుండెను. ప్రతివ్యక్తియును తన వృత్తిని ప్రధానముగా తన కొరకును తనకుటుంబము కొరకునే అయినను, రెండవపక్షముగ జగత్తంతటి శ్రేయస్సుకొరకే చేయుచున్నాడను పవిత్రభావము వ్యాపించుచుండెడిది. ఈ కారణమున ఆనాడు "తగగతి పీడా" పిశాచభీతి జనసముదాయములో లేనే లేకుండెను.

మొత్తముపైని వేదవిదునియందేమి, పురాణపండితునియందేమి, సాధారణకథకగాయకాది నిపుణులయందేమి వ్యాపించియుండెడిదెల్ల ఒకటే విజ్ఞానము. అక్షరములు కొందరికీ, పద్యములు కొందరికీ, పాటలు కొందరికీ, మాటలు కొందరికీ యెక్కువవచ్చిన నేమి, తక్కువవచ్చిన నేమి? అసలు విజ్ఞానము వీనిలోగాక ఆత్మయం దణగియుండును గనుక సచ్ఛీలమువల్ల పోషితమగుచుండెను. గనుక ఈ ఆత్మశక్తి యెవరియం దెక్కువగా ఉంటే వారికే సర్వులును అగ్రస్థానము నిచ్చేవారు. మహా మహా విద్వాంసులు కూడ కబీరు కాళ్లమీదో, నందనారు కాళ్ల మీదో, ధర్మవ్యాధుని కాళ్లమీదో, మరి యే అజ్ఞాతజ్ఞాని

* చాగల్లునందు జరిగిన ఆంధ్రదేశ వయోజన మహాసభయం దిచ్చిన యుపన్యాసము.

కాళ్ళమీదనో పడి శుశ్రూష చేసి తరించుచుండెడివారు. ఈరీతులవల్ల విజ్ఞానమే యొక్కరియొక్కయు కొణాచి కాక గాలివలె, నీరువలె, వెలుగువలె, వేడిమివలె సర్వజనలభ్యమై యుండెడిది. కొందరు తమ ఆత్మశక్తినిపట్టి దాని నెక్కువగా పీల్చుకొనువారు. కొందరు తక్కువగా పీల్చుకొనువారు ఎవ్వరో ఆధ్యాత్మిక శిక్షా వాంఛితులకు తప్ప ఇది నిర్బంధము కాక యథేచ్ఛము గానే ఉండెడిది. ఈ మాదిరివయోజనవిద్య నేటికిని జనసామాన్యమునందు వ్యాపించియే యున్నది. ఉత్తమ తరగతులను తలదన్నగలవారు సాధారణజనులలోనే యెక్కువగా నున్నారన్న ఆశ్చర్యముకాదు. దానికి కారణములును తెలుపబడినవి. ఇది పూర్వకాలపు వయోజన విద్యాపద్ధతి. ఇట్టి వయోజనవిద్యావిహీనులు నేడు మన భరతఖండమున లేనే లేరనిన ఆశ్చర్యముకాదు. కనుకనే నేటి భారతీయులు కేవలము అక్షరజ్ఞానమునందో, భౌతిక చారిత్రకాదిసాధారణ విద్యాజ్ఞానమునందో ఇతరదేశస్థుల కంటె చలా వెనుకబడియున్నను, మనోతత్త్వమునందు, సూక్ష్మబుద్ధియందు, ఆఖరుకు ఆధునిక ఆర్థిక సాంఘిక రాజకీయసమస్యా పరిగ్రహణమునందు ఇతరదేశస్థులకు తీసిపోరని మన జనసామాన్యముతో అభవముగల పాశ్చాత్య శిరోమణులే అభిప్రాయమును చెప్పుచున్నారు. ప్ర ప్రధానమగు మహావిద్యకు ఈ దేశమున లోపము లేక పోయినప్పుడు, ఈ చిల్లరపల్లర విద్యలు వారికి వంట పట్టునట్లు చేయుట ఒకకష్టముకాదు. ఇదేమీ బ్రహ్మ విద్యకాదు. ఈ క్షణము స్టేటస్టిక్సు తీసుకోగానే మన వారిసంఖ్య ఈ స్వల్పవిషయముల యందు చాలా తక్కువగా ఉన్నంతమాత్రమున, భారతీయులు తక్కిన దేశస్థులకంటె బుద్ధితక్కువవా రని అర్థముకాదు. అక్షరజ్ఞానమో, లెక్కలజ్ఞానమో, జాగ్రఫీ హిస్టరీ ఆది ఆధునిక శాస్త్రముల జ్ఞానమో మనవారికిప్పుడు తక్కువగా ఉన్నదంటే, దానికంతటికీ ఒకే కారణము. కొన్ని పాశ్చాత్యదేశములలో సుమారు నూరు సంవత్సరములనుండిన్నీ, మరికొన్నింటిలో గత పదియిరువది సంవత్సరములనుండిన్నీ దీనిని గురించియే కృషి యెంతయు జరుగుచుండగా, మన ప్రారబ్ధకర్మవశముననో, విదేశప్రభుత్వదాస్యమువలననో మన కీదృష్టి తక్కువయై యుండుటయే మన ప్రజాసామాన్యముయొక్క ప్రస్తుత "అజ్ఞానము"నకు కారణము. ఏ అయిదేళ్ళ ప్రణాళికయో, పదేళ్ళ ప్రణాళికయో, పెట్టి దేశమంతటను ఒక్క ఊపుఊపినయెడల ఆకాశమునుండి అమృతమువలె ఈ నవీనశాస్త్రజ్ఞానము మన ప్రజలపై కురియకమానదు.

## నిజమైన విజ్ఞానమేది?

మనదేశము నిన్న మొన్నటివరకు కొన్ని ప్రాతమత మూర్ఖసిద్ధాంతముల కెట్లు బానిసయై యుండెనో, నేడు కొన్ని నవీనమత మూర్ఖసిద్ధాంతములకు కూడ అట్లే బానిసయైనది. దీనికి కారణము కొన్ని పాశ్చాత్య మూర్ఖసిద్ధాంతముల వ్యాపనమే. నిజముగా పాశ్చాత్యదేశము లన్నియు ఈదృశ్య ప్రపంచమును తప్ప వేరొకదానిని చూడనొల్లక దాగట్లోపడ్డ వెలంకాయవలె కొట్టుకొనుచున్నది; గనుక దాని కొక సిద్ధాంతమంటూ ఉన్నదా అంటే ఆశ్చర్యమగును. వారి "విజ్ఞానము"నకు నేటికిని నిలకడ యేర్పడలేదు. సర్వమును emperical state లో ఉన్నది. నిన్నటి సిద్ధాంతము నేటి రాద్ధాంతము, ఇప్పటి రాద్ధాంతము మరో నిముషమునకే సిద్ధాంతమును అగుచున్నది. ఈ రాద్ధాంత సిద్ధాంతములలోపడి పాశ్చాత్యదేశము లన్నియు క్షణక్షణమునకును తారుమారు తక్కెడమారు అగుచున్నవి. ఎవరి సిద్ధాంతమునందు వారు మౌర్ఖ్యమును విడువకున్నారు. ఈ సిద్ధాంతములలో నెల్ల విపరీతసిద్ధాంతము "ఈ ప్రపంచమే శాశ్వతము, ఇందు కొరకే మనము తన్నుకొని చావవలెను; ఆత్మజ్ఞానమనునది మిథ్య." ఈజ్ఞానపిపాసవల్లనే నేడు భరతఖండమును ప్రాచ్యదేశములును దాస్యమునందు కూలియున్నవి. వానికి భౌతిక దాస్యమునందు ప్రీతి హెచ్చు; స్వాతంత్ర్యము వారికి సాయించదు. వారి తత్వమును పాశ్చాత్యగాథలతో నింపి సంస్కరింపవలెను; లేకున్న పాశ్చాత్యులు నిర్మించిన ఈ భౌతిక నాగరికతా పరిణామమునకు అవి వేరుపురుగులై అంతటిని నేలమట్టము చేయును. కనుక ప్రపంచ శ్రేయోభిలాషు లందరును "వారికి నిజమైన విజ్ఞానమబ్బేవరకు వారి నీరీతి దురవస్థయందే బిగపట్టి యుంచవలెను" అనునది మొట్టమొదటిలో ప్రాచ్యఖండముల దోచుకొన గోరిన పాశ్చాత్య వర్తక సామ్రాట్టులకు ఇది అనుకూలమైన సిద్ధాంతమువలె గోచరించెను. వారి నాగరికత మెరుగున దిలకించిన మన పాశ్చాత్యమానస పుత్రులకుగూడ ఇది సత్యమువలెనే గోచరింపజొచ్చినది. నేటికిని అనేక పాశ్చాత్యవిద్యావిభాసితుల డెందముల నీ సిద్ధాంతము పండించుచునేయున్నది. అయినను భరతఖండములోని జనసామాన్యముయొక్క ఆత్మ యింకను కళంకితముకాలేదు. ఇట్టి దుష్ట గాలి వారిపై వీచీ వీచడములో నిజమైన విజ్ఞానముయొక్క తేజస్సు వారిపై నేమూలనుండియో పడుచున్నది. అది వారలకొణాచి; దానిని చెరిపివేయుట దుస్తరము. పాశ్చాత్యదేశముల ఆధునిక ప్రపంచానుకూల విజ్ఞాన

వ్యాప్తికది యెంతమాత్రమును ప్రతిబంధకముకాదు సరేగదా, సంస్కరణ మార్గమును సహాయిక విధానమునుకూడ అయివున్నది. కనుక మన ఆధునిక విజ్ఞానప్రచార ప్రయత్నముల నెన్నిటిని చేయుచున్నను, ఈ సనాతన సిద్ధాంతములయందు వారికిగల విశ్వాసములను చెరుపకుందుముగాక !

## ఆధునిక విజ్ఞానప్రయత్నములు.

మనకు కావలసినది మన ప్రాతవిజ్ఞానముపై విరోధదృష్టి కాదు; ఆధునిక విజ్ఞానముపై సానుభూతిదృష్టి. ఆధునిక విద్యావిధాన లక్షణములను కొన్నిటిని పేరుకొందము.

(1) సర్వులకును అక్షరజ్ఞానము. ఇది మొట్టమొదటి అవశ్యకత! ఓనమాలు, అయిదుబరుల, అక్షరములు, గుణింతము, పేరులు, గ్రంథపఠనము, సులభశైలిని రచనాచాతుర్యము, వాగ్నైపుణ్యము, సాధారణలెక్కలు - ఇవి ప్రతివ్యక్తికిని వచ్చియుండవలెను. దేశములోని పెద్దలు పిన్నలు ఉపాధ్యాయులు శిష్యులు ఇందువిషయమై శ్రద్ధబూనిన యెడల ప్రతివ్యక్తికిని విద్యాభ్యాస ప్రారంభమునుండి ఒక సంవత్సరములోపున వారి జీవనాధారములగు వృత్తులకు భంగముగానిరీతిని దీనిని సాధించుట కష్టముకాదు. టర్కీలో కమాలుపాషా, రష్యాలో సోవియట్ ప్రభుత్వము, జపానులో చక్రవర్తి ఈ విజ్ఞానమును అనతికాలములో సాధించినారు. అసలు విజ్ఞానమునందు పట్టముకట్టుకొన్న మన భరతఖండమునకు ఇది యెంతయు సుసాధ్యము.

(2) కేవలము అక్షరజ్ఞానము, అంకెలకూడికతో తృప్తి చెందక ప్రపంచభూగోళము, ప్రధానదేశముల చరిత్ర, అవి అభివృద్ధినిపొందిన రీతులు, భరతఖండముయొక్కయు ఆంధ్రదేశముయొక్కయు కథలు వారికి తెలియవలెను. చదువనేర్చినవారందరును పుస్తకములను పఠించియే దీనిని గ్రహింతురని మన మూహించరాదు. మానవునకు చదువన్నది, కావలసిన అనేకపరికరములలో నొకటి. దీనికై అందరును తక్కినవాని నన్నిటిని విడనాడనూ జాలరు. విడనాడుట వివేకమునుకాదు. అయినను దీని నసడ్డచేయుటకు వీలులేదు. దీనిని గూర్చిన సులభగ్రంథములు వ్రాసి పాఠశాలలలో నేర్పుట, గ్రంథాలయములలో నుంచుట, ప్రజలలో వినిపించుటమాట అటుండనిచ్చి అప్పుడప్పుడు కొందరు పండితులు వీరి కీసంగతుల నుపన్యసించుచునే యుండవలెను. కొన్నిటిని కొందరు మరచుచుండినను కొందరు జ్ఞాపకముంచుకొనుచునే యుందురు. కొందర కీవిధముగా ఉత్సాహము పుట్టి తీరికసమయములలో ఆయా గ్రంథములను పఠించుచునే యుందురు. ఈ రీతిని ఈవిజ్ఞానము అరిపోకయే నిలుచుచుండగలదు. ఇందుకై కేవల ముపన్యాసములతో తృప్తిపొంది యూరకొనక చిత్రపటములు, దేశపటములు, ప్రాచీనచిత్రములు, అందుకు సంబంధించిన పాటలు పద్యములు వ్యాపింపచేయుచుండవలెను.

(3) అక్షరజ్ఞానము, లెక్కలు, భూగోళశాస్త్రము, చారిత్రక విజ్ఞానము తరువాత ప్రధానమైనది ఆధునిక సంఘలవిజ్ఞానమై యున్నది. సివిక్సు, కోఅపరేషను అర్థశాస్త్రము, బ్యాంకింగు, భీమాతత్వము, రాజ్యాంగశాస్త్రము, వోటుహక్కులు ప్రయోజనములు, పౌరసత్వపు హక్కులు, పబ్లికువర్కు, పోష్టు అందు టెలిగ్రాపుల చరిత్ర మొదలైనవి ఉపన్యాసముల మూలమునను గ్రంథములమూలమునను కూడ తెలుపుచుండవలెను. ఈ రెండిటికంటెను గూడ ఈవిషయమున ప్రధానమైనది అనుభవము. ప్రతిమానవునకును వీనితో నెంతో కొంతసంపర్కముండనే యున్నది. కలిగించుకోని వారికి కూడ మనము కల్పించుకొనుట నేర్పవలెను. జనసామాన్యము కల్పించుకొనకుండ ఉండనేరదు, అయినను అబుద్ధికి మనము దోహదము చేయుచుండవలెను. ఇది ముఖ్యముగ రాజకీయ వేత్తల ప్రజాహిత సేవకుల కర్తవ్యమైయున్నది. ఇందువలన ఉభయులకును హితము చేకూరును. దేశమునకును మంగళమే కలుగును. మొట్టమొదటిలో ఇది కష్టతరముగా కనిపించినను, రాను రాను ఇది ప్రజల జీవితమును చీడపురుగువలె పట్టుకొని విడువజాలదు. ఇప్పటికే మనదేశ ప్రజలకు వర్గచైతన్యము, వృత్తిచైతన్యము కులమత రాష్ట్రజిల్లా చైతన్యములు మొదలగు వానిమూలమున ఈ తత్వము బాగా యొడలికెక్కినది. ఇట్టి చైతన్యజ్ఞాన మనవసరమని యెవరు చెప్పినను ప్రయోజనము లేనట్లున్నది. అయినను ఈ ప్రత్యేక చైతన్యములు పరస్పర ప్రతికూలములును, దేశారిష్టములును కానట్లు చూడవలసిన విధి విజ్ఞానులెల్లరిదై యున్నది. అసలు విజ్ఞానము లేక నిజమైన విజ్ఞానముయొక్క తత్వము బాగుగా వంటికి పట్టిన మనదేశపు పెద్దలు ఈ చిలిపిసమస్యలపై ఘోరయుద్ధమును రేపకుండనే ఈ చైతన్యముల నన్నింటిని పోషించి, పరస్పర సాహచర్యమును గరపి, తద్వారా రాగల అఖండభౌతికశాస్త్ర పోషణమునకు కారకులు కాగలరు. ప్రత్యేకతపై దృష్టిచే సమిష్టిజ్ఞానమును కాని, సమిష్టి తత్వవిశ్వాసమువల్ల ప్రత్యేక వికాసమునుగాని విస్మరించి అగాధమునపడు జాతి మన భారతజాతి యే నాటికిని కానేరదు. దేని కెట్టి గౌరవము నీయవలెనో మన భారతజాతికి బాగుగా తెలుసును. ఆ తత్వమును పోషిం

చుటకే ప్రతివాడును ప్రయత్నించవలెను. అట్లు చేసినచో నేయొక్క వ్యక్తికిగాని కూటమునకుగాని భంగము రానట్లు దేశశ్రేయస్సును, దేశశ్రేయస్సుకు భంగముకాని రీతిని వర్గసంపోషణమును కూడ కలిగితీరును.

(4) జీవులకు ప్రధానమైనది ఆహారము. మానవులకు ఆహారముతో తుల్యముగ ప్రధానమైనది అచ్ఛాదనము. కూడూ గుడ్డా ప్రతివ్యక్తికీ ప్రప్రధానములు. ప్రపంచమును విడిచిపెట్టిన బైరాగులు తప్ప ఈ రెండింటిని యెవ్వరును విస్మరింపజాలరు. ఈ రెండింటిని ప్రతివానికిని కనిష్ఠముగానైనను సమకూడునట్లు చేయగల బాధ్యతను సంఘము వహించవలెను. మితవ్యయపరాయణులు, లోభులు, దూరదృష్టితో ధనప్రధానదృష్టి గలవారు వీనిని ఇతరులకంటె కొంత యెక్కువగా చేర్చుకొని మురియవచ్చును. అల్పసంతోషులు, సాధారణదృష్టి గలవారు, దూబరాకోరులు, ఉదారశీలురు, వీనిపైని మితిమీరిన దృష్టిని పెట్టుకోక పోవచ్చును. ఈకారణములవల్ల ఆర్థికవిభేదములు పొడముచుండవచ్చును. అవి పూర్తిగా కూడదనే జాతి ఇంకా పుట్టలేదు. ఈ విభేదమునకు తావు నొసంగుటవలననే మితవ్యయము, బ్యాంకులు, పరిశ్రమలు, సంపదలు మొదలైనవి ప్రపంచమున పెరిగి నాగరికత నాలుగుకాళ్ళమీదను పరుగెత్తుచున్నది. కాని ఈ ఆర్థికలేక వ్యాపారనాగరకత వర్ధిల్లిన కొలదిని పేరాసకు పట్టము కట్టబడినది; అంచనాలు (Speculations) మించుతీగలవలె మెరసినవి. అయినవారు కోటీశ్వరులు అగుట, లేనివారు మలమల దాస్యకూపమున వాడుట మామూలైనది. ప్రతివానికిని తనసంపద, దానిని పెంచే సంస్థ వర్ధిల్లడమే ప్రధానమైనదికాని ప్రపంచశ్రేయోదృష్టి వెనుకకు తగ్గినది. వస్తువుల అభివృద్ధికంటె లాభములపై దృష్టి యెక్కువయినది. లాభములను తేజాలని సృష్టిని ధ్వంసము చేయుట ఆర్థికధర్మసూత్రమైనది. మానవులను నిర్వ్యాపారులను చేసి మిల్లులకు పట్టము కట్టబడినది. ఇదియే నేటి అల్లకల్లోలములకు యుద్ధములకు హేతుభూతమైనది. ప్రభుత్వములు వీటిని తీర్పగల సమర్థములుకాక క్షణక్షణభంగురములగుచున్నవి. నిర్మితమైన నాగరకతయెల్లయు నిముషములో నేలకూలుచున్నది. మాడ్రిడ్, షాంఘీ మొదలగు నగరములు పేకముక్కలతో పిల్లలు కట్టినమేడలవలె ఊదితే పడిపోవుచున్నవి. దీనికి ప్రతిహారమును కనుగొనుటకే పాశ్చాత్యదేశము లిష్టముపడకున్నవి.

దీని కంతటికిని ప్రతీహార మొక్కటియే. అదియే గాంధీమహాత్ముని దివ్యసూత్రము. ప్రతిమానవునకును ఒక జీవనోపాధికరమగు వృత్తిని చూపవలెను. ఏపూంజీదారు కాని మిల్లుకాని దానికి భంగము చేయరాదు. మానవుని ప్రజ్ఞ హస్తనైపుణ్యము బుద్ధి చాతుర్యము నందును గలదు కాని మిల్లుసీలలను త్రిప్పుటలో లేదు. మిల్లులు, విద్యుచ్ఛక్తి, పొగయంత్రములు, విమానములు మొదలగునవి చాలా తక్కువగా మాత్రమే మానవ శ్రేయోభివృద్ధికై కావలసియున్నవి. ఆ మితినితప్పించి వాని కగ్రస్థానమునిచ్చినచో ఎప్పుడో ఒకనాడు అవి మానవలోకము నంతటిని దిగమ్రింగకమానవు. మహాత్ముడు మిల్లుల విరోధికాడు, మానవమిత్రుడుమాత్రమే. మానవునకు తన వృత్తిపై తనకధికారమున్నప్పుడే తన ఆహారముపైని అతనికి హక్కును చలాయించగల శక్తివచ్చును. ఆహక్కును మిల్లుకు స్వాధీనము చేసినచో అతనిని ఒకనాడు రెండు నాళ్ళు యెవరైనను రక్షింతురేమోకాని సర్వకాలమును యెవ్వరును రక్షింపజాలరు. మానవులు ప్రభుత్వములను రక్షింపవలెనేకాని ప్రభుత్వములు మానవులను పోషింపజాలవు. మానవుని నుండి మిల్లులు దొంగిలించిన ఈహక్కును తిరిగి మానవులు ఊడపీకుకొనకున్నచో వారి దాస్యమును దారిద్ర్యమును యేదో యొకరూపమున తాండవ మాడుచునేయుండును.

మిల్లు పరిశ్రమలు మరికొన్ని దేశములకు మనకంటె యెక్కువ ఆవశ్యకములేమోకాని మనదేశమునకు కావు. మనదేశపుమిల్లులే మనకు వద్దో అంటే ఇతరదేశముల మిల్లు వస్తువుల దిగుమతిని మన మెట్లు సహించగలము? మన మందరమును హటాయించి నిలచినయెడల, ప్రభుత్వము మనము చెప్పినట్లు విననియెడల యేదేశమును నయముననగాని భయముననగాని తమ సామగ్రిని మన పై పులుమగలదు? మనదేశమువలె అన్నిదేశములును ఇట్లే హటాయించినచో ఇప్పటిపూంజీదారు దేశములలో మిల్లులెల్లయు నేలకూలి, అవికూడ చేతిపనులకు పట్టము కట్టకతప్పదు. లేదా మిల్లులకు దాస్యము చేసుకొనుచు కష్టము లనుభవించగలవు. మిల్లుల కొరకును, మిల్లుపరిశ్రమ దేశముల సౌభాగ్యముకొరకును మనదేశపు వ్యవసాయకులను, రైతులను, సాలెవారిని, కమ్మరులను, కుమ్మరులను వడకునూలు వారిని మనమాహుతి చేయ జాలము. ఈ అశేషమహాజనులను వారివారికాళ్ళపై మనము నిలబెట్టవలెను. ఇదియే గాంధీమహాత్ముని గృహపరిశ్రమ, ఖాదీ, రాట్నసిద్ధాంతములయొక్క రహస్యము. ఈసిద్ధాంతమువధింపబడుట చేత నేలఅహింసాసిద్ధాంతముకూడ హత్యగావింపబడినది. పూర్వకాలపుయుద్ధములలో యే కొందరినో యే కొందరో చంపుటవల్ల చచ్చినవారు వచ్చి

నను బ్రతికినవారు హాయిగా ఉండేవారు. ఈమిల్లు నాగరికతలో మానవుల వృత్తులే హత్యగావింపబడుట చేత, హింసాదేవి వేయికాళ్ళతో పరుగిడుచు అమాయకప్రజల నందరను అకారణముగా నోర్లకొని పోవుచున్నది. ఇది యుద్ధములేని హింస, దౌర్జన్యమునకు దారితీయు అక్రమము. భారతీయులు నిజమైన విజ్ఞానవాంఛాపరులై, సత్యనిరతులై అహింసా వ్రతులై, నిరుద్యోగసమస్యానివారణమునందు ప్రపంచమునకు మార్గదర్శకులై రాణింపగోరుచో మిల్లులనబడెడి ఈ వేలముత్త్రిలో పడకూడదు. నగరములను తగ్గించి గ్రామములకు మరలవలెను. సోమరితనమునుమాని యీ వృత్తులు పూనవలెను. అనారోగ్యపద్ధతులు మాని ఆరోగ్యముతో బలియవలెను. దూబరాతనమును మాని మితముతో వర్తింపవలెను. సౌఖ్యపిపాసయందుకంటె సత్ప్రసంగములయందును సద్గోష్ఠులయందును యెక్కువ మక్కువ చూపవలెను. ఈ విషయమున మనము పాశ్చాత్యానుకరణముకంటె ధిక్కరణమునే యెక్కువగా చూపుటమంచిది. మానవునకు నిజమైనకీర్తినిగూర్చునది రంగుల బొమ్మలు, అంగప్రదర్శనములు, వెంగలిచర్యలు, దొంగ దొంగనవ్వులుకావు. అశాశ్వతమగు స్వప్నతుల్యమగు యీ భౌతికప్రపంచమునందు ఉండకతీరనంత స్వల్పసంబంధమును పెట్టుకొని ధన్యతమజీవనము నడపుట, దీనిని కాదని విపరీతముగ వర్తించువారిని పొగడుటమాని పరిహాసదృష్టితో తిలకించుట, మానవజీవితమునకు పెంపును ముక్తినిగూర్చు శాశ్వతసమస్యలయందు ఆదరణము చూపుట యైయున్నది. గ్రామోద్ధరణసేవకులందరును ఈ తత్వమునే బాగా అలవాటు చేసుకొనవలెను. ఈ తత్వము గలవారి యెడలనే గ్రామములు చిరతరగౌరవములు ప్రకటించుచుండును. ఇంతేకాని గ్రామాలను మరమ్మత్తు చేయబోయి వాటిని నగరాలకిందికి మార్చగోరెడివారికి తొలుదొలుత యేదో కొంత విజయముబోలె కనిపించి నివేదికలు వ్రాసుకొనుట కనుకూలించినను, క్రమక్రమముగా ఇందులోని గుల్లయెల్లయు బయలుపడును.

(5) మిల్లులు, యంత్రములు మరలు మొదలగువానివలన మానవజీవనమునకు ప్రస్తుతము కలుగుచున్న అనర్థములను బట్టి వాటిని మనమింతగా ఖండించుచున్నాము. కాని మిల్లో, మరో, యంత్రమో కానిదేది? మానవశరీర మొక యంత్రము కాదా? ఏ చేయి కావలసిన ఆ చేతిని త్రిప్పగలము, ఏ కాలు కావలసిన దాని నాడించగలము, నాలుకతో మాట్లాడగలము, కన్నులతో చూడగలము, బుద్ధితో ఆలోచించగలము. మనము మూసుకొనెడి తలుపులలో, చేదుకొనెడి గిలకలలో, తాళములు వేసుకొను పెట్టెలలో, సాలెవానిమగ్గములో, కుమ్మరివానిసారెలో, కమ్మరివాని కొలిమిలో, యెక్కబండ్లలో, తిరిగేపడవలలో యెన్నివిధములైన మరలు లేవు? అయితే వీనివలన మానవుల వృత్తులు, జీవనాధారములు నశించుటకు బదులు, వర్ధిల్లుచున్నవి. కాని విదేశముల నగరముల మిల్లులు వృత్తులను బుద్ధిని ధ్వంసముచేసి దేశమున దారిద్ర్యమును ప్రసరించుచున్నవి. మానవజీవనమును పల్లెటూరి మరలు సౌఖ్యతరములు చేయుచున్నవి. వాని నింకను అభివృద్ధి చేయుటకు వీల్లు ఉన్నవి. రాట్నములతో ఇప్పటికంటె యెక్కువ దారమును తీయుటకు, మగ్గములతో ఇప్పటికంటె అందమైన బట్టలు నేయుటకు, మరలతో నూతులనుండి చెరువులనుండి యింతకంటె నెక్కువ వేగముగ నీరు పారించి తోటలను చేలను నింపుటకు క్రొత్తరకపు నాగళ్ళతో భూమి నెక్కువలోతుగా దున్ని యెక్కువ ఫలవంతముగా చేయుటకు, మంచిరకపు విత్తనములను సేకరించుటకు, అంటుమొక్కలను సిద్ధము చేయుటకు, పట్టు పురుగులు, తేనెటీగలు, టర్కీకోళ్లు, వింతగొఱ్ఱెలు మొదలగు వానిని పెంచుటకు, బెల్లములు చక్కెరలు సులభరీతిని వండుటకు ఎన్నెన్నో పరిశోధనలు అన్నిదేశములందును జరుగుచున్నవి. మనయువకుల నాదేశములకు పంపి నేర్చుకొని రమ్మనవచ్చును, లేదా వారే అట్టి పరిశోధనలకు దిగవచ్చును. ఇట్టి పరిశోధనలవలన ఉత్పత్తి మిల్లులలోవలె మితిమీరి విధ్వంసకరమును కాదు, మామూలుగావలె అంతకష్టతరమును కాదు, సౌఖ్యదాయకమై ఆనందదాయకమైయుండును.

## ప్రారంభవిద్యావిజృంభణము

ప్రయోజన విద్యామార్గములు కొన్ని పైని సూచింపబడినవి. వీనిలో అక్షరములు, లెక్కలు, చారిత్రకభూగోళశాస్త్రజ్ఞానము మొదలైనవి తప్ప తక్కినవి ఒక్కనాటితో తేలువవికావు. దేశకాలపరిస్థితులలోని మార్పులను బట్టి అవి పరిణామము నందుచుండునే కాబట్టి వానిని గూర్చి సంతతపరిశ్రమయు బోధనమును జరుగుచుండవలసినదే. పైని చెప్పిన సాధారణజ్ఞానము నిజముగాచూచిన యెడల ప్రయోజనవిజ్ఞానములోని భాగమే కాదు. ఉచితవయస్సు రాకముందే, అనగా ప్రాథమిక విద్యాభ్యాసకాలములోనే అది వచ్చియుండవలసినది. దాని నిన్నాళ్లాయి మన మసడ్డ చేసితిమి కనుక పెద్దవయస్సునందే వానిని ప్రారంభించవలసి వచ్చుచున్నది. పెద్దవయస్సులో ప్రారంభించుచున్నాము గనుకనే వీనిని ఒకటి రెండు సంవత్సరములలో

ముగించవచ్చుననుకొనుచున్నాము, కాని చిన్నతనములో అయినచో అయిదారు సంవత్సరముల కోర్సు అయినను యెక్కువ చిరస్థాయిగా ఉండగలదు - ఇట్టి విజ్ఞానమును నేర్చుకొనుటకు ఆరుమొదలు పదునెనిమిది వత్సరముల వయస్సులో నెప్పుడైనను చాలును. కొందరికి 6 నుండియే బుద్ధి చురుకుగా ఉండి విషయములను వేగముగ గ్రహింతురు. కొందరిబుద్ధికి 10, 12వ వయస్సునుండియే చురుకుతనము ప్రారంభమగును. కొందరికితరగతి కొక్కొక్కయేడాది చాలును; కొందరికి కొన్ని తరగతులకు రెండేసియేండ్లు కావలసివచ్చును. కొందరికి రెండు పూటలను చదువుకొనుటకు వీలుండును, కొందరికి ఒకపూటయే వచ్చుటకు వీలుగా ఉండును. ఏది యెట్లున్నను పనితరగతి మొదలు యేడవతరగతివరకు ప్రస్తుత ప్రాథమిక పాఠశాలలో నేర్పెడి విద్యను ఈవయస్సులోనే అందరికిని పూర్తిచేసినచో, తరువాత తక్కిన వయోజన విజ్ఞానమును వారు సావకాశముగ నేర్చుకొనవచ్చును.

## ప్రాథమికోపాధ్యాయుల ట్రెయినింగు తరగతులు.

వయోజనులకు కావలసిన యీ ప్రాథమిక విద్యయు, ప్రాథమిక తరగతులలోని ప్రాథమికవిద్యయు ఇంచుమించుగా ఒక్కటే అగుటచేత ఆయా గ్రామములలోని ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులే రాత్రివేళలందు వయోజనులకు ఈపాఠములను గరపవచ్చును. అయినను ప్రాథమిక బాలురకు నేర్పు విధానముకును, ప్రాథమిక వయోజనులకు నేర్పు విధానమునకును, ఈషద్భేదముండును. విద్యా ప్రసంగ విధానములందును భేదముండును. ప్రాథమిక విద్యతోబాటీ ఇతరప్రసంగములను కూడ నేర్పుచున్నయెడల వయోజనులకు విజ్ఞానకరముగను మనోరంజకముగను కూడా ఉండును. ఇందుకై ప్రాథమిక పాఠశాలోపాధ్యాయులకు సంవత్సరమునకు రెండు మాసముల ట్రెయినింగు నిచ్చుట అనవసరముకాదు. వారికికూడ కొంత విజ్ఞానాభివృద్ధి యగునట్లు పదిమంది పెద్దల ప్రసంగములు, నూతన బోధనా విధానములు గరపి ఉత్సాహము పుట్టించవలెను. వీరు చేయు ఈనూతన పరిశ్రమకు పారితోషికముగా అధికజీతములను నీయవచ్చును. తాడేపల్లిగూడెము తాలూకాబోర్డువారు వయోజనవిజ్ఞానము నీరీతినివ్యాపింపజేసిరి. నర్సాపురం జిల్లాబోర్డు వారిస్కీమును ఈవిధానమునే సూచించెను. సకల ఆంధ్రదేశమునందును ఈరీతి వయోజన విద్యా ప్రణాళికయే అవలంబింపబడవలెనని సూచింపబడెను. అందరును ఇట్టి తీర్మానములను చేసి మదరాసు ప్రభుత్వమును ఇట్టి కార్యక్రమమునకై తొందరపెట్టవలెనని కోరుచున్నాను.

ప్రాథమికోపాధ్యాయునికి గ్రామమునందు ఒక మేస్తరు ఆచార్యస్థానము నీయవలెను. ఊరిమునసబు, కరణము గ్రామపరిపాలన వ్యవహారములలో నెట్లో విద్యావిషయములందు ఈ ఉపాధ్యాయులట్లే గ్రామస్థులకు నెచ్చెలులై సలహాదారులై వర్తింపగలుగునట్లు చూడవలెను. వీరికట్టి గౌరవము రావలెనంటే చిన్ననాడు నేర్చిన నార్మలు స్కూలు సెకండరీగ్రేడు ట్రెయినింగులు చాలవు. దేశపెద్దలతో పరిచయము, నూతనోద్యమముల చరిత్రము, క్రొత్తక్రొత్త బోధనాపద్ధతులు, ఉద్యోగ అనుద్యోగ వర్గములవారితో మైత్రి, వారితో స్వతంత్రముగా చర్చించగల ధైర్యసాహసములు, నూతనప్రభుత్వవిధానముయొక్క తత్వము ఈమొదలైన విన్నియో వారు కలిగియుండవలెను. ఇందువలన వారు కేవలము వయోజనవిద్యాప్రచారమునకే గాక, బాలురకు నేర్పెడి ప్రాథమిక విద్యావిధానమునందు కూడ క్రొత్తమార్గముల నవలంబింపగల్గుదురు. బాలురకు నేర్పెడివిద్య వారికి కేవలము విషయప్రబోధకరముగా మాత్రమేకాక యుక్తమగు వయోజనులుగా చేయగల సాధనమైకూడ వర్తింపగలదు. నేటివిద్యార్థులేగదా గ్రామములలోను నగరములలోను రేపటివయోజనులగుచున్నారు. కనుక వీరియెడ నెటువంటి తీక్షణశ్రద్ధను బరపవలెనో ఈ స్వల్పకాలట్రెయినింగులో వారికి గోచరమగును. ఆంధ్రరాష్ట్రమునందంతటను ఏకముహూర్తమున ఇట్టి ప్రణాళిక ప్రారంభిత మగునుగాక!

---


# ప్రకృతి - బెజవాడ

ఆరోగ్యవిషయిక సచిత్ర వైద్యమాసపత్రిక.

మానవుడు ఆరోగ్యవంతుడుగ నుండుట, రోగములు రాకుండుట, నీరు, గాలి, మట్టి, సూర్యకిరణ, స్వాభావికాహార, యోగవ్యాయామ, ఉపవాస, విద్యుత్కాంతశక్తి మొదలగువాని సహాయమున రోగములను కుదుర్చువిధానములను తెలుపును. చందాదారులకు ప్రకృతివైద్యపుస్తకములన్నియు తగ్గింపుధరల కియ్యబడును. చందా రు. 3 లు.

# శ్రీదుర్గాపూజ - పశుబలిదానము

శ్రీపండిత మదనమోహన మాలవ్యాగారు

"యజ్ఞము పేరిడికొని మాంసము భుజించుట ధర్మముకాదు" అని అహింసాపక్షమున ప్రమాణముకలదు. అయినను "అహింసా వైదికం కర్మ యజ్ఞార్థం పశవః సృష్టాః, యజ్ఞే వధోఽవధః" మొదలగు శాస్త్రవచనముల నాధారముచేసికొని భట్టాది మీమాంసకులును, తంత్రశాస్త్రజ్ఞులును "దేవతాయజ్ఞ సంబంధమగు పశుహింస హింస కానేరదు; కాబట్టి ఆరూపమున చేయుహింస వలన యజమానులకు పాపదోషము లుండవు" అందురు. కాని కొందఱు వివేకజ్ఞులు దేవతాది నిమిత్తమగు పశుహింసయు హింసయే అనియు పాపఫలము సిద్ధించు ననియు సిద్ధాంతీకరించి యున్నారు. ఈసిద్ధాంతమున కనుకూలాధారములు శ్రుతిస్మృతులయందును గీతాభాగవత మహాభారతము లందును పురాణము లందును పూర్తిగా లభించుచున్నవి. భారతమందు అనుశాసనికపర్వమున ౧౧౫వ అధ్యాయములో భీష్ముని ధర్మరా జిట్లు ప్రశ్నించెను. "ఓపితామహా! నీవు అహింసనుగూర్చి మహత్వపూర్ణముగా చెప్పియున్నావు. కాని శ్రాద్ధాది కర్మలందు పితృదేవతలకు మాంసము నిచ్చుటను గూర్చి చెప్పియున్నావు. మంచిది. హింసలేక పితృదేవతలకు మాంస మెట్లులభించును? ఈవిరుద్ధవిషయమునుగూర్చి నాకర్థమగుటలేదు." అనఁగా భీష్ముఁ డిట్లు బదులుచెప్పెను. "యుధిష్ఠిరా! మాంసమును విడిచి అహింసతో కూడినకర్మ చాలమహాత్తుకలది. రూపము, కాంతి, బలము, ఆయువు కీర్తి, స్మృతి, వృద్ధి కోరుకొను మహాపురుషులు హింసను మానివేయుదురు."

"రూప మవ్యంగతా మాయు
ర్బుద్ధి సత్త్వం బలం స్మృతిమ్
ప్రాప్తుకామై ర్నరై ర్హింసా
వర్జితా వై మహాత్మభిః."

'యుధిష్ఠిరా! వాలఖిల్య సప్తర్షి మారీచ్యాదులు మాంసమును భుజింపమిచే ప్రశంసనీయులైరి. ఏమానవుడు మాంసమును తినకుండునో, వధచేయకుండునో, చేయింపకుండునో, అతడు ప్రాణికోటికి మిత్రుడని మనువుపల్కెను.'

"న భక్షయతి యో మాంస
నచ హన్యా న్న ఘాతయేత్
తన్మిత్రం సర్వభూతానాం
మనుః స్వాయంభువోఽబ్రవీత్."

ఈవిధముగా ప్రమాణములను తెలుపుచు భీష్ముడు తన ఉద్దేశము నిట్లు వెల్లడించెను. "ప్రతి నెలయు అశ్వమేధము నూరు సంవత్సరముల వరకు చేసినవానికి ఫలమెంత కల్గునో మాంసమును వర్జించినవానికి అంత ఫలము కల్గును."

"మాసి మాస్యశ్వమేధేన
యో యజేత శతం సమాః
నఖాదతిచ యో మాంసమ్
సమ మేత న్మతం మమ."

మఱియు మానవుడు సుఖలాలసుడై నిరాఘాటముగా పశువులను వధించినచో తాను మరణించినపిదప సుఖము ననుభవింపడని మహాభారతము శాసించుచున్నది...... ఏవిధముగా ప్రాణముపై తనకు ప్రీతియో ఆవిధముగనే ఇతరములకుకూడ ప్రాణముపై ప్రేమ కలదు. కాబట్టి బుద్ధిమంతుడు తన్నే ఉదాహరణముగా తీసికొని మెలగవలెను.

మధుమాంస త్యాగము ౧౦౦ సంవత్సరముల తపస్సుతో సమానము. పుట్టినప్పటినుండియు మధుమాంసములను విడిచినవాడు ముని సమానుడు. విద్వజ్జనులకుకూడ మృత్యుభయముకలచో, పాపము! నోరులేని జంతువులగతి ఏమి? కాన మాంసవర్జనము శ్రేష్ఠమగుధర్మము. ఇదే స్వర్గ సుఖమునకు స్థానము.

12

"అహింసకాని భూతాని
దండేన వినిహన్తి యః
ఆత్మన స్సుఖమిచ్ఛన్వై
స ప్రేత్య నసుఖీ భవేత్."
న తత్పరస్య సందద్యా
త్ప్రతికూలం యదాత్మనః
యేష సంక్షేపతో ధర్మః
కామా దన్యః ప్రవర్తతే
ప్రాణా యథాత్మనోభీష్టా
భూతానామపి తే తథా
ఆత్మౌపమ్యేన మన్తవ్యం
బుద్ధిమద్భిః కృతాత్మభిః
యస్తు వర్షశతం పూర్ణం
తపస్తప్యే త్సుదారుణమ్
యశ్చైవ వర్జయే న్మాంసం
సమ మేతన్మతం మమ
మధుమాంసంచ యే నిత్యం
వర్జయం తీహ ధార్మికాః
జన్మప్రభృతిమద్యంచ
సర్వే తే మునయః స్మృతాః
మృత్యుతో భయ మస్తీతి
విదుషాం భూతి మిచ్ఛతామ్
కిం పున ర్హన్యమానానాం
తరసాజీవితార్థినామ్
ఆరోగాణా మపాయానాం
పాపే ర్మాంసోపజీవిభిః
తస్మా ద్విద్ధి మహారాజ
మాంసస్యపరివర్జనమ్
ధర్మస్యాయతనం శ్రేష్ఠం
స్వర్గస్యచ సుఖస్యచ."

ఈ విధముగా భీష్ముఁడు హింసనుగూర్చియు మాంసభక్షణ నిషేధమును గూర్చియు చెప్పి యుండెను. కాని, మాంసాహారప్రియులు మాంసముఁను ఒకేసారి మానివేయలేరు. కాన క్రమ క్రమముగా మానుకొననగును. మాంసభక్షణమును క్రమముగా మాన్పించుటకొరకే నిత్య విధులందుమాత్ర మప్పుడప్పుడు తినవచ్చుననియు అందువలన అల్పదోషముమాత్రము వచ్చుననియు పల్కుచు తుదకు భీష్ముడు మాంసము సర్వదా వర్జనీయమని తెలిపెను.

"స వర్జయే న్మాంసాని
ప్రాణినా మిహ సర్వశః"

"యుధిష్ఠిరా! వింటివా! పూర్వకాలమున యజ్ఞములందు పురోడాశమే యజ్ఞపశువు. దాని చేతనే వారు యజ్ఞములను జేయుచుండిరి."

"శ్రూయతేహి పురాకల్పే
నృణాం వ్రీహిమయః పశుః"

ఇంకను భీష్ముఁ డిట్లుపలికియున్నాడు. ప్రజాక్షేమముకోరు అగస్త్యమునీంద్రుడు తన తపస్సు వలన అడవిమృగముల నన్నిటిని దేవతలకు ప్రోక్షించెనుకాని ప్రాణములను తీయలేదు.

"ప్రజానాం హితకామేన
త్వగస్త్యేన మహాత్మనా
ఆరణ్యాః సర్వదైవత్యాః
ప్రోక్షితా స్తపసా మృగాః"

మరియు భీష్ముఁడు మాంసభక్షకులు కాని అంబరీష, నాభాగ, దిలీప, రఘు, హరిశ్చంద్రాది మహాత్ముల గాథలనుకూడ వినిపించెను.

"ఏతై శ్చాన్యైశ్చ రాజేంద్ర
పురా మాంసం నభక్షితమ్."

ఈ వాక్యములవలనను, ఉదాహరణములవలనను దేవతలకొఱకుగాని యజ్ఞముకొఱకుగాని చేయు పశువధ హింస అనిపించుకొనునని సిద్ధమగుచున్నది.

కాన దేవతల పేరుపెట్టియు, యజ్ఞముల పేరు పెట్టియు పశువధ చేయరాదు.

# ఆంధ్రగ్రంథాలయములు

శ్రీ నందిరాజు చలపతిరావుగారు

ఆంధ్రుల పూర్వపుణ్యవశమున అయ్యంకి వేంకటరమణయ్యపంతు లవతరించి, బరోడా, మదరాసు, కలకత్తామున్నగు ప్రదేశముల కరిగి, అచటి గ్రంథాలయములనుజూచి, ఆయుద్యమము నాంధ్రసీమయందు మొలకెత్తించి, నాటినుండి నేటికిని తద్రక్షణకై నిరంతరమును పాటుపడు చుండుట లోకవిదితమే.

సంస్కృతాంధ్రకర్ణాటక భాషలయం దారితేరిన శ్రీకృష్ణరాయలు దేశభాషలయందు దెలుగు లెస్సయగుటచేత తా నాంధ్రమున నాముక్తమాల్యదను రచించెనని వాక్రుచ్చియున్నాడు.

ఆంధ్రభాష కవిత్రయమువలనను తత్ప్రాంత కవులవలనను, తరువాత శ్రీకృష్ణరాయకాలమునను,ఉత్కృష్టదశ నొందియుండెను. ఆనాడే బహుగ్రంథములు రచింపబడెను. ఆనాటిపండితులు అఖండపాండితీమండనులై, అనర్గళధారావిలసితులై, తమభావములను తగినంత విశ్రాంతితో విమర్శించి, కవితాముఖమున వెల్లడించి యున్నారు.

ఇప్పటికిని ప్రాచీనాంధ్రప్రబంధములలోనే ఆంధ్రసారస్వతము తాండవించుచున్నది. ఇప్పటికి భావకవులలోగూడ తద్రసపిపాసువులు వ్రాసిన వ్రాతలే మనోజ్ఞములుగా పొడకట్టుచున్నవి.

తంజావూరు లైబ్రేరీయందును, మదరాసు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందును, కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్కార్యస్థానమందును, విద్యావంతులగృహములందును, ఆంధ్రప్రబంధము లనేకము లున్నవి. అవియన్నియు ముద్రింపబడదగినవియే. బహుగ్రంథప్రకాశకులు గల యీ దినములలో బహుళముద్రాక్షరశాలలచే తాండవించు నీసమయమే, ప్రాచీనాముద్రిత గ్రంథప్రచురణమున కర్హమగు సమయము. పెక్కురాంధ్రులు రాష్ట్రపరిపాలకులుగా నున్న యీ మహోత్కృష్టసమయము ఆంధ్రవాఙ్మయ వ్యాప్తికి సుముహూర్తముగదా! ఇప్పుడే గ్రంథాలయములు సకలకళాసంపూర్ణములు గావలెను. ఇప్పుడే గ్రంథప్రకాశకు లముద్రితగ్రంథములను ప్రచురింపవలెను. ప్రతిదినము మదరాసు లైబ్రేరిల కెట్లు ప్రపంచమునందు ప్రచురింపబడిన గ్రంథములు సేకరింపబడునో యట్లే ప్రతిగ్రంథాలయము, ప్రతినెల కొక్క నూతనగ్రంథమును సేకరింపవలయును.

నే నిటీవల ప్రాచీనప్రబంధములను ప్రచురించుచు, సారంగు తమ్మయరచిత ప్రసిద్ధాంధ్రప్రబంధము వైజయంతీవిలాసమును ముద్రించుచు, ముద్రణమునకు మున్నె ప్రజామిత్రపత్రికలో నాగ్రంథము నమ్మకమునకై ప్రచురించితిని.

ఎట్లు కనుగొనిరో ప్రాత సి ఐ.డీ.లు కనగొని ఆ గ్రంథముల కావలెనని నాకడకువచ్చిరి. నేను ప్రచురించుచున్నది (Expurgated Edition) అతిశృంగారరసోదంచితమగు పద్దెములను తీసివేసిన ప్రచురణమనియు, (For private circulation) సభ్యులకుమాత్రమనియు ముఖపత్రముపై ముద్రించిన భాగపు ముఖపత్రము నొసంగితిని. కాని అతడు తృప్తిపడలేదు. ఆగ్రంథమే కావలెననుచున్నాడు. ఆకాలమునాటి సాంఘికవృత్తులను తెలియజేయుట కద్వితీయమైన హంసవింశతి సి.ఐ.డీ. లవాతబడిఅంత్యలోనున్నది. ప్రస్తుత రాజ్యాంగ కోవిదులగు మంత్రులు రాజకీయఖైదీలన్ను చెఱవిడిపించుచున్నట్టులే, వైజయంతీవిలాసము, హంసవింశతి, శ్రవణానందగ్రంథములను చెఱవిడిపించి, సారస్వతమునకు స్వేచ్ఛాస్వాతం

త్య్రము లోనంగుటకు సంరంభమున నాందోళనము జరుపవలెనా? ఆంధ్రప్రచారిణీ గ్రంథప్రకాశకులును, విశేషించి గ్రంథకర్తలు నగు శ్రీయుత కాళేశ్వరరావుపంతులుగారు పార్లమెంటరీ చీఫ్ సెక్రిటరీగానుండు నీ సమయమున నామహా మహాశయుడే ఈప్రాతగవర్నమెంటు ఉత్తరువును రద్దు చేయించునని తలంతును. ఈ విషయమై భాషాపరులెల్లరు నాందోళనము సలుపవలె; ముఖ్యముగా గ్రంథాలయములవారు ప్రజాదృష్టి నీవిషయమై కేంద్రీకరింప జేయవలయును.

# గ్రంథాలయోపయోగము

శ్రీ గోరుగంతు అచ్చుత సూర్యనారాయణశర్మగారు

చ॥ చదువక యున్నచోఁ దెలివి సాగదు; తెల్వియు లేక యున్న న
భ్యుదయము లేదు దేశమున కోజనులార! వివేక మింక నె
ట్లొదవును? దాస్యమె ట్లెడలు? నున్నతధైర్యముతో స్వతంత్రపుఁ
బ్రదు కెటు లబ్బు? నీ భరతమాతకు మీర తలంచి చూడుఁడీ!

ఉ॥ కాలముఖంబునన్ మతవికాసము చేడ్పడనీక యుండ దే
వాలయ మెంతసాధనమొ యంతకు రెట్టి యనంగవచ్చు గ్రం
థాలయసంప్రతిష్ఠ హృదయంబున విద్దియవిత్తు నాటి దే
శాలటు భక్తిచేత నలరార్చి మహిన్ ఫలియింపఁజేసెడిన్.

శా॥ ఇంటంజూచిన నాలిపోరు; ఎటకే నేగన్ వివాదంబు వె
న్వెంటన్ వచ్చును; కాలమున్ గడుపుటో నిద్రన్ గటా! విద్యలే
కుంటన్ వచ్చిన కీడు లియ్యవి త్రిలింగోర్విస్థలిన్ బుట్టి నే
లంటుం బాయమి పాడి గాదు జనులారా! విద్య నర్థింపుఁడీ!

మ॥ ఎవ రే మన్నను బాధ లేదు కల దేదే నింత భక్షించి యుం
టివె తల్ సర్వము విస్మరించి పరిపాటిం బోయి వాగ్దేవతా
భవనోపాంతమునందుఁ జేర యచటన్ స్వాతంత్ర్యమున్ నేర్పు గ్రం
థవరంబు ల్పఠియించి గ్రంథనిలయోద్ధారంబు గావింపుఁడీ !

చ॥ ప్రకటము గాదె మీకు శివరామపురంబుననున్నయట్టి పు
స్తకనిలయంబు? పండితవతంసుల దీవనలొంది నాఁడు నాఁ
టికిఁ దనయంతదై తెలివిడిన్ బెనుపొందుట నేఁడు మీ సహా
యకలన దివ్యమందిరము నంది యొకింటిదిగాఁ దలంచెడిన్.

ఉ॥ శ్రీ లెవి లేకయుండియును జేరదు సారెకు వారి వీరి; భూ
పాళులు లేవు గాని కవు లాదృతిసేసి యలంకరింప నే
దో లలితప్రవృత్తులనె యున్నది మాయనవద్యవిద్య గ్రం
థాలయలక్ష్మి యొక్కఁపరి నారసి మేల్గొని సంతసింపుఁడీ.

( శివరామపురాగ్రహార గ్రంథాలయవార్షికోత్సవ సమయమునఁ జదువఁబడినవి. )

# "తెనుగుగుడి" అంటే "ఆంధ్రామ్యూజియమ్"

## ఎట్లాగుండాలి? ఎక్కడుండాలి?

బ్రహ్మశ్రీ
గుమ్మిడిదల వేంకటసుబ్బారావుగారు బి. ఏ.

### ఆంధ్రామ్యూజియమ్

ఈ "ఆంధ్రామ్యూజియమ్" గురించి రమారమి రెండేండ్ల క్రిందట బ్రహ్మశ్రీ ముట్నూరి కృష్ణారావుపంతులుగారు నాతో మొట్టమొదట ముచ్చటించేరు. ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్యగారు ఈ మ్యూజియమ్ ఫక్కియే మనకు విజాతీయమని పమిడిపాడు ఆంధ్రగ్రంథాలయ మహాసభలో చెప్పినారు. శ్రీగోపాలకృష్ణయ్యగారి భావములు అమెరికా గ్రంథాలయపత్రిక ప్రచురించి శ్లాఘించింది కూడాను!

అయితే, మన సనాతనధర్మంలోని ఆపద్ధర్మం శెక్షన్లు కొన్నిటిలాగ, పాశ్చాత్యమైనా యీ మ్యూజియమ్ ఖర్మముకూడా యేదో విధంగా అంగీకరించాలని ఆమధ్య మనస్సు నిశ్చయించేసుకొన్నాను. కాని దీనిస్వరూపమేమిటి? సమన్వయమెట్లా! స్థలమెక్కడ? సృష్టించేవిధాత యెవరు? పోషించేదాత లెవరు? ఈ మున్నగునవన్నీ ధర్మసందేహాలే బయలుదేరేయి!

### శబ్దవిమర్శ

అసలు మూలానికి వెళ్లితే మనది "ఆంధ్ర" జాతా? లేక "తెనుగు"జాతా? అనే ప్రశ్న మొదటే లేచింది. మనజాతి "ఆంధ్ర"జాతికాదు- తెనుగుజాతి - మనది తెనుగులిపి, తెనుగు తెలివి, తెనుగుకళ, తెనుగునాగరికత, తెనుగు రాజ్యము. అంతేగాని యీ "ఆంధ్ర"గొడ వేమిటంటారు- మా "కవిగోష్ఠి" మిత్రులు. దస్తావేజు దాఖలా చూద్దామని మనుస్మృతి చూస్తిని గదా, "ఆంధ్రు" లంటే యిప్పటి శ్రీ వెన్నెలగంటివారి యానాదులవలె ("యానాది పదానికి మూలము" అనాది) యెలకలను భక్షించేవారని ఉంది! దానితోటి "శ్రీమద్రమారమణ గోవిందో హరి" అని తెనుగుపదమే మంచిదని నిర్ణయించుకొన్నా.

తెనుగో, ఆంధ్రో - విశేషణము మాట అటుంచి యిక విశేష్యమును పరీక్షించా. అంతా "మ్యూజయమ్" అన్నారుగదా! నలుగురుతో పాటు నారాయణా అని, అదే అంగీకరిద్దామని "ఆంధ్రమ్యూజియమ్" లేక "తెనుగు మ్యూజియమ్" అని రెండుమార్గు అన్వయించడానికి ఆరంభించా. కాని కుదరలే! శాస్త్రకారుల్ని సలహా అడిగా; "మిశ్రమ సమాసాలు మన తెనుగులో కూడ"వన్నారు పెద్దలు. "ఆంగ్లో ఇండియన్" లాగ యీ "తెనుగు మ్యూజియమ్" యేమిటా అని నాకూ అనుమానమే వేసింది.

### "తెనుగుగుడి"

ఈ సమయములోనే మా కవిగారు అంటే బ్రహ్మశ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారి "తెనుగుగుడి" కరపత్రి మొకటి సాక్షాత్తు పరమేశ్వరుడిలాగ ప్రత్యక్షమైంది. దానితోటి, "దొరికిందిరా, మాట" అనుకున్నా. అప్పటినుంచీ యీ "తెనుగుగుడే మన నిజమైన ఆంధ్రామ్యూజియమ్" అని నాభావము; యిప్పటికీ నా విశ్వాసమును.

చూడండి, "గుడి" అన్నమాట యెంత యింపుగా, చెవులకు సొంపుగా నున్నదో! తెనుగు అక్షరాలకి సుడికార మెట్లాగో, తెనుగుచేతలకి

"గుడి" కూడా అట్లాగే! అంతేనేగాని యీ "మకార యకార ఊకారములు మ్యూ - జకార యికారములు జి - యకార అకారములు య - మ్ - అంటే మ్యూజియమ్" యేమిటీ? "గుడి" యెంతముద్దొస్తూందో, "మ్యూజియమ్" మన భావంలో అంత అసహ్యంగా నుంది. "గుడిలో భారతీయవిజ్ఞానమే కాదు, ప్రపంచ మోక్షమంతా యిమిడిఉంది. కాని ఇప్పటి "మ్యూజియము" లన్నీ చాలభాగం చచ్చిన శవాల శాలలే కాదూ?

వెనక దామెర్ల రామారావుగారి పేరిట "రామరాయ చిత్రకళాభవన"మని (ఇంగ్లీషులో "రామారావు ఆర్టుగ్యాలరీ"కి అది తర్జుమా లెండి!) రాజమహేంద్రవరంలో ఒకసంస్థ బయలుదేరదీస్తే మా గోపాలకృష్ణయ్యగారేమన్నారంటే "ఇదంత కళగాలేదు. నిజంగా తెనుగు దేశంలో రామారావు పేరట కళాభవనమే రావాలంటే తిరిగి ఒక రామాలయాన్నే ప్రతిష్ఠించా" లన్నాడా మహానుభావుడు! అప్పుడా ఆలయంలోనుండి తెనుగుకళ తెనుగుజీవము కూడా ఉట్టిపడేవిట! పోనీ, యిప్పుడా చిత్రకళాభవనానికి చదువుకొన్న పెద్దలు యేపదిమందో తప్ప యెవరు వెళ్లుతున్నారో చెప్పండి!

## స్థల విషయము

ఈ శబ్దసమన్వయముమాట అటుంచి యిక యీ రాబోయ్యే సంస్థ యెక్కడుండాలని అప్పుడే వాగ్యుద్ధం బయలుదేరింది. కాని అదృష్టవశాత్తు యీసారి రాజమండ్రివారైన శ్రీభావరాజు వేంకట కృష్ణారావుపంతులుగారే యిది బెజవాడలోనే ఉండాలని ముమ్మాటికీ బల్లగుద్ది చెప్పుతున్నారు. ఆమధ్య ముట్నూరి కృష్ణారావుగారుకూడా బెజవాడలోనే అన్నారు. (ఇదొక విధమైన స్వాభిమానం లెండి! వారి పేర్లలో వలెనే యిక్కడకూడ కృష్ణఉందని) ఇక నా మాటంటారా! ఎట్లాగైనా మాకు మాభాగే!

ఈ సందర్భంలో ఒక చిన్నకథ చెప్పాలి. ఆమధ్య ఒకమిత్రుడేమన్నాడంటే "బెజవాడనుంచి ఆంధ్రవిశ్వకళా పరిషత్తు పోయినా మీ ఆంధ్రవిద్యాగోష్ఠితో విజయవాడ విజ్ఞానానికి లోటు తీరింది." అన్నాడు ఆమిత్రుడు. నిజమే నని నాకుకూడా కాస్త అహంకారమే లెండి! వెనక మన సర్ యస్. రాధాకృష్ణన్ అయ్యర్ - ఆక్స్ఫర్డ్ - బెంగాల్ - ఆంధ్ర - వైస్ చాన్సెలరుగారితో నే నేమన్నానంటే "మీరు వైస్ చాన్సెలరేగాని నేను చాన్సెలర్" నన్నాను. అంటే ఆయన ఉపాధ్యక్షుడు - నేను అధ్యక్షుణ్ణేని! అయితే యీ రెండుసంస్థలకీ డబ్బుతేడా? అది వేరేవిషయము!

ఇప్పుడు సద్యా అసలుసంగతేమంటే మా బెజవాడలో యూనివర్సిటీ పోయినా గోష్ఠి ఉన్నట్టు రేపు రాబోయ్యే "ఆంధ్రమ్యూజియమో లేక తెనుగుగుడో" యీ ఊళ్లో వెలసినా, మరెచ్చటవెలసినా, మా కనకదుర్గగుడి యిక్కడ ఉన్నంతకాలము మాకుమాత్రం ఏమీలోటుండదని ఆంధ్రమహాజనులకు మనవిచేస్తున్నా. కాని దుర్గగుడితోపాటు తెనుగుకళకి, కవిత్వానికి, సారస్వతానికి, సంగీతానికి, చారిత్రికవిషయాలకి, గొప్ప గొప్ప శిల్పాలకీ, యింకో "గుడి" కూడా యిచ్చట కట్టిస్తామంటారా? మాభాగే - శిరసావహిస్తాము. ఇక్కడ మాకున్నురాజు లున్నారు - రెడ్లున్నారు - జమీందార్లున్నారు - చౌదరీలున్నారు- సేట్లున్నారు - వర్తకులున్నారు - స్థానికసంస్థలున్నాయి - అన్నిటికంటె యెక్కువగా కవులు,

గాయకులు, శిల్పులు, నటకులు ఉన్నారు. అంచేత బెజవాడే నిశ్చయంచేసేమని యీఉద్యమాభిమానులు నలుగురూ కూడబలుక్కొని తథాస్తు అంటారా, యీ "తెనుగుగుడి"కి ఆదర్శమైన ఒక చక్కనిచోటుకూడా ఉంది. ఆసంగతి మాకు తెలియజేసిన తర్వాత ఆచోటుపేరు నేను చెప్తా - ఇప్పుడుమాత్రం చెప్పను. ఒకవేళ మీరంతా మావూరికి వోట్లివ్వరా? మాగుడీ మాకుంటుంది; మాచోటు మాదే!

## దాతలు - విధాతలు

ఈసంస్థకు స్థాపకులెవరు పోషకులెవరనేది ముఖ్యప్రశ్న. ముట్నూరి కృష్ణారావుపంతులుగారు పైచెప్పిన సంభాషణలో మేమనుకొన్న మాటలు ఆంధ్రలోకం తెలుసుకోవడ మవసరం. మనరాజులలో పలువురు కళాభిలాషు లున్నారు. సర్వసాధారణముగా వీరంతా రసికులే - విజయనగరంవారు, బొబ్బిలివారు, జయపురంవారు, పిఠాపురంవారు, నూజివీడులోని అతిరథులు మహారథులు, ఉభయపార్టీలవారు, చల్లపల్లివారు, వెంకటగిరివారు వగైరా వగైరా. వీరిలో యెవరైనా ఒక్కరే చాలు యీ పనికి పూనుకోవడానికి. అందులోకీ ముఖ్యంగా యీ "జమీందారీవిచారణ" రోజులలో కాస్త కాంగ్రెస్ వారి కనుసైగ ఉందా-అంతా తలోలక్ష యిచ్చేవారే! కనీసము తలా పదిఊళ్లూ వ్రాసిచ్చినా చాలు; కేవలము బ్రిటిష్‌గవర్నమెంటు కర్రెన్సీయే అక్కరలేదు! ఇక సామాన్యులలోనా, సాంబార్పాలు సంక్రమించనంతవరకు ఆంధ్రు లంతా కళాభిమానులే! చిలుకూరివారు, మల్లంపల్లివారు, మారేమళ్లవారు, మారేపల్లివారు, భావరాజువారు, భోగరాజువారు, కవుతావారు, కాశీనాధునివారు, జాగర్లమూడివారు, బెజవాడవారు, త్రిలిజ్గవారు, త్రిపుర్నేనివారు, అడివివారు, ఆకాశపువారు, తాపీలవారు, సుత్తైలవారు, నాగళ్లవారు చివరకు కొడవళ్లవారు ఆంధ్రలోకమంతా కళారాధకులే! ఇక మన ఆడవాళ్లమాట! సరేసరి! వీరంతా పూనుకోవాలె, పూనుకుంటారు కూడాను.

ఇంకొక్కమాట, ఈపనిమాత్రం ఆంధ్రులు యీదాలాభంగా మొదలుపెట్టకూడదు. చెయ్యదలుచుకొంటే కనీస మొక లక్షరూపాయలైనా వసూలుచేసి శాశ్వతమైన పనిగా ప్రారంభం చెయ్యండి. లేకపోతే యేమూలనున్న బొమ్మలు బొరుసులు ఆ మూలనే ఉంటే మంచిది. అంతేగాని ఉన్నవన్నీ యెక్కడికో చేర్చి వాటికి వాటిని కనిపెట్టుకొనే పూజార్లకు ఉపవాసవ్రతము చెప్పడ ముందే అది "తెనుగు" పద్ధతికాదు; "గుడి" సాంప్రదాయకము కాదు. ఇట్లాటిగుడి యెక్కడైనా యేర్పడితే అక్కడికి చెన్నపట్ణం ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారములోని తెలుగు గ్రంథాలు తంజావూరులోని సరస్వతీ గ్రంథాలయములోని తెలుగు పుస్తకాలుకూడా చేర్పించవలసి యుంటుంది.

వీణ
తెనుగు మాసపత్రిక
తేలప్రోలు - కృష్ణాజిల్లా.
ఆంధ్రదేశములోని సుప్రసిద్ధుల రచనలు ఇందుండును.
సాలుచందా రు 1-8-0

ప్రతిభ
త్రిమాసపత్రిక
సంవత్సరచందా రు 2-0-0
నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు.

# తెనాలి తాలూకా గ్రంథాలయ మహాసభ

ఒకవైపున నిర్ఝరారావముతో ప్రవహించుచున్న కృష్ణవేణీ పావనతోయములు కన్నులపండువు సేయుచుండ వటవృక్షచ్ఛాయలు ప్రతినిధులకు స్వాగతమిచ్చుచుండ, ప్రకృతి రామణీయకమగుఅరుబయలుప్రదేశమున ౧-౮-౩౮వ తేదీ మధ్యాహ్నము రేవేంద్రపాడు గ్రామములో పైసభ దిగ్విజయముగా జరిగినది. తాలూకాలోని వివిధగ్రామముల నుండి, గ్రంథాలయ పఠనాలయముల పక్షమునను, వ్యక్తిగతముగను విచ్చేసిన ప్రతినిధులు దాదాపు అరువదిమంది గలరు. కాక చుట్టుపట్టులనుండియు విచ్చేసినప్రేక్షకులును గ్రామస్థులును నాటిరాత్రికి పెదపాలెంలో జరుగనున్న గ్రంథాలయ సంఘప్రతినిధుల యిష్టాగోష్ఠి సమావేశమున కరుగుదెంచిన ముఖ్యులగు గ్రంథాలయసేవకులును కలసి సభికులసంఖ్య సుమారిన్నూరు గలదు. ఇతరతాలూకాల నుండి విచ్చేసిన గ్రంథాలయసేవకులలో శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు, భూపతిరాజు తిరుపతిరాజుగారు, తేతలి సత్యనారాయణమూర్తిగారు, మల్లెల శ్రీరామమూర్తిగారు, మైలా శామ్యుయల్ గారు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు ముఖ్యులు.

చుండూరు వాస్తవ్యులగు శ్రీయుత గండవరపు వెంకటేశ్వర్లుగారి ప్రార్థనతో సభాకార్యక్రమము ప్రారంభమయ్యెను. తరువాత తెనాలితాలూకా గ్రంథాలయకార్యదర్శి శ్రీ పాతూరి నాగభూషణంగారు సభకు విచ్చేసిన గ్రంథాలయసేవకుల నందఱికి నెఱుకపరచిరి.

## ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము.

అనంతరము శ్రీయుత చల్లపల్లి మురహరిరావుగారు మహాసభకు విచ్చేసిన ప్రతినిధులకు ప్రేక్షకులకు స్వాగతమిచ్చిరి.

## ప్రారంభోపన్యాసము.

అంతట సభాప్రారంభకులగు శ్రీయుత కస్తూరి కుటుంబరావుగారు కరతాళధ్వనుల మధ్య లేచి, తమయుపన్యాసము నిచ్చిరి.

## అధ్యక్షోపన్యాసము.

తరువాత శ్రీ పాతూరి నాగభూషణంగారిచే ఉపపాదింపబడి, సభికుల కెరుక చేయబడి, మరికొందరు ప్రతినిధులచే బలపరుపబడిన పిమ్మట శ్రీయుత పుణ్యమూర్తుల రాజశేఖరంగారు అధ్యక్షస్థానము నాక్రమించి, తమ యధ్యక్షాభిభాషణమును జెప్పిరి.

# ఆరవ సమావేశము
# రేవేంద్రపాడు

## డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు:

పిమ్మట తాడేపల్లిగూడెం తాలూకా గ్రంథాలయ సంఘకార్యదర్శులగు డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు మనపూర్వపు ఔన్నత్యమును స్మరించి, ప్రస్తుతము మనదేశదుస్థితికి కారణము మనము స్వాతంత్ర్యమును గోలుపోవుటే యనియు, తిరిగి మనము స్వాతంత్ర్యమును పొందవలెనన్న గ్రంథాలయములు, పఠనాలయములు మిగుల నవసరమనియు, వీనికై సంవత్సరచందాలు సరస్వతీ కట్నములద్వారా ధనము సంపాదించవలెననియు మొదలుగాగల సంగతుల జెప్పి చివరకు తాలూకాగ్రంథాలయసంఘముల విధులను వివరించిరి.

## తీర్మానములు

౧ కీ. శే. వల్లూరి సూర్యనారాయణరావు, తోకల నాగయ్య, విచారపు వెంకటదాసు, సూర్యదేవర రాఘవయ్యచౌదరిగార్ల ఆత్మలకు శాంతిగలుగుటకై యీసభవారు పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

౨ తమ చరిత్రపరిశోధనాపటిమచే మద్రాసు విశ్వకళా పరిషత్తువారి మెప్పుపొంది, పి. హెచ్. డి. బిరుదము బడసిన గుంటూరు హైందవ కళాశాలచారిత్రకోపన్యాసకులగు డాక్టరు మారేమండ రామారావుగారి నీ సభవారభినందించుచున్నారు.

3 తెనాలితాలూకా గ్రంథాలయ సంఘమువారు తాలూకాలోని గ్రంథాలయ, పఠనాలయము లన్నిటినుండి వానియభివృద్ధిని గూర్చిన నెలసరి రిపోర్టులను తెప్పించి అవసరమయినవారికి తగిన సలహాలిచ్చుచు సంవత్సరమున కొక తూరియైన ప్రతిగ్రంథాలయమును పరిశీలించుటకు తగిన యేర్పాట్లు చేయవలసినదిగా ఈసభవారు కోరుచున్నారు.

౪ పడవలలో ప్రయాణముచేయు బాటసారుల విసుగుదలను తొలగించి సత్కాలక్షేపమున కనువగు చక్కని యవకాశమొసగు బోటు గ్రంథాలయముల ద్యాంకు కాలువపైనడచు ప్రయాణీకుల పడవలలో స్థాపించిన పెద

19



పాలెము, సేవాశ్రమమువారి నవ్యప్రయత్నము నుగ్గడించుచు తాలూకాలోని యితర ప్రాంతములలోగల యితరకాలువల పైనడచు పడవలందును, నిట్టి గ్రంథాలయములు స్థాపించు ప్రయత్నములు చేయవలసినదిగా తెనాలితాలూకా గ్రంథాలయసంఘమువారి నీ సభవారు కోరుచున్నారు.

౫ ఏయుద్యమములో గాని ప్రజాసేవచేయువారి కేవిధమైన బిరుదుల నొసంగుట మంచిదిగాదని యీసభవారు తీర్మానించుచున్నారు.

౬ గ్రంథకర్తలను, పత్రికాధిపతులను వాని ప్రచురణకర్తలను తమ తమ ప్రచురణముల నుచితముగా తమ గ్రంథాలయముల కిప్పించవలసినదిగా వేడికొనుట గ్రంథాలయనిర్వాహకులకు ధర్మముకాదని యీ సభవారు తలచుచు బాల్యదశయందున్న గ్రంథాలయములకు కొంత బలము గలుగువరకు వానికి ప్రోత్సాహము కలిగించు నిమిత్తమై, గ్రంథకర్తలు, పత్రికాధిపతులు, ప్రచురణకర్తలు తమ తమ ప్రచురములను తాలూకాపట్టణ గ్రంథాలయముల సిఫారసు ననుసరించి కొంతతగ్గింపురేట్ల కిచ్చుటవసరమని యీ సభవా రూహించుచున్నారు.

౭ తెలుగులో వెలువడు నుపయుక్తమగు ప్రతినూతన గ్రంథమును కొని గ్రంథకర్తలకు ప్రచురణకర్తలకు తగిన ప్రోత్సాహమిచ్చుచు మాతృభాషాభివృద్ధికి సాయపడవలసినదిగా నీ తాలూకాలోని గ్రంథాలయముల నీసభవారు హెచ్చరించుచున్నారు.

౮ నేడు విద్వాంసులు, కవులు, గాయకులు, మొదలగువారిని సన్మానించి పోషించు ప్రభువు లరుదైనందున ఆభారమును విజ్ఞానవ్యాపన మాదర్శముగాగల గ్రంథాలయములనిర్వాహకులు చేయు టవసరమని యీ సభవా రభిప్రాయపడుచున్నారు.

౯ ప్రస్తుతస్థితిలో ప్రతియూరనొక సమగ్ర గ్రంథాలయమును స్థాపించి చక్కగా నిర్వహించు టసాధ్యము కాదు కనుక గ్రామగ్రామమునకు కనీస మొకపఠనాలయమును స్థాపించి ప్రతిఫిర్కాకు నొకకేంద్రగ్రంథాలయము స్థాపించి నడపుట బాగుండునని యీ సభవారు అభిప్రాయపడుచున్నారు.

౧౦ మనదేశమున ముఖ్యముగా గ్రామములో నివసించు జనులకు మన గ్రంథాలయములుగాని, అవి తెరచియుండు కాలముగాని, అందుబాటులోనుండి విజ్ఞానార్జనకు సరియగు నవకాశముల కల్పించుట కభ్యంతరముగా నున్నందున ప్రతిగ్రామగ్రంథాలయము నిత్యము రాత్రివేళల ౨ గంటలకాలము తెరచియుంచబడి చదువురానివారలకు పుస్తకములను, ముఖ్యముగా పత్రికలచదివి వినిపించుటకై యేర్పాట్లుచేయు టవసరమని యీ సభవారు అభిప్రాయపడుచున్నారు.



౧౧ ప్రచురణ గ్రంథాలయములకును, గ్రంథాలయ సంఘములకును జీవము కనుక ఇప్పటిలో ఆంధ్రదేశములోని వివిధగ్రంథాలయములును, గ్రంథాలయసంఘములును వ్యక్తిగతముగ నందునిమిత్త మెక్కువ మొత్తముల వెచ్చింప నసమర్థములైనందునను తెలుగుపత్రికల యజమానులు విజ్ఞానవ్యాప్తికి దారిజూపి జాతివికాసమునకు తోడ్పడుటలో ప్రాధాన్యము వహించు గ్రంథాలయములకు సంబంధించిన సమాచారములను చక్కగా తమ పత్రికలలో ప్రకటించుచు అప్పుడప్పుడు గ్రంథాలయ క్షేత్రమున గన్పట్టు నూతనోద్యమముల తమ సంపాదకీయములద్వారా నుగ్గడించుచు మధ్యమధ్య నీయుద్యమవ్యాప్తివిషయమై తమ సలహాల వెలువరించుచు గ్రంథాలయోద్యమమునెడ తమ ధర్మమును నిర్వర్తించుటకై యీ సభవారు ప్రార్థించుచున్నారు.

౧౨ శ్రీయుత కాశీపట్నం కొండయ్యగారి సంపాదకత్వమున రాజమహేంద్రవరమునుండి ప్రకటింపబడుచున్న "విజ్ఞానం" పత్రికను యీ సభవారు స్వాగతమిచ్చుచు, ఆధునికయుగమున కవసరములైన ముఖ్యములగు శాస్త్రవిషయములను ప్రత్యేకముగ తెలియజేసెడి యీ నూతన ద్వైమాసపత్రిక నాదరించవలసినదిగా ఆంధ్ర గ్రంథాలయమువారి నీసభవారు కోరుచున్నారు.

౧౩ గ్రంథాలయోద్యమవ్యాప్తికై ప్రారంభింపబడి, ఆర్థిక చిక్కులకు లోనగుటవలన నితర ఉద్యమముల చేపట్టవలసిన "గ్రంథాలయ సర్వస్వము" యొక్క స్థితికి ఈసభవారు వగచుచు నిదిస్వధర్మనిర్వహణమే ముఖ్యముగా చూచుకొనుటకు సరియైన అవకాశములను కల్పించి స్వస్వరూపముననే బయల్వెడలునట్లు చూచుటకై దీని నిర్వాహకులను ఆంధ్రదేశమందలి గ్రంథాలయ సేవకులను ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

౧౪ ఆంధ్రదేశములోని వివిధ పట్టణ, తాలూకా, జిల్లా, రాష్ట్రసంఘములు పరస్పర మన్యోన్యాశ్రయముగలిగి యేకలక్ష్యమునకై కృషియొనర్చుటకుగాను ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారి నిబంధనలయందు మార్పులు సూచించుటకై నేడు పెదపాలెములో కూడబోవు గ్రంథాలయసంఘప్రతినిధుల యిష్టాగోష్ఠి సమావేశప్రయత్నము నీ సభవారు పూర్ణముగా బలపఱచుచున్నారు.

౧౫ ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు వివిధ విషయములకు సంబంధించిన చక్కని పుస్తకముల తెలుగులో వ్రాయించి ప్రకటించుటచే ఆంధ్రగ్రంథాలయ

ముల కుపయుక్తములైన పుస్తకములు తగినన్ని లేనిలోపమును పూర్తిచేయుటకును, విజ్ఞానవ్యాప్తి కుపకరించు పలు రకముల కరపత్రము లచ్చొత్తించి ప్రచారము గావించుటకును తాలూకా, పట్టణగ్రంథాలయసంఘముల సాయము బడయుటకై యీ సభవారు సలహా నిచ్చుచున్నారు.

౧౬ గవర్నమెంటు నిషేధించిన గ్రంథములజాబితాను సంపాదించి ప్రకటించుటకై శ్రద్ధబూనవలసినదిగా నీసభవా రాంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారిని కోరుచున్నారు.

౧౭ గ్రంథభాండాగారుల శిక్షణతరగతుల నేర్పాటు చేసి వానిని ప్రభుత్వము గుర్తించునట్లు ప్రయత్నము చేయవలసినదిగా నీ సభవా రాంధ్రదేశ గ్రంథాలయ సంఘము వారి నర్థించుచున్నారు.

౧౮ గ్రంథాలయబిల్లుయొక్క ఆవశ్యకత నాలోచించి అవసరమగుచో దానిని తయారు చేయుటకు ప్రవీణులగు వివిధ గ్రంథాలయ సంఘప్రతినిధుల కొందఱి నొక యుపసంఘముగా నేర్పాటు చేయుటకై యీ సభవా రాంధ్రదేశ గ్రంథాలయమువారిని కోరుచున్నారు.

౧౯ ఏదైన గ్రంథములను గ్రంథాలయమున కుచితముగా నొసంగదలచువారు దానిని ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమున కప్పగించి గ్రామములో తాలూకా గ్రంథాలయ సంఘములద్వారాను, నగరములలో పట్టణ గ్రంథాలయ సంఘముద్వారాను పంచిపెట్టించుటకై యీ సభవారు కోరుచున్నారు.

౨౦ నూతనముగ మంత్రిత్వ స్వీకరణమొనరించిన మద్రాసు కాంగ్రెసుమంత్రుల నీసభవారు హృదయపూర్వకముగ నభినందించి గ్రామోద్ధరణకై యెంతయో యుపకరించు గ్రంథాలయ విషయమున వారత్యంతశ్రద్ధను వహింతురని విశ్వసించుచున్నారు.

౨౧ గ్రంథాలయముల అభివృద్ధి కాటంకముగానున్న

(అ) 213 నెంబరు లోకలుబోర్డు సర్క్యులరును రద్దు చేయుటకున్ను,

(ఆ) 1860 సం॥ 21 వ చట్టప్రకారము గ్రంథాలయములను రిజిష్టరు చేయించుటకు నిర్ణయించిన రు 50 ల రుసుము తీసివేయుటకున్ను,

(ఇ) రిజిష్టరు చేయబడిన గ్రంథాలయములకు గ్రంథములను కొనుటలో జిల్లా విద్యాశాఖాధికారియనుమతి యుండవలయునను నియమమును తీసివేయుటకున్ను,

(ఈ) గవర్నమెంటువా రిచ్చు గ్రాంటుమొత్తమునకు సరియగు మొత్తమును కొన్నిగ్రంథాలయములవారు (జిల్లాబోర్డు గ్రంథాలయములు, రిజిష్టర్డు గ్రంథాలయములు) వెచ్చింపవలయు నను నియమమును గవర్నమెంటువారిచ్చు గ్రాంటు మొత్తమును కొన్నికార్యములకు మాత్రమే వెచ్చింపవలయు నననియమము తొలగించుటకున్ను, ఈసభవారు మద్రాసుప్రభుత్వమువారి నర్థించుచున్నారు.

౨౨ గ్రంథాలయముల గ్రాంటులనిమిత్తమీ రాష్ట్రమున కనీసము లక్షరూపాయలైన ప్రత్యేకించి గ్రంథాలయముల సర్వతోముఖవికాసమునకై ఆ మొత్తమును వెచ్చించుటలో గ్రంథాలయ నిర్వాహకులకు సంపూర్ణ స్వాతంత్ర్యమును ప్రసాదించుట కీ సభవారు మద్రాసుప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

౨౩ మద్యపాననిషేధమువలెనే నిర్బంధోచిత ప్రాథమిక విద్యనుగూడ నొకజిల్లాలో వెంటనే ప్రారంభించవలసినదిగా మద్రాసుప్రభుత్వమువారి నీసభవారుకోరుచున్నారు.

౨౪ గ్రంథాలయ భవననిర్మాణములకు అర్ధగ్రాంటుల నిప్పించవలసినదిగా మద్రాసు ప్రభుత్వమువారి నీ సభవారు కోరుచున్నారు.

౨౫ శ్రీయుత "ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు" గారి "మాలపల్లి" పై నిషేధము తొలగించినందులకు సంతోషమును వెలిబుచ్చుచు తక్కంగల తెలుగుగ్రంథముల పైగల నిషేధమును తొలగించుట కీ సభవారు మద్రాసు ప్రభుత్వమువారిని కోరుచున్నారు.

౨౬ దొరతనమువారిచే ప్రచురింపబడు పారిశ్రామిక ఆరోగ్యవిషయిక వ్యవసాయకప్రచురములను జిల్లాగజెటీలను ఆంధ్రభాషయందు ముద్రింపబడు గ్రంథముల పట్టికలను గ్రంథాలయములన్నిటికిని ఉచితముగా నొసగుటకై ప్రభుత్వమువారి నీ సభవారు వేడుచున్నారు.

౨౭ ఈ సభవారు హిందీ రాష్ట్రభాషగానుండుట కంగీకరించుచు మాతృభాషయం దన్వయజ్ఞానము కలుగులోపల వేరొకభాషను విద్యార్థులకు నేర్పచూచుట వ్యర్థమనియు హిందీని ౧, ౨, ౩ ఫారములలో నిర్బంధము చేయు టనవసరమనియు తలంచుచున్నారు.

౨౮ మద్రాసురాష్ట్రమునగల తెలుగుజిల్లాల నన్నిటిని కలిపి ప్రత్యేకాంధ్రరాష్ట్రముగా నిర్మించు టత్యవసరమని యీసభవారు తీర్మానించుచు అందులకై వలయు నాందోళన చేయవలసినదిగా ఆంధ్రదేశీయులను ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘమువారిని ఆంధ్ర అసెంబ్లీ కౌన్సిలు సభ్యులను ఈసభవారు కోరుచున్నారు.

౨౯ రాయలసీమయని పిలువబడుచున్న కడప, కర్నూలు, బళ్లారి, చిత్తూరు, అనంతపురంజిల్లాలలోని కళాశాలలను ఆంధ్రవిశ్వవిద్యాలయమున వెంటనే చేర్చవలసినదని ఆంధ్రవిశ్వవిద్యాలయాధికారులను మద్రాసు ప్రభు

# కేంద్ర గ్రంథాలయావశ్యకత

ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము ప్రశంసనీయముగ కొనసాగుచున్నది. కడచిన యిరువదేండ్లలోను ఎన్నియో ఉద్యమములు తలలెత్తినవి; కాలప్రవాహమున తలలు వంచినవి; రూపుమాసి అనంతసాగర సంగమము నొందినవి.

ఆంధ్రులారంభశూరులు. ఉత్సాహోద్రేకములువీరిసొమ్ము. ఆరంభించి పరిత్యజించుటయం దాంధ్రుల కితరు లెవరును సాటిరారు. అయినను గ్రంథాలయోద్యమ మీ ఆంధ్రుల నైసర్గికలక్షణముల కేలనో గురికాలేదు. బాలారిష్టము లన్నియుఁ గడతేరినవి. ఇందులకు గ్రంథాలయోద్యమ ప్రచారకులు స్తవనీయులు; ధన్యులు. ముఖ్యముగ కాల ప్రవాహమున గంతులువేయుటకై గ్రంథాలయోద్యమమును విడనాడక నిశ్చలకృషి సల్పిన అయ్యంకి వేంకటరమణయ్యగారు ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులు. ఇఁక గ్రంథాలయోద్యమము నవయౌవనముతో, నూత్నశోభాలంకారములతో, దినదిన ప్రవర్ధమానమై చిరంజీవి కాఁగలదనుట నిశ్చయము. కాని, ఆత్మావలోకనమున కిదే తరుణము.

ఆంధ్రదేశమునందుఁగల ముఖ్యపట్టణములయం దెల్ల నేఁడు పేర్కొనఁదగిన గ్రంథాలయములు కలవు. పలు తావుల పల్లెలయందుఁగూడ గ్రంథాలయములు వెలసినవి.

## గ్రంథాలయసంస్కరణము

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులుగారు

ఎన్నియో గ్రంథాలయములకు సొంతభవనము లున్నవి. ప్రతి గ్రంథాలయమున ఎన్నెన్నియో వేలకొలఁది గ్రంథము లున్నవి. అయిననేమి? ఈ గ్రంథాలయములన్నియు నిర్ణీత కార్యక్రమము ననుసరించి, నిర్మింపఁబడినవి కావు. వీని కొండొంటికి సహకారకార్యక్రమప్రణాళికయు లేదు. ఆంధ్రగ్రంథాలయముల నన్నింటిని, ఏకోన్ముఖముగ, ఒక నిర్ణీతకార్యక్రమ ప్రణాళిక ననుసరించి, తేజోవంత మొనరింపఁగల కేంద్రగ్రంథాలయమును లేదు. ఏ గ్రంథాలయమునందుఁగాని, ఏ ఒక ప్రత్యేక విషయమును గుఱించియైన, సంపూర్ణ పరిశోధనము గావించుటకు వలయు గ్రంథములును లభింపవు. "ఇది పరిశోధన గ్రంథాలయ"మని పేరొందదగిన గ్రంథాలయ మాంధ్రదేశమున లేదనుట సాహసముకాదు. సంచార గ్రంథాలయములు లేనే లేవు.

గ్రంథాలయముల పుస్తకముల జాబితాల నొకపరి సింహావలోకన మొనరించుచో, అన్ని గ్రంథాలయముల యందును, అధిక సంఖ్యాకములగు పుస్తకము లొకే రకమునకుఁ జెందియుండును. ఎక్కడ చూచినను పురాణములును, కథలును, నవలలును, నాటకములును, కావ్యములును గోచరింపక మానవు. ప్రాచీన విజ్ఞాన కోశములగు తాటాకు పుస్తకముల నన్నిగ్రంథాలయములు వాంఛించుచునే యుండును. గ్రంథముల సంఖ్యపై మమత

త్వమువారిని అందులకై వలయుశాసనములను, శాసన సభలలో ప్రవేశపెట్టవలయునని ఆంధ్రఅసెంబ్లీ కౌన్సిలు సభ్యులను ఈ సభవారు కోరుచున్నారు.

30 కేంద్ర గ్రంథాలయములవద్ద బ్రాడ్‌కాస్టింగు నొక దాని నేర్పఱచి ప్రతిగ్రామగ్రంథాలయములవద్దను రిసీవింగుసెట్టు (Valve Set) నెలకొల్పవలయు ననియు అందువలన నుపన్యాసము లాకర్షవంతముగా ప్రజలకు విన్పింపబడును గాన వెంటనే స్థానికప్రభుత్వమువారట్టి కార్యవిధానమునకు గడంగవలసిన దనియు ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

తీర్మానములన్నియు పూర్తిగాకమునుపే పెదవడ్లపూడి నుండి పిడపర్తిపాలెంవు బోటువచ్చుటచే అందరును మధ్య లేచి లాకువద్దకు వెళ్లి సేవాశ్రమమువారునడపుచున్న బోటులోని గ్రంథాలయము దర్శింపవచ్చిరి. అల్పాహారముల యనంతరము మిగిలిన తీర్మానములు పూర్తిచేసినపిమ్మట, అధ్యక్షుల ఉపసంహారవాక్యములతోను, ఆహ్వానసంఘాధ్యక్షుల వందన సమర్పణముతోడను సభా * వ్యవహారము సమాప్తమయ్యెను. శృంగారపురవాస్తవ్యులు శ్రీయుత నాగేశ్వరం సుందరశర్మగారు కడపట శ్రీఆదిపూడిసోమనాథరాయకవి రచించిన ఆంధ్రమాతృస్తవమును పఠించి సభికులకు మంచి ప్రబోధము గావించిరి.

సభానంతరము ప్రతినిధులును ఇతరతాలూకాలనుండి విచ్చేసిన గ్రంథాలయసేవకులును పెదపాలెములో జరిగిన గ్రంథాలయసేవకుల యిష్టాగోష్ఠిసమావేశమున పాల్గొనునిమిత్తము ప్రయాణమైపోయిరి.

* ప్రారంభకులు, అధ్యక్షులు, ఆహ్వాన సంఘాధ్యక్షుల యుపన్యాసములు ముందుసంచికలో ప్రకటింపబడును.

పోలేదు. ప్రాశస్త్యముపై దృష్టి మరలలేదు. ఆధునిక విజ్ఞానకోశమనఁదగు, ఆంధ్రగ్రంథమును సంపాదింపఁ జూచుటకంటె, షేక్సుపియరు కవి, ఆంగ్లనాటకములను సంపాదించవలెనను కుతూహల మింకను క్రుంక నారంభింప లేదు. కర్తవ్య మేమి?

నేఁడు దేశమునందు రాజకీయవిప్లవ మేమియును లేదు. వాతావరణము శాంతముగ నున్నది. ప్రశాంతచిత్తవృత్తితో కార్యక్రమము నిర్ణయించుటకు సావకాశము లభించినది. రాష్ట్రపరిపాలనము ప్రజాప్రతినిధుల హస్తగతమైనది. ప్రజోపయోగకార్యక్రమనిర్ణయమునకును, నిర్వహణమునకును గూడ అదను సమకూడినది. గ్రంథాలయాధికారులును, గ్రంథాలయోద్యమ ప్రచారకులును, "నాది-నా" యనుశబ్దమును మఱచిపోయి గ్రామ, పట్టణ, తాలూకా, జిల్లాల అభిమానములను వీడి, విశాలాంధ్రదృక్పథమున కర్తవ్యనిరూపణమునకు పూనవలసియున్నది.

## కేంద్రగ్రంథాలయము.

(౧) ఈకర్తవ్యనిరూపణమున ప్రధానస్థానమువహించునదిది. ఈకేంద్రగ్రంథాలయమే పరిశోధన గ్రంథాలయముగ కూడ నుండవలెను. (Research Library) ఈ కేంద్రగ్రంథాలయము ప్రాచీన శాస్త్రసంబంధపుస్తకములను, ఆధునిక రాజకీయార్థికసమస్యలకు సంబంధించినపుస్తకములనుమాత్రమే సంపాదింపఁదగును. ప్రాచీనశాస్త్రపరిశోధనము చేయఁగోరువారికిని, ఆధునికార్థికరాజకీయశాస్త్రపరిశోధనములు చేయువారికిని ఈ కేంద్రగ్రంథాలయ మొక్కటే సమస్తసౌకర్యముల నొసఁగఁగూర్పఁగలిగినదిగా నుండవలయును. నేఁడు ఆంధ్రదేశమునందుఁగల సమస్తగ్రంథాలయముల యందునుగల ఆర్థికరాజకీయ సంబంధ పుస్తకములును, ప్రాచీనశాస్త్రగ్రంథములును, ఈకేంద్రగ్రంథాలయమున కేంద్రీకరింపనగును. అచ్చుపడనితాటాకుపుస్తకము లన్నియు, విద్యావిభాగమునకు జెందియున్నను, కేంద్రగ్రంథాలయమునందే పదిలపఱుపఁదగును. వీలువెంబడిని కేంద్రగ్రంథాలయ మట్టి వ్రాఁతప్రతులను అచ్చువేయించి ప్రచారమునకు దీసికొని రాఁదగును.

(౨) ఈ కేంద్రగ్రంథాలయమునుండి జిల్లా గ్రంథాలయములును వ్యక్తులును గూడ పుస్తకములను తెప్పించుకొనుచుండఁదగును. కేంద్రగ్రంథాలయము పుస్తకములను ఎరవిచ్చు గ్రంథాలయము (Lending library)గ గూడ పని చేయవలయును.

(౩) కేంద్ర గ్రంథాలయము, జిల్లా గ్రంథాలయములు తెప్పించుపుస్తకములను నిర్ణయించుటకు సంపూర్ణాధికారము కలిగి యుండవలయును.

## జిల్లా గ్రంథాలయములు.

౧ ఆయా జిల్లా ముఖ్యపట్టణములయందుఁగల గ్రంథాలయములు, జిల్లా గ్రంథాలయములుగ పనిజేయఁదగును.

౨ ఈ జిల్లా గ్రంథాలయములకు గ్రామగ్రంథాలయములు అనుబంధ గ్రంథాలయములుగ నుండఁదగును. గ్రామ గ్రంథాలయములపై జిల్లా గ్రంథాలయములకు పరిపాలనా, పరిశీలనాధికారములు రెండును నుండఁదగును.

౩ జిల్లాగ్రంథాలయము లన్నిటికి ఒక ప్రణాళిక యుండఁదగును. ప్రతిజిల్లా గ్రంథాలయమునందునను, అన్నిరకముల పుస్తకములును ఉండరాదు. ౧ ఒక గ్రంథాలయము భాషావిషయక గ్రంథములను ౨ మఱియొక గ్రంథాలయము మతవిషయక గ్రంథములను ౩ ఇంకొక గ్రంథాలయము వ్యవసాయపారిశ్రామిక విషయక గ్రంథములను ౪ వేరొకగ్రంథాలయము పురాణేతిహాసవిషయకగ్రంథములను మాత్రము తెప్పించుకొనఁ దగును. ఈవిధముగ ఒక్కొక్క జిల్లా గ్రంథాలయ మొక్కొక్క తరగతి గ్రంథములను మాత్రమే సేకరింపఁదగును. ఇట్టి విషయవిభాగమునకు సంబంధించిన గ్రంథములను సక్రమముగ తెప్పించుకొనునట్లొనరించుటకే కేంద్రగ్రంథాలయమునకు జిల్లాగ్రంథాలయములపుస్తకముల నిర్ణయముపైనధికారముండుట ఆవశ్యకము.

౪ ఆయా గ్రంథాలయములయందుఁగల పుస్తకము లన్నింటిని పరిశీలించి, విషయ విభాగము ననుసరించి, వివిధజిల్లాగ్రంథాలయములలో కేంద్రీకరింపఁదగును. ఏ గ్రంథాలయమునందు, ఏ విషయములకు సంబంధించిన పుస్తకములు నేఁడధికముగ సేకరింపఁబడియున్నవో ఆ గ్రంథాలయమునకా విషయక పుస్తకము లన్నింటిని, ఇతర గ్రంథాలయము లిచ్చివేయవలయును.

౫ జిల్లా గ్రంథాలయములు గ్రామ గ్రంథాలయములకు పుస్తకముల నెరవిచ్చుచుండవలయును.

## గ్రామ గ్రంథాలయములు.

౧ గ్రామ గ్రంథాలయములు ప్రజాసామాన్యమునకు పనికివచ్చు పుస్తకములు కలిగియుండవలయును.

౨ ఆధునిక విజ్ఞానప్రదములగు గ్రంథములను తెప్పించునట్లు చూడవలయును.

ఈ విధముగ గ్రంథాలయప్రణాళికను, నిర్ణయించుకొనుచో ఆంధ్రదేశమునందు, గ్రంథాలయోద్యమము సక్రమమార్గమున అభివృద్ధి చెందఁగలదు. ఇందులకు కేంద్ర గ్రంథాలయస్థాపన మత్యవసరము గాన కేంద్ర గ్రంథాలయస్థాపనమునకై గ్రంథాలయోద్యమాభిలాషులందఱును సత్వరముగ తగుకృషి సల్పెదరుగాక! వందేమాతరం.

# లోకలుబోర్డుల శాసనము గ్రామపంచాయతీల స్థానము*

శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు ఎం. ఏ.

గ్రామపంచాయతులు స్వరాజ్య సౌధమునకు బునాది. ప్రజల ప్రభుత్వము నిజము కావలయునంటే ఆకాశ హార్మ్యలు కట్టడమువల్ల ప్రయోజనములేదని క్రిందినుంచి కట్టుకొని రావలసి ఉన్నదని ఏనాటినుంచో అందరు పెద్దలూ అంటున్నారు. పూర్వము పంచాయతీలు మన దేశములో ప్రబలంగా ఉంటూఉండినవని, అవి స్వతంత్ర ములని, పైరాజ్యా లెన్ని మారి మసిబొగ్గైపోతున్నా ఈ పునాది సంస్థలను చంపివేయక ఉన్నందుచేత భారత భూమి ప్రజ తరతరాలు యుగయుగాలు స్వాతంత్ర్యం పోగొట్టుకొన్నట్టే తలచకయుండినదని అనేకులు వ్రాసి నారు. కాని బ్రిటిషు రాజ్యాంగపద్ధతి ప్రవేశమైనపిదప రూపుమాసిపోయిన పంచాయతులను మరల సృష్టించే ప్రయత్నం మొన్నమొన్నటి వరకూ జరిగిందికాదు

1920 లో ఆసంవత్సరపు XV నంబరు చట్టమొకటిచేసి గ్రామములవారు పంచాయతు లేర్పరచుకొనవచ్చు ననిరి. ఊరిచుట్టు మొలచిన నాగజముడు నరకడమనే పనితో కూడ కొన్ని పనులను జాబితాచేసి అందులో ఏపని తలచు కుంటే ఆపని గ్రామపంచాయతీ చేసుకొనవచ్చు ననిరి. సర్కారువారిచ్చే గ్రాంటులు గ్రామములోని ఉమ్మడి ఆదాయము తప్ప వీనికి సక్రమమైన ఆదాయమార్గాలు లేవు. గవర్నమెంటువారి మంజూరుతో కొన్ని కొన్ని పన్నులు వేసుకోడానికి అధికారాలు ఆచట్టములో ఇము డ్చిరి. గుంటూరు, సేలము, పడమటిగోదావరి, చెంగల్పట్టు, అనంతపురము మున్నగు జిల్లాలలో ఇట్టి పంచాయతులు విస్తారముగా ఏర్పడెను. పాడుగుచేతి పన్నేరముగా పం చాయతీ రిజస్ట్రారు జనరలువారివద్దనుంచి గ్రాంటులుతెచ్చు కోగల పంచాయతీలు శ్రద్ధగా ఊరిబలాన్ని ఉపయోగిం చుకొని రైతులచేత కాయకష్టము చేయించుకోగల పంచా యతులు కొన్నికొన్ని బాటలు రోడ్లు వేసుకోగలిగినవి, దీపాలుపెట్టుకోగలిగినవి, గ్రామపు బడుల గ్రాంటులు రిజస్ట్రారుద్వారా పంచాయతులకు ఇవ్వడము సంభవించి నందువల్ల అనేకపంచాయతీలు స్కూళ్ళు లేనిచోట పె ట్టుకో గలిగినవి. కాని ఈమాత్రము పనియైనా ఆరువేల పంచాయతులలో ఏ 600-700 పంచాయతులే నిర్వహించి నవి. తక్కినవి పేరుకు పంచాయతులు గాని పనికి పంచా యతులు కాలేదు.

అందుచేత 1930 లో లోకలుబోర్డులచట్టము సవరణకు వచ్చినప్పుడు ఈ పంచాయతులను అందులో చేర్చి "అవి యే నిజమైన లోకలుబోర్డులు, గ్రామము, తాలూకా, జిల్లా ఇన్నిటికిని సంబంధించిన సర్వస్థానిక వ్యవహారములు వాని మూలకముగానే జరుగవలెను. పంచాయతీలేని పల్లె టూరే యుండరాదు." అనే పట్టుదలతో సవరణలు చేయించవలెనని అప్పుడు శాసనసభలోనున్న నాబోటి వారికి తోచినది. పంచాయతీబోర్డులను సరియైన శాస నాధారముల మీద నేర్పరచి లోకల్‌బోర్డు పరిపాల నలో వీనికి కొంత ప్రముఖస్థాన మీయవలెనని అందరికిని తోచినది. గ్రామసీమలలో పంచాయతులు నిర్బంధముగా స్థాపించవలసినదని వాని జాయింటుకమిటీలే, అంటే ఆయా భాగములలోని పంచాయతు లేర్పరచుకునే ప్రతి నిధి సంఘములే తాలూకా జిల్లాబోర్డులుగా నేర్పడవలసిన దని అదివరలో తాలూకా జిల్లాబోర్డులకు ఉన్న ఆదాయ మార్గాలన్నిటినీ వాని యధికారములన్నిటినీ ఇంక కొన్ని సర్కారు అధికారములతోకూడ పంచాయతులకు మార్చ వలసినదనీ సూచించిన పంచాయతీ రాజ్యసూచనలు జిల్లా బోర్డు అధ్యక్షులు తాలూకాబోర్డు అధ్యక్షులతోకూడిన ఆనాటి శాసనసభ్యుల తల కెక్కలేదు. నేటి లోకలు బోర్డుల అక్కులోగల సదుపాయముల మాత్రముతో ఐచ్ఛి కముగా పంచాయతు లేర్పడి తాలూకాబోర్డు జిల్లాబోర్డు లోకలుబోర్డుల ఇనస్పెక్టరు జిల్లాపంచాయతీ ఆఫీసరు ఇందరి తనిఖీలో పనిచేయవలసినదని శాసన మేర్పడినది. భూమి శిస్తుమీది సెస్సులో బహు స్వల్పభాగము పంచా యతులకు ప్రత్యేకించడము జరిగినది. ప్రజలలో కలతలు పెంచే పన్నులు వేసికొనే అధికారాలు లైసెన్సుఫీజులు విధించే అధికారాలు పంచాయతులకునిర్ణయించిరి. జాయిం టుకమిటీ లేర్పరచుకునే హక్కు వీనికి సంక్రమించినది. కాని బొబ్బిలి ప్రభుత్వములో ఆహక్కు నిష్ప్రయోజన

---

* కడచిన మాసము 30 వ తేదీని జరిగిన బెజవాడ జిల్లా పంచాయతీ ప్రెసిడెంట్ల సమావేశమున చేసిన ప్రారంభోపన్యాససారము.

కరము చేసివైచిరి. లోకలుబోర్డు శాసనముప్రకారము అటవీపరిపాలనము, పంటనీటి పంపకము, ధర్మాదాయముల పరిపాలన—అది ఇది యననేల ప్రభుత్వమువారుగాని ఇతరలోకలుబోర్డులుగాని ఇతర ధర్మసంస్థలుగాని పంచాయతులకు సంక్రమింపజేసే అన్ని యధికారములును పంచాయతులు జరుపుకొనవచ్చుననుట ఈశాసనసవరణలో చేర్చిరి. కాని సంక్రమింపచేసే పుణ్యాత్ము లెవరు? మంత్రులు రాజ్యమేలినా జరుగుబాటు నిరంకుశాధికారులదేగదా!

కొంతకాలమునకు తరువాత బొబ్బిలి తన ముఖ్యమంత్రిత్వములో తాలూకాబోర్డులను రద్దుచేయగాజూచి పంచాయతులు విరివిగా స్థాపనయగునని మాబోటివారి కలలను మహారాజాలు తీర్తురని భ్రమపడినవారు కొందరు కలరు. కాని వారి తాలూకాబోర్డుల రద్దు జిల్లాబోర్డుల విభజనలకు పార్టీలను బలపరచడానికి కృంగదీయడానికి పనికివచ్చే యెత్తులకు వినియోగపడడం దేశపుదురదృష్టము.

నేటిదినము పరిస్థితులు మారియున్నవి. గవర్నరులుప్రతిబంధకాలు పెట్టుటలేదని తీర్మానముగా మాట యిచ్చిన పిదప పరగణా పరిపాలనను సర్వస్వతంత్రులుగా ఇండియా గవర్నమెంటు శాసనపు వీడరాని ఇబ్బందులకు లోబడి కాంగ్రెసువారు తలధరించినారు. వీరు సంపూర్ణముగా పంచాయతీ పరిపాలనయే దేశమున స్థాపింపనుద్యోగించు పార్టీవారు కావున ఇక ముందు జరుగబోయే సవరణ సవరణమాత్రముగానుండరాదు; పరిపూర్ణమైన పునర్నిర్మాణముగానే యుండవలెను. పునాదికట్టడము నిజమైన పునాది కట్టడమే కావలెను.

శాస్త్రోక్తముగాను ఛాందసముగాను చెప్పదలచుకుంటే ఇంతకాలము అమలులో ఉండే లోకలుబోర్డు చట్టముపై దర్జా ప్రభుత్వపు టధికారి తన ఇష్టమువచ్చినట్టుగా లోకలుబోర్డులనే క్రింది దర్జా అధికారులను నియమించి తన ప్రతినిధిగా ఈ యీ పనులు చేయవచ్చును, ఈ యీ స్వాతంత్ర్యములు పొందవచ్చునని ప్రాతినిధ్యాధికారులను సృష్టించే చట్టముగా ఉన్నది. ఏర్పడే లోకలుబోర్డు ప్రజల ప్రాతిపదికపు హక్కుచేత ఏర్పడేదని పైఅధికారు లిచ్చే రాయావారపు బ్రతుకు గాక తనకు స్వతంత్రమగు స్థానమున్నదని అనుకోడానికి వీలుగల్పించే చట్టముగాదు.

మనకు సంపూర్ణ స్వాతంత్ర్యం సంక్రమించేవరకు ఈ విధమగు చట్టము ఏర్పడుతుం దనుకోడానికి అవకాశము లేదు. కాని ఇందుకు బునాదులువేసే ప్రయత్నం కాంగ్రెసువారు చేయవచ్చును. దీనికి మూడు ముఖ్యసూత్రా లవసరం. మొదటిది దేశములో మునిసిపాలిటీలుగాఏర్పడే భాగాలు తప్ప మగిరే భూభాగముగాని, పంచాయతీ పరిపాలనలో లేకుండ ఉండరాదు. ఇప్పటి ప్రతి రివిన్యూగ్రామమూ ఒకపంచాయతీగా ఏర్పరచడము అత్యవసరం; అప్పుడు దేశానికి ప్రాతిపదికమైన ఏగ్రామపు సౌకర్యాన్ని గూడ ఇతరప్రాంతప్రతినిధులు కొరవడ చేసే అవకాశముండదు. కొన్ని గ్రామాలకు ఉమ్మడిమీద జరుగవలసిన పనులుకొన్ని ఉన్నవి: ఉదాహరణము: రోడ్ల ఎస్టిమేటు చేసే అధికారిని నియమించుకోవడం. నిజానికి ఎస్టిమేట్ల పనితో గూడ శిక్షణపొందిన ఏడుగ్రామముల గ్రూపు సేవకునిని ప్రస్తుతపు మంత్రి వి. వి. గిరిగారి ఆలోచనను అనుసరించి ఏర్పరచగలిగితే అతడే ప్రతిపంచాయతి కార్యక్రమమును జూచి ఉమ్మడిపనిగూడ చేయవచ్చును. అందుచేత ఉమ్మడి కార్యాలకు గ్రూపు పంచాయతీల జాయింటు కమిటీల నేర్పరచవలెను. ఇంకొక ఎన్నికవలన ఏర్పడే జిల్లాబోర్డు లుండరాదు. ఈ జాయంటుకమిటీల జాయంటుకమిటీ అవసరమని తోచితే జిల్లావిస్తీర్ణపు కార్యమును చూడవచ్చును. లేదా ఇప్పుడు జిల్లాబోర్డు నిర్వహించే కొన్ని పనులు జాయంటు కమిటీలకు వదలివేసి తక్కినవి ఆయా ప్రభుత్వశాఖోద్యోగుల వశము చేయవచ్చును. ఇంతటి కార్యక్రమాన్ని తనిఖీచూచుకొనేపని ప్రభుత్వపు తాబేదారైనలోకలుబోర్డుల ఇనస్పెక్టరుకు సర్వాధికారముతో ఒప్పజెప్పరాదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ బోర్డు శాసన సభ్యులనుండి ఏర్పరచవలెను. లోకలుగవర్నమెంటుమంత్రి వారికి నాయకుడుగానుండి లోకలుబోర్డుల ఇనస్పెక్టరును అతని కార్యాలయమును ఈ బోర్డు వశమునందుంచి కార్యక్రమము జరుపవలెను.

మరియొక విషయ మీ సందర్భమున గమనింపదగియున్నది. గ్రామపరిపాలనమునకు గ్రామపంచాయతి దక్క ఇతరసంస్థలు గ్రామమునందు నిర్మాణము చేయరాదు. ఇరిగేషన్ పంచాయతులు, ఫారెస్టుపంచాయతులు, ధర్మాదాయ పంచాయతులువగైరాలు రద్దుకావలెను. ఇట్టి శాసనబద్ధముగాని సంస్థలను—అధికారుల ఉత్తరువు మాత్రము చేత సృష్టితములగు సంస్థలను—అవకతవక ఎన్నికపద్ధతులమీద ఆధారపడిన సంస్థలను—వేరువేరుగా కల్పించి గ్రామములలో దినమొక ఎన్నికకు తావు చేసియుండడము చేత కలతలు పెరిగిపోయినవి. ఎన్నికలమీది దృష్టితప్ప ప్రజాసేవమీది దృష్టి లేకపోయినది. కాబట్టి వేరే సంస్థలన్నిటిని గ్రామపంచాయతిలో లీనము చేసి వాని ధర్మము లన్నిటిని వీనికి నొప్పజెప్పవలెను.

అయిన న్యాయవిచారణమాత్రము మీ గ్రామపంచాయతీలకు పెట్టరాదు. ఇప్పటి పంచాయతీకోర్టులును ప్రజలకు నష్టదాయకములే! ప్రాచీనకాలములందును న్యాయవిచా

25



రణయందు పరిపాలనపంచాయతి కెక్కువజోక్య ముండ లేదు. పరిపాలనపంచాయతీలో గ్రామపెద్ద లుందురు. కావున వారి మంచిపలుకుబడిచేత సర్దుబాటయిపోయే చిల్లర వ్యవహారములు సర్దుబాటయిపోవును. దానికి శాసన మవశ్యము కాదు. ప్రజలలో ఇప్పటికిని నిలవయున్న సహజ సమరసబుద్ధి నశింపని యంతకాలము ఈ విధతీర్మానములు జరుగుచుండును. ఆ బుద్ధి క్రమక్రమముగా అభివృద్ధి కాగలదనుట చారిత్రికక్రమమున నేడెవరు చూడదగియున్నది. కాని గట్టివ్యవహారమే యేర్పడి విచారణయే యవసరమగునప్పుడు వాది ప్రతివాదులు తాము స్వేచ్ఛగా నేర్పరచుకొను పెద్దమనుష్యుల తీర్మానమును అధికారతీర్మానముగా నిర్ణయించుట యత్యవసరము. దీనినే ఆంగ్లమున కంపల్సరీ ఆర్బిట్రేషన్ అందురు. గ్రామపుకోర్టుల మొదటిచట్టము ఈమార్గముననే యేర్పడియుండుట ఇప్పటికిని చూడవచ్చును. స్వేచ్ఛగా నేర్పరచుకొనిన ఈ పంచాయతి మీదను నొకప్పుడొక పార్టీకి అవిశ్వాసము కలుగుట కవకాశమున్నది. అట్టిసందర్భములలో అదేరీతిని రెండవపంచాయతిని నిర్మించుకొనుట కవకాశమిచ్చి దానితీర్మానము తుదితీర్మానము గావించుట మనదేశపు పూర్వాచారమైనట్లు చరిత్రలు తెలుపుచున్నవి. ఇట్టిన్యాయవిచారణపద్ధతి ఏర్పరచితే చాల ఎక్కువ అధికారము ఈ సంస్థలవశము చేయవచ్చును. ఇప్పటి కోర్టుల నేకములు రద్దుచేయవచ్చును. వానివలన ప్రజలుపడు గొప్పవిపత్తును పరిహరింపవచ్చును.

పరిపాలన పంచాయతీ, న్యాయవిచారణ సంస్థ—ఇవి రెండునుగాక గ్రామమున నుండదగినసంస్థ కో అపరేటివు సొసైటీ. ఇది ఇప్పటివలె సాహుకారుపద్ధతినిగాక ప్రజోపయోగపద్ధతి నడుచుటకు ఋణబాధను పెంచుటమాని పోగొట్టుటకు సాధనమగుటకు తగిన సంస్కారము పొందదగును. అప్పుడు ఆర్థిక కార్యముల కిది గ్రామమునకు పరిపూర్ణముగా తోడ్పడు సంస్థగా నుపయోగించుకొనవచ్చును. జరుగదగిన సంస్కారము గ్రామోపయోగమున కిది నిర్వహింపవలసిన ధర్మములు వర్ణింపసాగిన నది యొకగ్రంథ మగును. ఈ ప్రస్తుతోపన్యాసమునకు నప్రస్తుతము. పంచాయతీ రాజ్యములో కో అపరేటివు సొసైటీ యొక యంగము. గ్రామప్రజలలోని ప్రతిమేజరును—స్త్రీనిగాని పురుషునిగాని—కో అపరేటివు సొసైటీలలో చేర్చగలిగితే—చేర్చవచ్చునని నాయాశయము—దీనిని గ్రామ పంచాయతీలో లీనము చేసివేయవచ్చును. దోషముకాదు, న్యాయముకూడ.

ఇక పరిపాలనపంచాయతికి ద్రవ్యసాధన మార్గమేమి యనుట తరువాతప్రశ్న. అదియొకటే లోకలుపరిపాలనాంగమైనప్పుడు, జిల్లాబోర్డు రద్దయినపుడు, ఇప్పుడు జిల్లామీదట జిల్లాబోర్డుకు సంక్రమించే సర్వాదాయము, పూర్తి సెస్సు మొత్తముతో, గ్రామమునకు సంబంధించినంతవరకు పంచాయతికి చెందిపోగలదు. ఇప్పుడు ప్రభుత్వమునకు చెందిన అటవీ పరిపాలన, పంటనీటి సరఫరా వగైరా అధికారములు పంచాయతికి చెందగలవు. కావున ఆ యాదాయములు పంచాయతులకే సంక్రమింపగలవు. గవర్నమెంటు కార్యము ఎక్కువభాగము పంచాయతులు నిర్వహించును గాన ప్రభుత్వపు సమిష్టి ఆదాయమునుండి ఇంకకొంతమట్టుకు పంచాయతులకు ఇచ్చివేయవచ్చును. ఇంటిపన్నులు వగైరాలు విధించడము లైసెన్సు ఫీజులు వసూలు పరచడము మొదలైనవి ఒకవేళ చట్టములో నున్నను పంచాయతులు అమలులో పెట్టి ప్రజలను వేధింపరాదు. తానుసృష్టించిన జీవాధారక వస్తువును నేటి పరిస్థితులలో నాణ్యముల రూపమునకు మార్చుటలో రైతుమహత్తమమగు దుర్దశలలో పడిపోవుచున్నాడు. సర్వనాశనమగుచున్నాడు. కాబట్టి గ్రామపు ఉమ్మడిపనికి అతనిసేవ కాయకష్టము రూపముగా కోరడము ఇప్పటి కష్టదశనుండి అతనిని తప్పించడానికి మార్గము. గ్రామసౌభాగ్యానికి ప్రాచీను లేర్పరచుకొనిన సదాచారమున కవలంబనము, 'సోమదారద కెలస' అని వారమున కరదినము పని చొప్పన గృహస్థులకు విధించిన పనిపన్ను మైనూరు పంచాయతులు దివ్యసుందర స్వరూపము దాల్చుటకు సాధనమైనది. దానిని మనసీమలోను శాసనబద్ధము చేసి పంచాయతీ నిర్మాణ కార్యక్రమానికి సాధనమును వినియోగించుట మొదట చేయదగినది. గ్రామస్థులు తాము పనిచేయలేనప్పుడు ధాన్యముకూలి యిచ్చి కూలివారిని పంపుట కిది యవకాశ మిచ్చును.

మొత్తముమీద పంచాయతీపరిపాలన ప్రజలకు ఆర్థికమగు బరువు తగ్గించునది, పరస్పరవిశ్వాసమున మెలగుటకు అవకాశ మిచ్చునది, న్యాయపరత్వమును పురికొల్పునది, బయటివారిమీద నాధారపడవలసిన దైన్యమును తుడిచివేయునది, సాధ్యమైనంత పూర్ణాధికారమును సంక్రమింపజేయునది యగుటకు పైన సూచించినవిధానము తోడ్పడగలదు.

గ్రామపంచాయతుల అధ్యక్షులగువారు గ్రామసౌభాగ్యోద్యోగమున పనిచేయునట్టివారు ప్రాతిపదికముగా చేయదగినపని యొకటికలదు. గ్రామములో నెవ్వరును అక్షరము రానివారు లేరనునంతవరకు పట్టుబట్టి ప్రజలను అక్షరజ్ఞులను చేయుటకు పాటుపడవలెను. నేడు మన

# వడిచక్రాలు

## శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు

రాటాలరేడు, మహాత్మాజీ, ఖాదిపరిశ్రమాభివృద్ధికి పూనుకొన్ననాటినుండి రాటాలలో మార్పులు చేయుచున్నారు. వారు స్వయముగా ఎర్వాడ చెరసాలలోనుండగా ఒకరాటమును చేయించిరి. దానిపేరు ఎర్వాడా రాటము. అందులో రెండుచక్రాలు గలవు. పెద్దచక్రము మధ్యకొల్త ౬౪ అంగుళములు. రెండవచక్రము మధ్యకొల్త ౫౪ అంగుళములు. దీనిక్రింద దీనికి అనుకొని ఒక చిన్నచక్రము గలదు. దానిమధ్యకొల్త ౧౨ అంగుళములు. పెద్దచక్రము చుట్టువేసినదారము చిన్న చక్రమునకు తగిలింతురు, చిన్నచక్రము చుట్టినదారము కదురు పైనున్న దిండుకు తగిలింతురు. కదురు తగిలించుపీటకు చెవులులేవు. ఒక గాడిలో కదురు తిరుగును. కదురుపీటకు ఇనుపచుట్లు గొలుసు అంటించియుండును. మరియు, ఈ చక్రములను నిలువుగా అమర్చక బల్లపరుపుగా అమర్చిరి; కదురుకు ఇనుపదిండు పెట్టిరి.

ఈరాటమును ఫిడేలు పెట్టెవలె తీసికొని పోవచ్చును. బరువుతక్కువ. పెద్దచక్రము ఒకమారు తిరుగుసరికి, కదురు ౧౧౦ సార్లు తిరుగును. గంటకు తేలికగా 300 గజాల నూలు వడకనగును. పురియు బాగుగానే యుండును.

ఈ యెర్వాడారాటములోని రహస్యమే, వడిచక్రమునకు దారితీసెను. మామూలు రాటములో ఆకులతోనుండెడి చక్రమును, కొయ్యదిండుగల కదురునుఉండును. ఈఆకుల చక్రము ఒకమారు తిరుగుసరికి కదురు ౬౦, ౭౦ సార్లు తిరుగును. అందు చేత నూలు తక్కువవచ్చును. పురితక్కువ అగును. వడుకువారికి కూలిగిట్టదు. నేయువారికి బాధ హెచ్చు - మజూరి హెచ్చు; ఖాదీ ఖరీదు పెరుగును. గుడ్డ మనదు. మామూలురాటములో ఇపుడు చేసిన మార్పులు (౧) కొయ్యదిండు తీసివేసి ఇనుపదిండు చిన్నదిపెట్టుట. (౨) ఆకులచక్రము ఛివరనుండి, కదురువరకుగల దూరములో సగమున ఒకపీటనమర్చి, దానిమీద వడిచక్రమును బిగియించుట (3) తోలుచెవులు, కొయ్యచెవులు, గుడ్డ చెవులు, పీచుచెవులు తీసివేసి, బొమ్మపీటలో గాడికోయుట - ఆగాడికిపైని క్రింద, రెండువైపుల చెరినాలుగు తూట్లువేసి నులకగుచ్చి ఆనులకమీద కదురు ఆడునట్లు చేయుట. (౪) ఆకుల చక్రముమీదనుండి వడిచక్రమునకు, వానిమీదనుండి కదురు మీదికిని రెండు వడిదారములు వేయుట. ఆకుల చక్రము చుట్టుకొల్త ౬౪ అంగుళములైనపుడు, 3 అంగుళములు మధ్యకొల్తగల వడిచక్రముమీదుగా వడ్పుదారముల మూలమున, ఆకుల చక్రము ఒకసారి తిరిగితే, కదురు ౧౩౦ మొదలు ౧౫౦ సార్లుదాక తిరుగును. ఈవడిచక్రములో మొదటిభాగమునకు మధ్యకొల్త 3 అంగుళములు దాని రెండవభాగమునకు మధ్యకొల్త ౧౪ అంగుళములు. ఈ వడిచక్రము వాడుటచేత గంటకు ౫౩౩ గజాలు నూలుతీయవచ్చును. దీని పురి చాలబాగుండును. మంచిమరనూలుతో సమానముగానుండును. ఒక్కొకపుడు మించును. ఈ వడిచక్రమును మార్చినచో మరింత మేలుకలుగును. వడిచక్రములో మొదటిభాగము మధ్యకొల్త ౪ అంగుళములు రెండవ భాగము మధ్యకొల్త ౧౪ అంగుళములుగా పెంచనగును. దీనివల్ల ౬౪ అంగుళములు చుట్టుకొల్తగల ఆకులరాటము ఒక్కమారు తిరిగినపుడు కదురు ౨౫౦ సార్లు తిరుగును. నూలు ౭౦౦ గజాలు వచ్చును.

మామూలుగా తీయునూలుకు వడిచాలదు; పురిచాలదు; నేత కష్టము, అను నేతవారు ఈ చిన్నవడిచక్రముద్వారా తీయునూలుకు పురి హెచ్చుగానున్నది, తగ్గింపవలె ననుచున్నారు.

ఈ వడిచక్రముఖరీదు ౦-౬-౦ కు మించదు. కొన్నాళ్ళలో ౦-౪-౦ కు తగ్గించవచ్చును. ఇనుపదిండుగల కదురు ఖరీదు ౦-౨-౬. చెవులు తీసివేసి గాడివేయుటలో ఖర్చు తగ్గును. కదురు ఏటవాలుగా అమర్చినచో వడుకుట సులభమగును. నూలు ఊడిరాదు.

ఈ మార్పులవలన మామూలురాటముతోనే ఆదా పెంచవచ్చును. అందరును మార్పులు చేసికొనవలెను.

---

ప్రజకు విజ్ఞానము వ్యాపింపకుండుటే మన యధోగతికి కారణము. ఎల్లయభివృద్ధికిని విజ్ఞానవ్యాపనమే ప్రథమాధారము. అక్షరజ్ఞత దానికి మూలసాధనము. అక్షరజ్ఞతతోగూడ విజ్ఞానము వ్యాపింపజేయుటకు ఇతరసాధనములున్నవి. పత్రికలు గ్రంథములు చదివి వినిపించుట, ఉపన్యాసములు, మేజిక్ లాంతరు సినిమా ప్రదర్శనములు, భజనలు, హరికథలు, ఇట్టివి అనంతములు. వీనినన్నిటిని ఏర్పరచి కృషి చేయునట్టి యుద్యమము గ్రంథాలయోద్యమము. ఏయుద్యమమునందు ఉత్సాహము కొరవడినను ఈయుద్యమము సాగుచుండెనా ప్రజలను అంధకార మావరించదు. అంధకారమున పడిపోనంతకాలము మానవుడు తలయెత్తికొనుటకు మార్గమున్నది. కావున జ్ఞానయోగమున కంతె ప్రాముఖ్యము. అందు చేత సరస్వతీమందిరము సదాసేవింపదగినది. దీనిని మరువవలదు.

# గ్రామోద్యోగ పత్రిక

అఖిలభారత పరిశ్రమ సంఘము, వార్ధా.

సంపుటము ౧. ఆగస్టు-౧౯౩౭ సంచిక ౨

## గ్రామములలో కాగితముచేయుట

హిందూదేశములో ప్రతియేటను అన్నిరకముల కాగితము సుమారు రెండులక్షలటన్నులు ఖర్చుగుచున్నది. దీని ఖరీదు సుమారు రు ౩౪ కోట్లు. ఈలెక్కనుబట్టి మనదేశములో తల ౧కి ౧, ౧౪పౌనులు చొప్పున కాగితము ఖర్చగుచున్నట్లు తేలుచున్నది. యూరోపు, అమెరికా దేశములలో తల ౧కి కాగితము ౫౦, ౧౨౫ పౌనులు ఖర్చగుచున్నది.

విద్యా, విజ్ఞానవిషయములలో దేశముల ఉన్నతిని ఆయాదేశములలోని కాగితపుఖర్చును బట్టి నిర్ణయించుచో, మనము ఎంతో వెనుకబడియున్నామని చెప్పవలసి యుండును. వ్యాపారమును, భాషలును, విద్యయు వ్యాప్తి చెందిన కొలదిని కాగితపుఖర్చు హెచ్చుకాగలదు. తల౧కి ఒక ఔన్సుచొప్పున కాగితపుఖర్చు పెరిగినయెడల మనదేశములో౧౦,౦౦౦టన్నులకాగితము అధికముగ ఖర్చుపడును.

చేతికాగితపు పరిశ్రమలో వస్తువులపైని పెట్టవలసిన పెట్టుబడికంటె మనుష్యులపరిశ్రమయే ఎక్కువ. కేంద్రకార్యాలయములోని మా అనుభవమునుబట్టి ౧౦౦ కి ౨౫ వంతులు వస్తువులఖరీదును ౭౫ వంతులు మజూరియు అగును; అనగా రూపాయలో ౦-౪-౦ వస్తువుల ఖరీదు క్రిందపోగా, మిగిలిన ౦-౧౨-౦ పనిచేయువారికి మజూరి క్రింద ముట్టుచున్నది. ఈ పరిశ్రమను గ్రామములలో అభివృద్ధిచేయుటవలన నిరుద్యోగులగు గ్రామవాసులకు చేతినిండ పని కలుగు ననుట నిజము. యావత్కాలము పని యుండని వ్యవసాయదారులకును, తదితరులకును ఇది యొక ఉపవృత్తిగా ఏర్పడును. ఖద్దరు పరిశ్రమలో వలెనే కాగితముపరిశ్రమలోకూడ పురుషులకు, స్త్రీలకు, పిల్లలకు అందరికిని ఎవరికితగిన పని వారికున్నది. కాగితపుగుజ్జుకు కావలసిన వస్తువులను బాగుగాకొట్టి నానపెట్టుట, నీటితో కలసిన గుజ్జునుండి అచ్చులతో కాగితమును పైకి ఎత్తుట మొదలగు కొంచెము శరీరకష్టమును నేర్పును కావలసిన పనులను పురుషులు చేయవచ్చును. కోయుట, కాగితములకు మెరుగుపెట్టుట, ముడివస్తువులలో పీచుగలవానిని, పీచులేనివానిని విడదీయుట మొదలగు పనులు స్త్రీలును, కొంచెము ఈడువచ్చిన పిల్లలును చేయవచ్చును.

కాగితపు పరిశ్రమకు పీచుగల (నార సాగు) ముడివస్తువులు కావలెను. హిందూదేశములో ఇట్టి పీచుగల పదార్థములనిచ్చు అనేకరకముల మొక్కలును చెట్లును ఉన్నవి. ఇట్టి వానిలో కొన్ని ఏటేట పొలములోవేసి పండించునవియు, మరికొన్ని తమంతట తాము పొలములలోను, అడవులలోను పెరుగుననియు ఉన్నవి. వీనిలో కొన్ని అత్యుష్ణమగు ఇసుక ప్రదేశములలోను, కొన్నిచల్లనగు తేమగల ప్రదేశములలోను పెరుగును. కొన్ని ఏటిగట్లమీదను, కొన్ని తోటలలోను, కొన్ని త్రోవలప్రక్కను పెరుగును. వీటినన్నిటిని ఇప్పుడు నిరుపయోగముగ వదలివేయుచున్నారు. కొన్నిటిని కాల్చివేయుచున్నారు. ఈవిధముగ నారయుక్తయుగల మొక్కలును, చెట్లును, మనదేశములో ౧౦౦, ౧౫౦ రకములున్నవి. ఇవన్నియు గ్రామస్థులకు అందుబాటులోనున్నవే. ప్రత్తికంప, అవిసెకంప, ఈతఆకు, అరటినార ఇవన్నియుకూడ కాగితపుపరిశ్రమలోఉపయోగపడునను మాట చాలమందికి తెలియనే తెలియదు. కాగితపుపరిశ్రమకు ముడిపదార్థములను ప్రత్యేకముగ సేకరింపవలసిన అవసరము లేదు. ప్రతిగ్రామములోను పలురకముల నారసాగు ఈనెలను, ఆకులను, నారలను, గంపలు, త్రాళ్లు, చాపలు, పట్టాలు, ఇంటికప్పులు మొదలగువానికి ఎన్నింటికో వాడుచున్నారు. ఇవన్నియు చివికి చెడిపోయిన తరువాత కాగితము తయారుచేయుట కుపయోగపడును. సాధారణముగా వీనిని మనము బయట పారవేయుదుము; లేదా తగులబెట్టుదుము.

వార్ధాలో వీనితో పనిచేసిచూడగా పెద్దయంత్రములు అక్కరలేకుండ అంతటను దొరకుముడి వస్తువులనుండి గ్రామస్థులు కాగితములను సులువుగ తయారుచేయగలరని మాకు నమ్మకము కలిగినది. లాభసాటిని ఈ పరిశ్రమను సాగించుటకు వీలగుమార్గములను గురించియు, ఉత్పత్తిసాధనములను అభివృద్ధిచేయుటను గురించియు మనము పరిశోధన చేయవలెను.

—కె. బి. జోషి.

## చేతితో తయారుచేసిన కాగితములు దొరకు చోట్లు.

౧. శ్రీయుత మున్నాలాల్ ఖడ్డాగి- కల్పి (యు. పి.)
౨. కార్యదర్శి-. బ్రిజగ్రామఉద్యోగసంఘము లాల్ దర్వాజా, ముత్రా (యు. పి.)

3. శ్రీయుత శంకరమోతీరాం కబరె - ఎరండోల్ (తూర్పుఖాందేష్)

౪. మానేజరు "హరిజన్" - ఆర్యభూషణప్రెస్ - పూనా నెం. ౪ రు. ,

౫. అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘము, ౨౪౯ డి-బో బజారు - కలకత్తా.

౬. శ్రీయుత రూపనారాయన్ - అంజుమాన్ తరక్కీ దస్తాకారి, రాజాబజారు, ఔరంగాబాదు.

౭. శ్రీయుత హరిభావు ఉపాధ్యాయ-గాంధిఆశ్రమము హటుండి - అజ్మీర్.

౮. శ్రీపరమహంస ఆశ్రమము - బరహాజ్ - గోరఖ్ పూర్ జిల్లా.

౯. గుంటూరుజిల్లా గ్రామసౌభాగ్యసంఘము లిమిటెడ్ గుంటూరు.

౧౦. భారత గ్రామఉద్యోగమందిర్ సర్వెంట్సు ఆఫ్ ఇండియాసొసైటి భవనము సాంఢర్స్టురోడ్డు, బొంబాయి (నెం. ౪ రు).

౧౧. శ్రీయుత సేటు పోపటులాల్ భగన్ లాల్-౧ వ పార్సివాడా,గిర్గాంపోస్టు. ఖేట్వాడి మెయిన్ రోడ్డు బొంబాయి నెం. ౪ రు.

౧౨. సూర్జివల్లభదాస్ గ్రామపరిశ్రమలబజారు ౨౫౧ కాల్బాదేవిరోడ్డు, బొంబాయి. నెం. ౨ రు.

౧౩. శ్రీ ఖాదీసేవాసంఘము ౧ స్టేషనురోడ్డు, ఖార్, బొంబాయి.

౧౪. అబ్బాస్ గ్రామఉద్యోగ భండారు, రావుపురా, బరోడా.

## బెల్లము నమూనాలు.

చెరకుగడనుండియు, ఈతకల్లునుండియు బెల్లము తయారుచేయుటకు వివిధప్రాంతములలో అవలంబించుచున్న విధానములను అందరును తెలిసికొనుటకు వీలగులాగున పెక్కురకముల బెల్లము నమూనాలను మగన్వాడిలోని ప్రదర్శనశాలలో ఖాయముగా ఉంచుటకు నిశ్చయించినాము. ఈ గ్రామపరిశ్రమపట్ల ఆదరభావముగల మా చదువరులు వారి వారి ప్రాంతములలో దొరకు పలురకముల బెల్లముయొక్కయు, చేతితో చేసిన పంచదారయొక్కయు నమూనాలు ½ పౌ. తూకముగలవి మాకు పంపప్రార్థితులు. ప్రతినమూనాను గురించియు ఈ దిగువ నుదహరించిన ప్రకారము వివరము లిచ్చుట అవసరము.

౧. బెల్లము యొక్క గాని, పంచదార యొక్క గాని రకము.

౨. అవి తయారుచేయు కాలము.

3. రసముతీయు విధానము.

౪. రసము శుభ్రపరచు విధానము.

౫. రసమునుండి బెల్లముయొక్కగాని, పంచదార యొక్కగాని దిగుబడి (నూటికి ఎన్నివంతులు).

౬. ౧౦౦ పౌనుల ఈతకల్లు వండుటకు కావలసిన కట్టెలఖరీదు.
౧౦౦౦ పౌనుల చెరకురసము వండుటకు పట్టువేళ.
౧౦౦౦ పౌనుల చెరకురసము వండుటకు కావలసిన కట్టెల ఖరీదు.

౭. రసమువండుట కుపయోగించు పెనముల కొలతలు; ప్రొయ్యుల వివరములు.

౮. తమఊళ్ళలోను చుట్టుపట్లనుదుకాణములలోఆయా రకములతోకుధరలు,చిల్లరధరలు(పౌనుల లెక్కలో)

౯. చెరకుపానకమునుండి పంచదార గాని పటిక బెల్లముగాని విడదీయు విధానము. తుదకు మిగిలిపోవు పానకముయొక్క ఉపయోగము.

౧౦. పూర్తిచిరునామా: గ్రామము, తాలూకా, జిల్లా, రాష్ట్రము, దగ్గరి రైల్వేస్టేషను.

## మాశిక్షణాలయములో ప్రత్యేక పరిశ్రమలలో శిక్షణము పొందుటకు గల అవకాశములు.

సాలుపొడుగునను ఇచ్చుశిక్షణముగాక ప్రత్యేక పరిశ్రమలలో శిక్షణము పొందగోరువారిని ఈ దిగువ శాఖలలో ఖాళీ ఉన్నయెడల చేర్చుకొందుము.

౧. కాగితపు పరిశ్రమ (౪ మాసములు)

౨. గానుగపై నూనెతీయుట (3 మాసములు)

3. ఈతబెల్లము తయారుచేయుట (అక్టోబరు మాసానంతరము రెండు నెలలు)

౪. తేనెతీత పరిశ్రమ (అక్టోబరు మాసానంతరము రెండు నెలలు)

పైనాలుగు పరిశ్రమలలోను అవకాశమున్న యెడల విద్యార్థి ఒకదానిలో నేకాక పెక్కు పరిశ్రమలలో కూడ శిక్షణము పొందవచ్చును. పైని నియమించిన కాలము ప్రాథమిక ప్రత్యక్ష శిక్షణమునకు మాత్రమే. తాము కోరి పాల్గొను పరిశ్రమలో రోజుకు ౭ గంటలకాలము విద్యార్థి

కృషి చేయవలెను. అవసరమగు వివరములకు దిగువ చిరునామాకు వ్రాసిన వచ్చును.

కార్యదర్శి,
ట్రెయినింగుస్కూలు కమిటీ, మగన్‌వాడి, వార్ధా.(సి.పి.)

దిగువవిషయములను గురించి వివరములు కావలెను.

ప్రశ్నలు.

౧. నువ్వుపిండినుండి కాని కొబ్బరిపిండినుండికాని మనుష్యులు తినదగు ఆహారపదార్థమేది తయారు చేయవచ్చును? తయారు చేయు విధానమేది?

౨ నూనెనుండి చెమ్మను (తడిని) తీసివేయుటకు సులభమార్గమేది?

సంపుటము ౧. అక్టోబరు-౧౯౩౮ సంచిక ౪

పైసంఘపు కార్యనిర్వాహకవర్గసభ ది ౧౬-౯-౩౮ తేదీని వార్ధాలో జరిగినది. సభయొక్క వివరములనుండి కొన్ని భాగములు దిగువ పొందుపరచినాము.

౧. మాచే ధ్రువపత్రములను పొందిన దుకాణముల వల్ల నెలసరినివేదికలు వచ్చుచున్నవి. బొంబాయిలోనున్న గ్రామపరిశ్రమల శుద్ధ గ్రామాహారవస్తు విక్రయశాల వారు మాత్రము ముడిబియ్యమును (తిరుగలిపై విసరిన బియ్యము) కొంతవఱకు అమ్మగలిగిరని ఆ నివేదికలవల్ల తెలియుచున్నట్లు కార్యదర్శి తెలిపెను.

బియ్యములలోకెల్ల ముడిబియ్యమే తినుటకు యోగ్యమని సంఘముయొక్క నిశ్చయము. అట్టి ముడిబియ్యమును అమ్ము దుకాణములకే ఇదివరలో మేము ధ్రువపత్రములను ఇచ్చుచుంటిమి. మా అనుభవమును బట్టి దంపుడు బియ్యమును అమ్మువారికి కూడ అట్టి ధ్రువపత్రము లియ్యవచ్చునని నిశ్చయించితిమి. కాని ఆబియ్యము సాధ్యమైనంత తక్కువపోటుపడినదై యుండవలెనని మా సలహా. ముడిబియ్యము తరువాత రెండవపక్షములో చేతితో దంపిన ఈప్పుడుబియ్యపు ఉపయోగమును ప్రోత్సహింపవలెనని తీర్మానించితిమి.

౨. ఇప్పు డేర్పడియున్న యేడు కాంగ్రెసు మంత్రివర్గముల వారికిని గ్రామపరిశ్రమలను అభివృద్ధిచేయుటకు ఒక కార్యక్రమము నిర్ణయించు విషయమై సంఘమువారాలోచించిరి. అఖిలభారత చరఖాసంఘముతో కూడ సంప్రదించి, ఈ దిగువ పేర్కొనిన ప్రముఖులు ఆయారాష్ట్రమంత్రివర్గములకు కార్యక్రమ మందజేయుటకు తీర్మానించితిమి. అవసరమగుచో వారు ఇతరుల సహాయమునుకూడ తీసికొనుటకు అధికార మియ్యనైనది.

శ్రీయుత వైకుంఠరాయి యల్. మెహతా.
(అధ్యక్షుడు - సమావేశకర్త)
శ్రీమతి గోషిబేన్ ఎం. ఎస్. కెప్టెను.
సేట్ నూర్జీవల్లభదాసు.
శ్రీయుత లక్ష్మీదాసు. పి. అసార్.
బొంబాయిరాష్ట్రము.
డాక్టరు ప్రఫుల్లచంద్ర ఘోషు, సంయుక్తరాష్ట్రము
బీహారు, ఒరిస్సా రాష్ట్రములు.
శ్రీజిత్ శ్రీకృష్ణదాసుజాజు, మధ్యరాష్ట్రములు, బీరారు
ఖాను అబ్దుల్ గఫర్‌ఖాన్, పశ్చిమోత్తర పరగణా.
శ్రీయుత జె. సి. కుమారప్ప, మద్రాసురాష్ట్రము.

(3) ఈ సంఘముయొక్క మగన్‌లాల్ మెమోరియల్ మ్యూజియమునకు ఘనతవహించిన మైసూరు మహారాజావారి ప్రభుత్వమువారు హోయసల శిల్పవిధానమునుబట్టి తయారుచేసిన యక్ష, యక్షిణీ విగ్రహములు రెండు ప్రసాదించిరి. వారికి ఈ అఖిలభారత గ్రామపరిశ్రమల సంఘకార్యనిర్వాహకవర్గమువా రెంతయు కృతజ్ఞులు. ఈ విషయము శ్రీవారిప్రభుత్వమునకు తెలియజేయవలసినదిగా వారు కార్యదర్శిని కోరుచున్నారు.

౪. లోహజాంగుకు శ్రీభగవతు తాలూకదారుగారికిని, చిరివాడ, తేలప్రోలు, మొదలగు ఎనిమిది గ్రామములకు శ్రీ వి. వై. నారాయణశాస్త్రిగారికిని ఇచ్చిన ఏజన్సీలు రద్దు చేసితిమి.

౫. హరిపురములో జరుగనున్న కాంగ్రెసువస్తు ప్రదర్శనమును ఏర్పాటుచేయుటకు శ్రీశంకర్‌లాల్ బాంకరు గారికి అధికారమిచ్చుటకు తీర్మానించితిమి.

౬. శ్రీయుత ఛోటేలాల్‌జైను మా తేనెటీగ పరిశ్రమశాఖను నిర్వహించుచుండెను. ఈయన ౧౦ దినములు విషజ్వరమువల్ల బాధపడి ది ౩౧-౭-౩౮ తేది రాత్రి మా కార్యాలయభవనము ప్రక్కనున్న బావిలో దుమికి ఆత్మహత్యగావించుకొనెనని కార్యదర్శి తెలియజేసెను. అందుపై ఈదిగువ తీర్మానము చేసితిమి. శ్రీఛోటేలాల్‌గారి అకాలమరణమునకు అఖిలభారత గ్రామపరిశ్రమలసంఘకార్యనిర్వాహకవర్గమువారు ఎంతయుదుఃఖించుచున్నారు. ఆయన మరణమువలన సంఘము ఒక స్వార్థత్యాగి, ఉత్సాహపూరితుడగు నిరాడంబర సేవకుడు, పవిత్రశీలముకలవాడు, అద్భుతశక్తిశాలి యగు ఉత్తమపురుషుని సేవను కోల్పోయినది.

౭. గ్రామములలో తయారగు వస్తువుల డైరక్టరీ ఒకటి తయారుచేసి ప్రచురించువిషయములో శ్రీ వైకుంఠరాయి యల్. మెహతాగారు ది ౨౫-౬-౩౮ తేదిని వ్రాసిన

ఉత్తరము సభవారియెదుటికిరాగా గ్రామపరిశ్రమలనుగూర్చియు, చేతిపనులనుగూర్చియు సాధ్యమైనంతవరకు వివరములను కార్యాలయమువారు సేకరింపవలెనని తీర్మానించితిమి.

## పరిశ్రమలను గూర్చిన సమాచారము.

పైని తెలిపిన చివరతీర్మానము ప్రకారము మా చదువరులు శ్రద్ధవహించి గ్రామపరిశ్రమలను, చేతిపనులను గురించి ఈ దిగువ వివరములు తెలియజేసిన వారి కెంతయు కృతజ్ఞులము.

౧. పరిశ్రమ పేరు.

౨. పరిశ్రమ జరుగుచున్న స్థలము.

౩. పారిశ్రామికులు- వారిజాతి- కులము.

౪. రోజు ౧ కి ఆపరిశ్రమలో దామాషా సంపాదన.

౫. కళను నేర్చుకొనుటకును, ప్రజ్ఞ సంపాదించుటకును వలయు కాలము.

౬. ముడిపదార్థముల వివరములు; ఎక్కడదొరకునది.

౭. పనిముట్ల వివరములు.

౮. కావలసిన పెట్టుబడి.

౯. ఉత్పత్తి విధానములవివరములు.

౧౦. సరకు అమ్మెన దెక్కడ?

౧౧. వస్తువులను విక్రయించు ఒక యోగ్యుడగు వర్తకుని చిరునామా.

౧౨. ధర.

ఈ మా కోరికను ఈ పత్రికవలన ప్రచురించుచుండుటచే వ్యక్తులకు ప్రత్యేకముగ వ్రాయదలపలేదు. సభ్యులు, ఏజెంట్లు, ధ్రువపత్రములను పొందిన వర్తకులు, ఇతర సేవకులు అందరును ప్రత్యేకకృషి చేసి మేము కోరిన వివరములు పంపప్రార్థన.

## ఉప్పుడుబియ్యము.

డాక్టరు ప్రఫుల్ల చంద్రఘోషుగారు (౨౪౯ డి. బో బజారు, కలకత్తా) బంగాళారాష్ట్రములో పనిచేయుచున్న మా సంఘసభ్యులు, ఉప్పుడుబియ్యపు ఉపయోగమును గురించి మా బోర్డువారు చేసిన తీర్మానము విషయములో బియ్యములోని రసాయనిక విభాగములనుగురించి పరిశోధన గావించి ఈ దిగువ వివరములను తెలియజేసిరి.

"పుష్టికరమగుఆహారమనుదృష్టితో చూచినచో ముడి బియ్యము సర్వోత్కృష్టము. దాని తరువాతిది కొద్దిగా పోటుబడిన ఉప్పుడుబియ్యము. ఇక మూడవ రకము కొద్దిగా పోటుబడిన మామూలు దంపుడుబియ్యము. పూర్తిగా తెల్లగా దంపినబియ్యము అపాయకర మనుటలో సందియము లేదు.

ఉప్పుడుబియ్యమును తయారుచేయునప్పుడు ధాన్యమును ఉడుకబెట్టుటలో బియ్యముపైని పలుచని పొరలో ఇమిడియుండు బి.విటమిను (జీవాణువు) శక్తి బియ్యము లోపలి భాగములోనికి ప్రవేశించును. అందువలన ఈ బియ్యము కొద్దిగా పోటుపడి బియ్యపు పైపొర కొంతపోయినను జీవాణువుశక్తి బియ్యములోనే ఇమిడియుండును. పచ్చి దంపుడుబియ్య మట్లుగాక దంపినప్పుడు బియ్యపు పైపొరలో ఇమిడియుండు జీవాణువుశక్తి చాలవఱకు నశించును. కనుక సమానముగా పోటుబడిన పచ్చిబియ్యము, ఉప్పుడు బియ్యము - ఈ రెండింటిలో పుష్టినిచ్చు విషయములో ఉప్పుడుబియ్యమే హెచ్చు ప్రశస్తము.

ప్రజలలో చాలమంది ముడిబియ్యమనిన ఇష్టపడరని అనుభవమువలన తేలుచున్నది. అందువలన జీవాణువుల శక్తి నశింపకయుండు ఉప్పుడుబియ్యమును ఉపయోగించుట రెండవ పక్షమని మాసలహా.

ఉప్పుడుబియ్యమువిషయములో మరొక అంశము తెలిసికొన దగియున్నది ఉప్పుడు బియ్యములో జీవాణువుశక్తి నశింపకుండుటయేగాక వానిని సుళువుగా వండవచ్చును. ఉప్పుడు బియ్యపు అన్నము సులభముగ జీర్ణమగును. ముడి బియ్యమును గురించి అవి త్వరగా ఉడుకవనియు, వంటచెరుకు హెచ్చు ఖర్చు అగుననియు, బీదవారు ఇంతఖర్చు భరింపజాలరనియు ఆభ్యంతరము తెలుపుచున్నారు. జీర్ణమగుటకూడ కష్టమని చెప్పుచున్నారు. ఉప్పుడుబియ్యములో ముడిబియ్యములో ఉండు జీవాణువుశక్తి పూర్తిగా ఉండుటయేగాక పైరెండు లోపములుకూడ తొలగుచున్నవి. పుష్టివిషయములలో ముడిబియ్యము నుపయోగించుటే సర్వోత్కృష్టమని మేము నమ్ముచున్నాము. అట్లుండియు పైకారణములనుబట్టి కొద్దిగా దంపినను ఉప్పుడుబియ్యమును ఉపయోగింపుడని సలహానిచ్చుటకు నిశ్చయించితిమి.

## సంఘసభ్యుల - తదితరుల సంఖ్య

ది ౩౧-౮-౩౭ తేదీ అఖరుకు ఈదిగువ ప్రకారమున్నారు.

౩౦౪ మామూలు సభ్యుల.

౪౩ ఏజంట్లు

౨౧ ధ్రువపత్రములను పొందిన దుకాణములు.

## చిరునామాలు.

మా చదువరులు వారివారి చిరునామాలలో మార్పులేమైన యున్నయెడల తెలియజేయకోరెదము. చిరునామా, తపాలఆఫీసు, జిల్లా వివరముగ తెలియజేయుచు వ్రాయవలెను. సరియైన చిరునామాలు తెలుపనికారణమున మేము పంపుచున్న ఉత్తర ప్రత్యుత్తరములు నిర్దేశించినవారికి చేరుటలేదు. సరియగు చిరునామాలు తెలియజేయుటవలన ఇట్టి ఇబ్బందులన్నియు తొలగగలవు.

# జీవకారుణ్యప్రచారము

## తుని

౫-౧౦-౩౭ తేదీని అనకాపల్లి సుజనసమాజ ప్రచారకులును, ఎస్. ఆది వరాహముగారును తునివచ్చి ప్రచారము చేసి ప్రాంతలో ముసలమ్మ అను గ్రామదేవతదగ్గరకు బలి నిమిత్తము తీసికొనివచ్చిన కోళ్లను తిరిగి పంపించివేసిరి. మరుచటిదినమున గుంటూరు సీతారామదీక్షితులు పంతులుగారి అధ్యక్షతను టౌనుహాలులో గొప్పసభ జరిపించి జీవకారుణ్యమునుగూర్చి ఉపన్యసించిరి. సభికులందరు ఏకగ్రీవముగా ఈపట్టణములోనున్న గ్రామదేవతల పేరిట జంతుహింస చేయము అని వాగ్దానము చేసిరి. సభానంతరమున జీవదయాసంఘము స్థాపించబడెను. ఈ సంఘమునకు గవర్నమెంటు రిటైర్డుడాక్టరు గనేడి వెంకటఅప్పారావు నాయుడుగారు అధ్యక్షులుగాను యేవారి పాపారావుగారు ఉపాధ్యక్షులుగాను కొండపల్లి జగన్నాధదాసుగారు కార్యదర్శిగాను ఎన్నుకొనబడిరి.

## అహింసా ప్రచారము, శ్రీకాకుళము.

౨౫-౯-౩౭ రాత్రి శ్రీకాకుళము జీవకారుణ్యసంఘ కార్యదర్శిజంధ్యాల వెంకటసుబ్రహ్మణ్యం శర్మగారు కొత్తపేటలో జంతుబలి, మాంసాహారనిషేధముల గూర్చియు మద్యపానమువలనగలుగు నష్టములు, అస్పృశ్యతా నిర్మూలనముల గురించియు పద్యములతోను, పాటలతోను ఉపన్యసించిరి.

## ఆంధ్రదేశ వృత్తాంతములు

### తీర్మానములు.

1. దసరాపండుగ దినములలో ఎవ్విధమైన బలులను ఆంధ్రరాష్ట్రమునందు జరుగకుండ జేయుటకై ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్య సంఘమువారు విజ్ఞప్తులను అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికలందు విరివిగా జేయగలందులకు ఈ సభవారు కోరుచున్నారు.

2. పంజాబులో లాహోరు పశువధశాలా నిర్మాణమును నిలుపుదల జేయించిన శ్రీరాజ ప్రతినిధిగారి నిర్ణయమునకు ఈసభవారు ప్రశంసించుచున్నారు.

### కోటఉరట్ల.

తే ౨౯-౯-౩౭దీని అనకాపల్లి సుజనసమాజ ప్రచారకులు శ్రీయుత వేలం వేంకటరమణగారు సర్వసిద్ధి తాలూకాలో కొన్ని గ్రామములందు ప్రచారము చేసి గొలుగొండ తాలూకాలోఉన్న మా ఉరట్లగ్రామమువచ్చి క్రొవ్విడి అప్పారావుపంతులుగారి అధ్యక్షతను సభను చేసిరి. ఈ ప్రచారకులు ఆర్థికముగను, నైతికముగను మద్యపాననిషేధమునుగూర్చియు మరబియ్యము నష్టమునుగూర్చియు జంతుబలులిచ్చువారు భక్తులా అనువిషయమునుగూర్చియు మాట్లాడిరి. వారు గ్రామపునర్నిర్మాణమునుగూర్చి కడు శ్రద్ధతీసికొని ప్రతిగ్రామము వెళ్లి పని చేయుచున్నారు.

# పత్రికలు

### శ్రీ ఆర్ష పత్రిక

ఈక్రొత్తపత్రికకు స్వాగతము ! సుస్వాగతము !! సెప్టెంబరు ౧వ తేదిని వెలువడినదీనితొలిసంచిక మాకు చేరినది. ఇది ప్రతి ఆంగ్లమాసమున మొదటితేదిని చెన్నపురినుండి వెలువడును. పుటలు ౧-౨: పలువిషయములనుగూర్చి వ్రాయుచుందురు. ప్రకాశకులు శ్రీ తేకుమళ్ళ రాజగోపాలరావుగారు. వీరిభాష గ్రాంథికము. పైవారు వ్రాయువాడుకభాషలోని వ్యాసములును ప్రకటింతురు.

చందా సంవత్సరమునకు రూపాయ మాత్రమే.

వలయువారు:— ప్రకాశకులకు వ్రాయనగును.

118 పరశువాకము హైరోడ్డు, వేపేరిపోస్టు,
చెన్నపట్టణము.

### గృహలక్ష్మి - దసరాసంచిక

ఇది మామూలు నెల సంచికలకంటె క్రొత్తరూపున హెచ్చుసొగసుగాను, హెచ్చువ్యాసములతోను వెలువడినది. రంగుచిత్తరువులతోను, తక్కిన చిత్తరువులతోను చూపరుల చిత్తములను ప్రమోదాయుత్తము కావించుచున్నది. తనపేరు సార్థకముగా చేసికొనవలయు ప్రయత్నములన్నియు చేయు 'గృహలక్ష్మి'ని తెనుఁగువారందఱును, అందు ముఖ్యముగా ముందంజవేయఁగోరు తెనుఁగు వనితామణులందఱును, అభినందింపఁదగును. ఈ పత్రికా ముఖమునకు తిలకముగా ఉన్న 'ఆదర్శభారతనారీమణి' అనువ్యాసము తెనుఁగుమెలఁత లెల్లరును మెలఁకువతో చదివి, తాము ఆదర్శనారీమణులగుటకు కడంగుదురు గాక! తక్కిన వ్యాసములును స్త్రీల ఉత్సాహమును వెల్లడించుచు, చదువఁదగియున్నవి.

# వృత్తాంతములు

## గ్రంథాలయములకు విరాళములు.

అంగలూరిలోని బాలసరస్వతీ పుస్తక భాండాగార భవనపు మరమ్మతులకును, పుస్తకములకును రు ౫౦౦-౦-౦ లును, పెనుమత్రిలోని విజ్ఞానవర్ధనీ పుస్తక భాండాగార భవనము కట్టుటకు రు ౨౫౦-౦-౦ లును విరాళము లిచ్చినందులకు కృష్ణాజిల్లా బోర్డువారిని ఎంతయు అభినందించుచున్నాము.

తక్కిన జిల్లాబోర్డులవారును తగిన గ్రంథాలయములకు ఇట్టి విరాళము లిచ్చెదరుగాక!

## శారదా గ్రంథాలయము, అనకాపల్లి.

ది ౧౨-౯-౩౪ తేదిని దీని ప్రథమ వార్షికోత్సవము జయపురాధీశ్వరులగు శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారి అధ్యక్షతను అత్యంతోత్సాహకరముగా జరిగినది. పలువు రుపన్యసించిరి. కావ్యపఠనమును, నాటకరంగ ప్రదర్శనమును జరిగినవి

## శ్రీసరస్వతీనిలయము, ఖాజీపాలెము.

ది ౧౪-౯-౩౪ తేదిని పైగ్రంథాలయ వార్షికోత్సవము మ. రా. శ్రీ దంతాలరామయ్య (డిప్యూటీ కలెక్టరు) గారి అధ్యక్షతక్రింద ఉత్సాహకరముగా జరగెను.

## శ్రీకన్యకాపరమేశ్వరీ గ్రంథాలయము, రేపల్లె, ద్వితీయ వార్షికోత్సవము.

౫-౧౦-౩౪ తేదీని ఉదయం గం॥ ౧౦ లకు అరుదెంచిన మహామహులతో మంగళవాద్యములతో గ్రామోత్సవము గావింపబడెను. తదుపరి భోజనానంతరము గం॥ ౨ లకు మనదేశములోను పాశ్చాత్యదేశములలోను గల వివిధగ్రంథాలయములకు తమ సర్వస్వము నర్పించిన మహామహులయొక్కయు దేశీయ మహానాయకులయొక్కయు పురాతన దేవాలయకట్టడములయొక్కయు పటముల చే బహు రమణీయముగాను జనాకర్షణీయముగాను మండల గంథాలయ సంఘకార్యదర్శి శ్రీయుత కొండూరి సీతారామయ్యగారిచే అలంకరింపబడిన గ్రంథాలము ప్రదర్శనమును, శ్రీయుత అన్నవరపు సుబ్బారావుగుప్తగారిచే (వైశ్యపత్రికా సంపాదకులు) తెరువబడెను.

అనంతరము ఈ గ్రంథాలయముయొక్క ద్వితీయ వార్షికోత్సవము బెజవాడ మునిసిపల్ చెయిర్‌మను కొాకరపర్తి భావనారాయణగారి అధ్యక్షతక్రింద జరిగినది. శ్రీ మద్దుల గిరిరావుగారు సభను ప్రారంభించిరి. అధ్యక్షులకు స్వాగతపత్రము సమర్పింపబడినది.

బొలిశెట్టి వెంకటసుబ్బారావుగారు తమ కార్యదర్శి నివేదికను జదివిన తర్వాత యం. ఆంజనేయులు (డిప్యూటీ ఇన్‌స్పెక్టరు) గారు, చెన్నుభొట్ల భానుమూర్తి బి. ఏ; ఎల్.టి.(హెడ్మాష్టరు)గారు, బొలిశెట్టి వీరాంజనేయులు బి. ఏ; ఏల్. టి. గారు, బొలిశెట్టి సత్యనారాయణ బి. ఏ. గారు, కొండూరి సీతారామయ్య మండల గ్రంథాలయ సంఘకార్యదర్శిగారు గ్రంథాలయోద్యమమును గూర్చి ఉపన్యసించిరి. అధ్యక్షుల తుది ఉపన్యాసముతో సభ ముగింపబడినది.

ఈ గ్రంథాలయమునకు ఒకదినపత్రిక పది ఇతరపత్రికలు వచ్చుచున్నవి. ఇందు ౫౭౦ గ్రంథములున్నవి. గత వత్సరము ౭౫౦మంది గ్రంథములను చదివిరి. గ్రంథాలయమునకు ౧౨౦౦౦ మంది పాఠకులు విచ్చేసిరి. ఆదాయము రు౧౧౪-౬-౦ లు. వ్యయము రు౧౧౬-౧౫-౦ లు. ఈవత్సరము ౯ పాలకవర్గసమావేశములు, ౨ సాధారణ సమావేశములు, ౪ మహానాయకుల ఉపన్యాసములు జరుపబడినవి.

## శ్రీ వేంకటేశ్వర విలాస పుస్తక భాండాగార ౧౬వ వార్షికోత్సవము, ఉపమాక అగ్రహారము.

ది ౧౪-౧౧-౧౯౩౪ ఆదివారము మధ్యాహ్నము గం ౪ లకు జరుపబడును గాన గ్రంథాలయాభిమానులు దయచేయ ప్రార్థితులు.

పీతాంబరము వేంకటకృష్ణమాచార్యులు, కార్యదర్శి.

## జంతుబలి.

బెంగుళూరు పట్టణమున దసరాపండుగలలో ఆయుధపూజదినమున వేలకొలది జంతువులు బలియివ్వబడుచుండెను. వివిధజీవకారుణ్యసంఘముల సభ్యులు ఆపట్టణమునందున్న దేవాలయములకుబోయి, బలియిచ్చుటకు వచ్చినవారందరిని నోరులేని ఆజంతువులను చంపుట మానివేయవలసినదని బ్రతిమాలిరి. అందుమీాద బలియిచ్చుటకువచ్చినవారు జంతువులను కొనుటవల్ల తమకు నష్టముకలిగినదనిరి. అప్పుడు ఈ ప్రచారమును ఏర్పాటుచేసిన సేట్ సగన్ మల్జీగారు ౬౦ మేకలను, ౩౦ కోళ్లను, ౨ దున్నలను ఖరీదుకుకొని వీనిని బలినుండి తప్పించిరి.

### శ్రీ సత్యవతీ గ్రంథాలయము, కరప

విజయదశమినాడు ఈ గ్రంథాలయ ద్వితీయవార్షికోత్సవము గ్రంథాలయస్థాపకులు ఆంధ్రవిద్యావాచస్పతి కొట్రశ్యామల కామశాస్త్రిగారిచేత జయప్రదముగా జరుపఁబడెను. ఈసభకు ఏనుఁగులక్ష్మణకవి దౌహిత్రులు కరప గ్రామకరిణీకరణము బహుమేధాశాలియునగు చాగంటి సుబ్బారాయుడుగారు అధ్యక్షత వహించిరి. అధ్యక్షోపన్యాసమైన పిమ్మట గ్రంథాలయస్థాపకుల రిపోర్టు చదువఁబడెను. గ్రంథాలయస్థాపకులవలన ఈసంవత్సరము రు ౨౩౭-౧౪-౯ కిమ్మతుగల ౩౨౦ గ్రంథములును, రు ౧౫-౦-౦ లు కిమ్మతుగల యొకబీరువాయును, రు౧౬-౦-౦ లు ఖరీదుగల అఱుపత్రికలును ఇయ్యఁబడినవి మఱికొందఱు దాతలు ౧౪ మంది రు ౨౧-౧౦-౦ కిమ్మతుగల ౨౭ గ్రంథములనుచితముగ దయచేసిరి. ౧౦౫ రోజులు లైబ్రరీయందు గ్రామస్థులును దగ్గఱగ్రామస్థులును వచ్చి పత్రికాదులను చదువుకొనిరి. ౬౧ మంది ఇండ్లకు అప్పటప్పట గ్రంథములను తీసికొనివెళ్లి చదువుకొనిరి.

### శ్రీ సేనుగుప్త గ్రంథాలయము, డోకిపఱ్ఱు - కృష్ణాజిల్లా.

ఈ గ్రంథాలయ వార్షికోత్సవము శ్రీయుత వల్లభనేని రామబ్రహ్మముగారి అధ్యక్షతను ది ౧౧-౧౦-౩౪ తేదీని అత్యుత్సాహకరముగా జరిగినది. పలువురు ఉపన్యసించిరి. ఇది ౧౯౩౩ లో ఏర్పడి బాగుగా పని చేయుచున్నది.

## గ్రంథాలయ సేవ

### తాడేపల్లిగూడెము తాలూకా కార్యదర్శి దినచర్య ౧౯౩౬-౩౭.

౧-౪-౩౬ తాలూకా గ్రంథాలయ సంఘము కార్యనిర్వాహకవర్గము సమావేశపుపని.

౩-౫-౩౬ (పాందువ్వ) శ్రీరామ సుబ్బరాజేంద్ర గ్రంథాలయ వార్షికోత్సవము, భీమవరము తాలూకా చతుర్థ గ్రంథాలయమహాసభ, ప॥ గోదావరిజిల్లా ద్వితీయ గ్రంథాలయ మహాసభ పీఠిపని.

౨౪.౫-౩౬ (పెదతాడేపల్లి) శ్రీసరస్వతి గ్రంథాలయము చూచితిని.

౨౫.౫-౩౬ (తాడేపల్లిగూడెము)జిల్లాబోర్డు గ్రంథాలయము, వార్షికనివేదిక తయారు చేసితిని.

౧౩-౬-౩౬ (పెంటపాడు) శ్రీనివాస గ్రంథాలయముచూచి, వార్షికోత్సవపు ఏర్పాట్లనుగురించి మాట్లాడితిని.

౫-౭-౩౬ (బొమ్మిడి) శ్రీ వేణుగోపాల గ్రంథాలయమునకు వెళ్ళియుంటిని.

౧౩-౭-౩౬ (చెఱుకువాడ) శ్రీ చంద్రశేఖర గ్రంథాలయమువద్ద సభలో గ్రంథాలయోద్యమమునుగురించి మాట్లాడితిని. శ్రీయుత మంగిపూడి వెంకటశర్మగారు హరిజనోద్యమముగురించి మాట్లాడిరి.

౧౫-౭-౩౬ (బాదంపూడి) శ్రీ చిత్తరంజన గ్రంథాలయమునుచూచి భవననిర్మాణమునుగురించి మాట్లాడితిని.

### డాక్టరు తేతలి సత్యనారాయణమూర్తిగారు

౨-౮-౩౬ (భీమవరము) శ్రీ దండునారాయణరాజుగారి అధ్యక్షతను జరిగిన జిల్లా గ్రంథాలయ సంఘకార్యనిర్వాహక వర్గముయొక్క సమావేశమునకు వెళ్లియుంటిని.

౭-౮-౩౬ (పడాల) శ్రీరామ గ్రంథాలయ భవన ప్రవేశము అల్లూరి రామకృష్ణంరాజుగారిచే జరుపబడెను.

౨౨-౮-౩౬ (పెదతాడేపల్లి) శ్రీ సరస్వతీ గ్రంథాలయము ప్రథమవార్షికోత్సవము మ॥ రా॥ శ్రీ పి. సి. జేమ్సు బి. ఎ. స్టేషనరి సబుమేజస్ట్రేటుగారి అధ్యక్షతను జరుపబడెను.

౨౪-౮-౩౬ (నిడమర్రు) మిత్రమండలి గ్రంథాలయమును చూచితిని.

౨-౯-౩౬ (అలంపురము) తాలూకాసభయేర్పాట్లు గావించితిని.

౮-౯-౩౬ (అలంపురము) శ్రీశనివారపు సుబ్బారావుగారి అధ్యక్షతను తాలూకా తృతీయగ్రంథాలయ మహాసభ జరిగెను. శ్రీ యర్రమిల్లి నారాయణమూర్తిగారు ప్రారంభోపన్యాసమిచ్చిరి.

౨౭-౯-౩౬ రేలంగిలో శ్రీ గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారి అధ్యక్షతను జరిగిన తణుకుతాలూకా గ్రంథాలయసభకు వెళ్ళియుంటిని.

౨౮-౯ ౩౬(రాచూరు) వివేకానంద గ్రంథాలయము చూచితిని.

౨౦-౧౦-౩౬ (తాడేపల్లిగూడెము) శ్రీ శారద గ్రంథాలయముయొక్క చతుర్థవార్షికోత్సవము శ్రీమతి శృంగార కవి లక్ష్మీనరసమ్మగారి అధ్యక్షతను జరిగెను.

౨౯-౧౦-౩౬ (కైకరం) ఏలూరుతాలూకా కైకరము గ్రామమందలి జిల్లాబోర్డుగ్రంథాలయమును చూచితిని.

౯-౧౧-౩౬ (వల్లూరు) శ్రీ లక్ష్మీనరసింహ గ్రంథాలయపు ౫ దవ వార్షికోత్సవమున కధ్యక్షతవహించితిని. శ్రీ యద్దనపూడి వెంకటరత్నంగారు ప్రారంభోపన్యాసకులు.

౨౦-౧౧-౩౬ (పెంటపాడు) దత్తాగారి సంచారము ఏర్పాట్లనుగురించి వెళ్లితిని.

౨౨-౧౧-౩౬ (గణపవరం సరిపల్లి) దత్తాగారి సంచారము యేర్పాట్లనుగురించి వెళ్ళితిని.

౨౪-౧౧-౩౬ శ్రీ టి. సి. దత్తాగారితో తాడేపల్లిగూడెం, పెంటపాడు, చెరకుగనిమ, పిప్పర, గణపవరం, నిడమఱ్ఱు, సరిపల్లి, అలంపురము గ్రంథాలయములను చూచితిమి.

౨౯-౧౧-౩౬ (దువ్వ) శ్రీ నాగేశ్వరగ్రంథాలయము వద్ద సభలో నేనును శ్రీ వెంకటరత్నంగారును మాట్లాడితిమి.

౬-౧౨-౩౬ (తణుకు) శ్రీరామ పుస్తకాలయము వార్షికోత్సవమునకు వెళ్ళియుంటిని.

౧౪-౧౨-౩౬ (ఉప్పాకపాడు) గ్రంథాలయమువద్ద ఉపన్యసించితిని.

౧౮-౧౨-౩౬ (పడాల) శ్రీరామగ్రంథాలయ వార్షికోత్సవమున కధ్యక్షతవహించితిని. మ్యాజికులాంతరు ఉపన్యాస మిచ్చితిని.

౧౬-౧౨-౩౬ బొమ్మిడి, కాగుపాడు, బాదంపూడి గ్రంథాలయములను చూచితిని. బాదంపూడిలో మ్యాజికులాంతరు ఉపన్యాస మిచ్చితిని.

౧౭-౧౨-౩౬ కేశవరం, పిప్పర, చెరకుగనుమ, గ్రంథాలయములను చూచితిని. చెరకుగనుమలో మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౧౯-౧౨-౩౬ (నిడదవోలు) కొవ్వూరు తాలూకా ప్రథమగ్రంథాలయ మహాసభ, శ్రీ డాక్టరు పాలకోడేటి సత్యనారాయణశర్మగారి అధ్యక్షతను జరిగెను. నేను ప్రారంభోపన్యాసమిచ్చితిని. రాత్రి మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౨౧-౧౨-౩౬ నాచుగుంట వెళ్ళితిని.

౨౨-౧౨-౩౬ వుంగుటూరు గ్రంథాలయములను చూచితిని.

౨౭-౧౨-౩౬ పరిమళ్ల, యానాలపల్లి, పడమర విప్పఱ్ఱు గ్రంథాలయములను చూచితిని. పడమరవిప్పఱ్ఱులో మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౩౧-౧౨-౩౬ మారంపల్లిలో గ్రంథాలయమువద్ద మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౨-౧-౩౭ (జగన్నాధపురం) ప్రథమ వార్షికోత్సవము శ్రీజటావల్లభుల పురుషోత్తంగారి అధ్యక్షతను జరిగెను. మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౪-౧-౩౭ (కస్పాపెంటపాడు) నూతనముగా గ్రంథాలయము తెఱ్ఱచుటకు కృషిసలిపియుంటిని.

౪-౧-౩౭ (యానాంపల్లి) మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

౧౭-౧-౩౭ (మాధవరం) జిల్లాబోర్డుగ్రంథాలయము వద్ద రావుబహద్దురు మంత్రిప్రగడ నరసింహంగారి అధ్యక్షతను స్థానిక దివ్యజ్ఞానసమాజమువారి వార్షికోత్సవము జరుపబడెను.

౨౪-౧-౩౭ (పాలకోడేరు) భీమవరం తాలూకా గ్రంథాలయసభ కధ్యక్షత వహించితిని. ప॥ గోదావరిజిల్లా మహాసభలో పాల్గొంటిని.

౨౭-౧-౩౭ ఉంగుటూరు, పెదనిండ్రకొలను గ్రామములలో ప॥ గోదావరిజిల్లా కలెక్టరు ఎస్. వెంకట్రామన్ ఎమ్. ఏ. ఐ. సి. ఎస్. గారి అధ్యక్షతను గ్రంథాలయ వార్షికోత్సవము జరుపబడెను.

౨౨-౩-౩౭ (కొండుప్రోలు) శ్రీవిశాల వీరభద్రయ్యగారి అధ్యక్షతను శ్రీబాలా త్రిపురసుందరి గ్రంథాలయము తెరువబడెను. మ్యాజికులాంతరు ఉపన్యాసమిచ్చితిని.

## తణుకు తాలూకా గ్రంథాలయ సంఘము

౨౬-౯-౩౭వ తేదీన పెరవలిగ్రామములో కార్యనిర్వాహకవర్గముకూడినది. తాలూకాగ్రంథాలయసభను ఇరగవరంలో జరుపుటకును, సభానంతరం గ్రంథాలయయాత్రను సాగించుటకును, యాత్రసందర్భములోతాలూకా సంఘమునకుచందాదారులను ఏర్పరచుటకును, గ్రంథాలయములకు గలఇబ్బందులనుగురించి నివేదికనుతయారు చేయుటకును, గ్రంథాలయ సంఘము శిఫారసు చేసిన గ్రంథాలయములకు పత్రికలను పుస్తకములను, తగ్గింపుధరలకుఇచ్చులాగున కోరుటకును, తణుకు హార్క్నెస్ టవున్ హాలులో పత్రికలను అందరినిచదువ నిచ్చునటుల కోరుటకును గ్రంథాలయ సర్వస్వమునకు చందాదారులను చేర్చుటకును తీర్మానింపబడినది.

### తెనాలి తాలూకా

గుంటూరుమండల గ్రంథాలయ సంఘాధ్యక్షులగు శ్రీయుత కస్తూరి కుటుంబరావుగారు తెనాలి తాలూకాలో ఈక్రింది గ్రంథాలయములను చూచిరి.

౧. శ్రీ ఆదినారాయణస్వామి గ్రంథాలయము, దోనేపూడి. ఇందు ఉపన్యసించిరి. ౨ కొల్లూరిలో జరిగిన పెదపాలెము సేవాశ్రమ వాణీమందిరమువారి బోటుగ్రంథాలయ వార్షికోత్సవమున పాల్గొనిరి. ౩. పంచాయతీబోర్డు వేణుగోపాల పుస్తకభాండాగారము, వేమూరు. ౪ యువజన గ్రంథాలయము, జంపని, సభ్యులను ప్రోత్సహించిరి. ౫ బాల సమాజము, పెదరావూరు, ౬ శ్రీ సరస్వతీనిలయము, కూచిపూడి, సభ్యులను హెచ్చరించిరి. ౭ శ్రీమదిందిరానిశాంత గ్రంథనిలయము, మూల్పూరు. పంచాయతీబోర్డు అధ్యక్షులతో మాటలాడి సలహాలిచ్చిరి. ౮ శ్రీ నన్నయాంధ్ర గ్రంథాలయము, పెదపూడి. కార్యదర్శితో అభివృద్ధికి తేవలెనని చెప్పిరి. ౯ భాషాసంజీవనీ సంఘము, అమృతలూరు. ఇది అభివృద్ధిలో ఉన్నదని సంతసించిరి. ౧౦ శ్రీకృష్ణయోగి గ్రంథాలయము, పాంచాళవరము. ఇది ౫ ఏండ్లనుండి పనిచేయుటలేదు.

### గుంటూరు పట్టణగ్రంథాలయ సంఘము

౨౪-౯-౩౭ తేదీని ఈసంఘమువారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గూర్చి గ్రంథాలయోద్యమమునుగూర్చి ఉపన్యాసముల నిప్పించుటకును, తాలూకా గ్రంథాలయమహాసభను సమావేశపరచుటకును, తీర్మానించిరి.

౩-౧౦-౩౭ తేదిని ఈసంఘమువారుకూడి, గుంటూరుపట్టణ మందలి ప్రభుత్వమువారి వైద్యశాలయందు రోగులకు గ్రంథాలయ సేవ చేయుటకు నిశ్చయించిరి.

# నివేదికలు

### శ్రీ ఆంధ్రబాలసరస్వతీ నిలయము, నల్లూరు
### ౧౯౩౬-౩౭ వ సంవత్సరసంగ్రహనివేదిక.

ఆదాయము :— రు. ౧౬౧-౨-౫

వ్యయము :— రు. ౧౫౭-౧౦-౩

ఈ వత్సరమున శాశ్వతాభిమానిగాచేరిన పుట్టగుంట బుచ్చయ్య చౌదరిగారు రు ౪౨లు విరాళమొసంగియుండిరి.

ఇండ్లవద్ద పుస్తకములుచదువుకొన్నవారు— పురుషులు ౩౦౦౦; స్త్రీలు ౨౧౮౦; లైబ్రరీవద్ద పుస్తకములను చూచుకొన్నవారు ౧౪౨; పెనుమూడిలో చదివినవారు ౧౪౦; మొత్తము పుస్తకములుచదివినవారు ౫౪౬౨; పత్రికలు చదివినవారు౮౧౨౮; క్రొత్తపుస్తకములు ౨౧౩, వాని ఖరీదు రు౯౯-౭-౩. మొత్తముజరిగిన కార్యనిర్వాహక సమావేశములు ౨౦; సర్వసభ్య సమావేశములు ౩. మొత్తము నూటయిరువది అంశములపై చర్చజరిగెను.

పత్రికలలోని ముఖ్య వ్యాసములు పుస్తకములలో అతికింపబడెను. ముఖ్యవ్యాసముల పేర్లను ప్రతిదినము నల్లబల్లపై వ్రాయుదురు. ఈ గ్రామమందు చదువను వ్రాయను వచ్చినవారి లెక్కలను తయారుచేసిరి. గుంటూరుజిల్లా బోర్డువారు రు ౧౪౪-౦-౦ గ్రాంటును సేంక్షన్ చేసియుండిరి. స్త్రీలకు ప్రత్యేకముగా పుస్తకము లిండ్లకు ఇప్పించుచుండిరి. స్త్రీలు ఈ వత్సరమున చందాలను బాగుగా ఇచ్చుచున్నారు. ఈ గ్రంథాలయము స్థాపించిన నప్పటినుండి ఈ సంవత్సరము ఎక్కువ ఉచ్ఛదశలో నున్నది.

### శ్రీ రామ గ్రంథాలయము,
### శివరామపురాగ్రహారము.

ఈ గ్రంథాలయస్థితి :

వచ్చుపత్రికలు : త్రిలింగ, ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక, తెలుగుజెండా, గ్రంథాలయసర్వస్వము.

ఉన్నగ్రంథములు : సంస్కృతము ౧౭౧; తెలుగు ౫౬౦; హిందీ ౮; ఆంగ్లము ౨౧౦; తాళపత్రములవి. ౬౧

చదువుకొన్నవారు ౧౯౮ గురు; చదివిన గ్రంథములు ౨౦౧. ౩౦ మంది ౩౦ సం. గ్రంథములును, ౧౫౦ మంది ౧౫౦ తె. గ్రంథములును, ౨ రు ౫ హిం. గ్రంథములును, ౧౪ గురు ౧౪ ఆం. గ్రంథములును, ౨ రు ౨ తా. ప. గ్రంథములును చదివిరి.

### శ్రీరామకృష్ణ విద్యార్థుల పబ్లిక్ గ్రంథాలయము,
### పెదనిండ్రకొలను.

ది ౧౨-౭-౩౭ తేది ఉదయము ౮ గంటలకు ఈ గ్రంథాలయ సంఘము తరఫున "వయోజన విద్యావ్యాప్తి" ని గురించి గ్రామములోని రామాలయములో ఒక సభ జరిగినది. సభకు మందలపర్తి రామచంద్రరావుగారు అధ్యక్షత వహించిరి. నరసారావుపేట వాస్తవ్యులగు శ్రీ రావిపాటి కామేశ్వరరావుగారు విద్య, దాని ఆవశ్యకత, ప్రాథమిక విద్య, వయోజనవిద్య అను విషయములను గురించి, లంక. రామమూర్తిగారు, మందలపర్తి గంగరాజుగారు, పెన్మెత్స కామరాజుగారు "వయోజన విద్యావ్యాప్తి"ని గురించి మాటలాడిరి.

# కొవ్వూరు తాలూకా గ్రంథాలయ యాత్ర

జోశ్యుల సూర్యనారాయణమూర్తి,
తాలూకా గ్రంథాలయసంఘ కార్యదర్శి, సింగవరం.

(గోపాలపురం ఫిర్కా.)

ఈ తాలూకా గ్రంథాలయసంఘమువారు ది ౬-౧౦-౩౭ తేదీనుండి ది ౧౦-౧౦-౩౭ తేదీఆఖరువఱకు ఈ ఫిర్కా గ్రామములలో ఆంధ్రదేశగ్రంథాలయసంఘ కార్యదర్శులగు శ్రీయుత అయ్యంకి వెంకటరమణయ్య పంతులుగారి నాయకత్వముక్రింద గ్రంథాలయయాత్ర జయప్రదముగా జరిపిరి. సుప్రసిద్ధ దేశసేవకులగు శ్రీయుత నరసింహదేవర సత్యనారాయణగారు ఈ యాత్రకు ప్రారంభోపన్యాస మొసంగియుండిరి.

ఈ యాత్రలో పాల్గొనిన వారిలో జిల్లాగ్రంథాలయ సంఘకార్యదర్శులగు శ్రీయుత తాడిమేటికుటుంబశాస్త్రి గారు, తాలూకా గ్రంథాలయసంఘాధ్యక్షులగు శ్రీయుత గోటేటిశ్రీరామచంద్రమూర్తిగారు తాలూకా కాంగ్రెసు సంఘాధ్యక్షులగు శ్రీయుత గదా రఘునాయకులుగారు, తణుకుతాలూకా గ్రంథాలయసంఘకార్యదర్శియగు శ్రీయుత తంగిరాల కృష్ణానందతిలక్ గారు, ఈ తాలూకా అగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటరు శ్రీయుత తాళూరి లక్ష్మీపతిరావుగారు, మ్యాజికులాంతరు ప్రదర్శకులగు శ్రీయుత ఉప్పెర్ల లక్ష్మీనారాయణగారు (అలమూరు), శ్రీయుత కంభంమెట్టు రామారావుగారు, సర్దారు శ్రీయుత దండు నారాయణరాజుగారు మున్నగు ప్రముఖులు గలరు.

## లక్కవరం.

ది ౬-౧౦-౩౭ తేది సాయంకాలము గం ౩ లకు బోర్డుపాఠశాలా భవనములో శ్రీయుత విజ్జి వెంకటస్వామి గారి అధ్యక్షతక్రింద ఈయాత్రాప్రారంభోత్సవ మహా జనసభ జరుపబడినది. శ్రీయుత నరసింహదేవర సత్యనారాయణగారు ప్రారంభోపన్యాస మొసంగిరి.

ఈ గ్రామములో అనతికాలములో గ్రంథాలయభవనముకట్టుటకు నిశ్చయింపబడినది. ఇదివరలోనే యీగ్రామ కాపురస్థులు లక్షాధికార్లు అయిన వందనపు లక్ష్మయ్య గారు గ్రంథాలయభవనము నిర్మించుటకు స్థలము ఒక ఎకరముభూమిని దానము చేసియున్నారు. గ్రంథాలయము స్థాపించి నామకరణము జరిగిన తరువాత ఆపేరున దాన పట్టావ్రాసి యిచ్చెదరు. మరికొందరు పెద్దలు కొన్ని చందాలను వాగ్దాన మొసంగిరి. గ్రంథాలయనిర్మాణమునకు గ్రామస్థులు చాలయుత్సాహముతో నేయున్నారు. కనుక త్వరలో నే గ్రంథాలయస్థాపన చేయుదురని నమ్ముచున్నాము.

## పంగిడిగూడెం

ది ౮-౧౦-౩౭ తేదీ ఉదయము ఈగ్రామములో దాట్ల వెంకటలక్ష్మీనరసింహరాజుగారి అధ్యక్షతను పౌరసభ జరుపబడి "శారదానిలయము" అను పేరుతో నొక గ్రంథాలయముస్థాపింపబడి, దానికి కార్యనిర్వాహకవర్గము ఏర్పాటు చేయబడెను.

దాట్ల వెంకటలక్ష్మీనరసింహరాజుగారు ప్రెసిడెంటు, రాజనాల వెంకటనర్సయ్యగారు సెక్రెటరీ, మహాంకాళి బసవయ్యగారు, పోతురెడ్డి వెంకయ్యగారు, పాపదాసు పాపిరెడ్డిగారు "ఆంధ్రవారపత్రిక" "కృష్ణాపత్రిక"లను తెప్పించుటకును తాలూకాగ్రంథాలయసంఘమునకు ప్రెసిడెంటుగారిని ప్రతినిధిగా పంపుటకును తీర్మానించిరి.

## రాజవరం

నాటిసాయంత్రము ఈ గ్రామములో పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు మల్లాబత్తుల అప్పారావుగారి అధ్యక్షతను బహిరంగసభ, జరుపబడి "శ్రీరామగ్రంథాలయ" మను పేరుతో నొక పుస్తకభాండాగారము స్థాపింపబడెను.

కార్యనిర్వాహకవర్గసభ్యులు మల్లాబత్తుల అప్పారావు గారు ప్రెసిడెంటు, చేబోలు సత్తిరాజుగారు వంకదారి సుబ్బారావుగారు దుగ్గిరాల గంగరాజుగారు, సెక్రెటరీ మాజేటి వెంకటరత్నరిగారు కొలచినరామసుబ్బరాయ శాస్త్రిగారు సహాయ సెక్రెటరీ "ఆంధ్రవారపత్రిక" "కృష్ణాపత్రిక"లను తెప్పించుటకును తాలూకాగ్రంథాలయసంఘమునకు సెక్రటరీగారిని ప్రతినిధిగా పంపుటకును తీర్మానించిరి.

## పేరంపేట

౯-౧౦-౩౭ ది ఉదయం ఈ గ్రామములో బోర్డు పాఠశాలలో శ్యామలవీరన్నగారి అధ్యక్షతను ప్రజాభిప్రాయసభ ఏర్పాటు కాబడి "సరస్వతీనిలయ"మను పేరుతో నొక గ్రంథాలయము స్థాపింపబడెను.

ఈ గ్రామము చిన్నగ్రామమైయున్నది. చదువగల్గిన వారి సంఖ్య బహుస్వల్పము. ఇచ్చట విద్యాభిరుచి ప్రజలకు ఎక్కువ అలవడజేయు బాధ్యత గ్రామమునకు మార్గదర్శకుడగు ఉపాధ్యాయునిపై యున్నది.

గ్రంథాలయ నిర్వహణ సభ్యులు ముప్పన సుబ్బారాయుడుగారు ప్రెసిడెంటు, సెక్రెటరీ శ్యామలవీరన్న

గారు. కొరుమూరి వెంకయ్యగారు, గెడ్డం వీరన్నగారు, ఇర్ల లక్ష్మిరెడ్డిగారు, తిరుగుపల్లి శామ్యేలుగారు, మొగిలిచర్ల వెంకటాచార్యులుగారు, తాలూకా గ్రంథాలయ సంఘమునకు సెక్రిటరీగారిని ప్రతినిధిగా పంపుటకును "ఆంధ్ర వారపత్రిక" "కృష్ణాపత్రిక"లను తెప్పించుటకును తీర్మానించిరి.

## తిరుమలాపురం.

నాటి సాయంకాలము ఈ గ్రామములో పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు శ్రీయుత కనపర్తి కృష్ణారావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరుపబడి "శ్రీ సీతారామ గ్రంథాలయ"మను పేరుతో నొకపుస్తక భాండాగారము స్థాపింపబడెను.

గ్రామకరణముగారైన శ్రీయుత కనపర్తి లక్ష్మీనరసింహముగారు ఈ గ్రంథాలయమునకు నొక భవనము ఉచితముగా కట్టించి యిచ్చెదమని ఉదారభావముతో వాగ్దాన మొనరించిరి. ఇదియుగాక తాము తెప్పించుచున్న "ఆంధ్ర దిన పత్రిక" "కృష్ణాపత్రిక"లను గ్రంథాలయమునకే యిచ్చెదమని వాగ్దాన మొనర్చిరి. ఇటువంటి యుదారపురుషుల చేతనే ఆ గ్రంథాలయము త్వరలో అభివృద్ధికలుగగలదని అభిప్రాయపడవచ్చును.

కార్యనిర్వాహణ సభ్యులు కనపర్తి కృష్ణారావుగారు, ప్రెసిడెంటు. పట్టపు సుబ్బారావుగారు, సెక్రెటరీ. కొల్లా సత్యానారాయణగారు, కొమ్మిడి అచ్చయ్యగారు, మరీదు యిక్కుర్తయ్యగారు. తాలూకా గ్రంథాలయ సంఘమునకు సెక్రిటరీగారిని ప్రతినిధిగా పంపుటకు ఏర్పాటు చేసిరి. గ్రంథాలయ సర్వస్వమును తెప్పించుటకును తాలూకా సంఘమునకు ఈ గ్రంథాలయమును చేర్చుటకును తీర్మానించిరి.

## కేశవరం.

ఈ గ్రామములో ప్రోగ్రాము ప్రకారము సాయంకాలము గం ౫ లకు సభ జరుగవలసియుండెను. గాని తిరుమలాపురం గ్రామములో మీటింగు జరుగుచుండగా వర్షము కురియుటచే అచ్చటనుండి యీగ్రామము చేరుటకు ఆరాత్రి సుమారు గం ౯ లకు పైగా కాలమతిక్రమించుటచే సభ జరుగలేదు. ౯-౧౦-౩౭ తేదీ ఉదయము ౭ గంటలకు ఈ గ్రామములో మహారాజశ్రీ కంభంమెట్టు రామారావుగారి అధ్యక్షతను బోర్డు ఎలిమెంటరీ స్కూలులో సభ జరుపబడెను.

విద్యావిషయమున చాల వెనుకబడియున్న గ్రామము ఈ చుట్టుపట్ల కిదియేయని చెప్పుటకు కారణ మేమనగా ౧౫ సం॥రములనుండి నడపబడుచున్న బోర్డుఎలిమెంటరీ పాఠశాలయుండగా చదువదగిన పిల్లలజనాభా ౨౧౮ మందిలో బడికిపోవువారు బహుస్వల్పముగా నున్నట్లు ఉపాధ్యాయులవల్లనే తెలియవచ్చినది. చదువను వ్రాయను గల్గినవారు ఆ గ్రామమున బహుస్వల్పము. విద్యావిషయములో ఉపాధ్యాయులు ప్రజలకు ఎక్కువ ఉత్సాహము కల్గునట్లు ప్రోత్సహించవలసిన బాధ్యులై యున్నారు.

ఈ గ్రామస్థులు ఈ గ్రామపంచాయతీబోర్డు తరఫున గ్రంథాలయము స్థాపింపజేయుటకు ఏకగ్రీవముగా తీర్మానించియుండిరి.

## గవరవరము.

నాటి మధ్యాహ్నము ఈ గ్రామములో మహారాజశ్రీ శ్రీ రాజరాఘవరాజు పెదరంగరాజీగారి అధ్యక్షతను గొప్ప బహిరంగసభ జరుపబడి "శ్రీ వేంకట రామకృష్ణరాయ గంథాలయ"మను పేరుతో నొక గ్రంథాలయము స్థాపింపబడెను.

దానికి శ్రీ రాజావారు శాశ్వతభవనము నొకదానిని కట్టించి యిచ్చుటకును, అంతవరకు వారితాలూకు మరొక బంగళాలో ఉంచుటకును వాగ్దాన మొనరించిరి. అదియుగాక యీ గ్రంథాలయము పేరిట "ఆంధ్రదిన పత్రిక" వారి స్వంతఖర్చుతో తెప్పించియిచ్చుటకును వాగ్దాన మొసంగియుండిరి. శ్రీ రాజావారు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘసభ్యత్వమునుగూడ పొందిరి.

యథారాజా తథా ప్రజాః అనునట్లు ఆ గ్రామప్రజలు గూడ అచ్చటనే అత్యుత్సాహముతో తామెంతెంత చందాలను ఇచ్చెదరో తెల్పియుండిరి. మొత్తము అరువదిరూపాయలవఱకు అప్పటికప్పుడు చందా వేయబడెను.

ఈ గ్రామవాస్తవ్యులైన కంభంమెట్టు రామారావుగారు ఈ విషయములో గ్రామప్రజలలో సంచలనము కలుగజేసి ఉత్సాహవంతులుగాజేసి యీ గ్రంథాలయమునకు అందరు తోడ్పడునట్లు చేసియుండిరి. అదియుగాక వీరు మా యాత్రికులకు తిరుమలాపురం ఎదురుగా వచ్చి స్వాగతమిచ్చి చివరకు జేరువఱకు మాకు జేయూతగాయుండి యుండిరి. ఇటువంటి ఉత్సాహవంతులపైనే గ్రామ పురోవృద్ధి ఆధారపడియున్నది.

పాలకవర్గసభ్యులు: శ్రీ రాజారాఘవరాజా పెదరంగరాజాగారు ప్రెసిడెంటు, శ్రీ రాజా రాఘవరాజు చినరంగరాజీగారు వైసు ప్రెసిడెంటు, కంభంమెట్టు రామారావుగారు సెక్రెటరీ. శ్రీవీరప్రతాప కోరుకొండహంవీరశరభ

రాజుగారు సహాయ సెక్రటరీ. బొమ్మా మంగయ్యగారు. తాలూకా గ్రంథాలయ సంఘమునకు సెక్రిటరీగారిని ప్రతినిధిగా పంపుటకును "గ్రంథాలయసర్వస్వము"ను "కృష్ణాపత్రిక" "భారతి"యను పత్రికలను తెప్పించుటకును తీర్మానించిరి.

### పొంగుటూరు

కన్నాయగూడెం పొంగుటూరు గ్రామముల సంయుక్త మహాసభ పొంగుటూరు గ్రామములో రాత్రి గం ౮ లకు కొత్త వెంకన్నగారి అధ్యక్షతను జరుపబడి "చిత్తరంజన్ గ్రంథాలయ"మను పేరుతో నొక గ్రంథాలయము స్థాపింపబడెను.

రాత్రి వర్షము కురియుచున్నను ప్రజలు అరుగులమీదను, పంచల ప్రక్కలను నిలబడి అతిశ్రద్ధాభక్తులతో సభను జయప్రదముగా సాగునట్లు అత్యుత్సాహముతో నుపన్యాసములను వినిరి.

కార్యనిర్వాహకవర్గసభ్యులు:—పసుమర్తి వీరన్నగారు ప్రెసిడెంటు, కొత్త వెంకన్నగారు సెక్రటరీ, వేగివాడ నారాయణస్వామిగారు, కౌసగాని గంగరాజుగారు, చిలకా వీరన్నగారు, మద్దుకూరి వీరాస్వామిగారు, చెట్లపల్లి చిన సత్యనారాయణమూర్తిగారు, పసుపులేటి వీరభద్రుడుగారు, పరమాత్ముని సుబ్బారావుగారు, శ్రీధరాల సుబ్బారావుగారు, చంద్రుపట్ల ఆంజనేయులుగారు, కొమ్మూరి వెంకటరత్నంగారు, సహాయసెక్రటరీ. పసుపులేటి వెంకన్నగారు. తాలూకా గ్రంథాలయసంఘమునకు ప్రతినిధిగా మద్దుకూరి వీరాస్వామిగారిని పంపుటకును "ఆంధ్రవారపత్రిక" "కృష్ణాపత్రిక" "గ్రంథాలయసర్వస్వము" అను పత్రికలను తెప్పించుటకును, తీర్మానించిరి.

### జగన్నాథపురం

ది ౧౦-౧౦-౧౯౩౭ తేది ఉదయము ఈ గ్రామములో వేములపల్లి బాపన్నగారి అధ్యక్షతను పౌరసభ జరుపబడి "సరస్వతీగ్రంథాలయ"మను పేరుతో నొక గ్రంథాలయము స్థాపింపబడెను.

ఈ పుస్తకభాండాగారమునకు శ్రీయుత వేములపల్లి బాపన్నగారు "ఆంధ్రవారపత్రిక"ను వారి స్వంతఖర్చుమీద తెప్పించి యిచ్చుటకు వాగ్దానమిచ్చిరి. ఈ గ్రామములోని ప్రజలు అత్యుత్సాహముతో సభలోనే సుమారు ముప్పదిరూపాయలువరకు చందాలను వాగ్దానమొనరించిరి.

ఈ గ్రంథాలయమునకు ఈ దిగువవారిని పరిపాలకవర్గసభ్యులుగా ఎన్నుకొనిరి.

వేములపల్లి సనకసనందనాదిమహామునిగారు, ప్రెసిడెంటు, పసుమర్తి సత్యనారాయణగారు సెక్రటరీ, కోడూరి వీరభద్రుడుగారు గుళ్ళపూడి మంగన్నగారు సహాయసెక్రటరీ, బట్టిరెడ్డి గంగరాజుగారు. "కృష్ణాపత్రిక" "జమీన్ రైతుపత్రిక" "గ్రంథాలయసర్వస్వము" అను పత్రికలను తెప్పించుటకును తాలూకా గ్రంథాలయసంఘమునకు ప్రతినిధిగా ప్రెసిడెంటుగారిని పంపుటకును నిర్ణయించిరి.

### గోపాలపురం

నాటిమధ్యాహ్నము జరుగవలసిన సభ వర్షాటంకముచే సాయంకాలము గం ౫ లకు బోర్డుపాఠశాలాభవనములో ఏలూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారైన సర్దార్ శ్రీయుత దండు నారాయణరాజుగారి అధ్యక్షతను పౌరసభ జరుపబడి నాటితో ఈ ఫిర్కా గ్రంథాలయయాత్ర ముగింపబడెను.

శ్రీ రాజుగారు సభయందు ఋణవిరామచట్టమును, గూర్చి విపులముగా బోధపరచిరి.

ఈ గ్రామములో ఇదివరలోనే "రాధారమణగ్రంథాలయ"మను పేరిట నొక స్థలమును గ్రామస్థుల ఉమ్మడి సొమ్ముతో కొని, ఉమ్మడి సొమ్ముతోనే రాతికట్టడము ప్రారంభించి పైకప్పుమినహా భవనమునకు పనిపూర్తియైనది.

సదరు గ్రంథాలయము స్థాపించియుండలేదు. భవననిర్మాణము పూర్తి త్వరలోనే అగును. అయిన వెంటనే గ్రామస్థులు దానికొక పరిపాలకవర్గమేర్పాటుచేసి గ్రంథాలయము స్థాపించెదరని తెలియుచున్నది.

పై సభలన్నింటియందును మదరాసు రాజధానిలోగల ఆంధ్రజిల్లాలను ప్రత్యేకరాష్ట్రముగ వెంటనే నిర్మాణముచేసి ఆంధ్రుల సర్వాభివృద్ధికి తోడ్పడవలయునని ప్రభుత్వమువారిని కోరియున్నారు.

యాత్ర జరిగిన అన్నిగ్రామములలోను ఇంచుమించు గ్రంథాలయము లేర్పడినవి.

ఈ యాత్రాదళమువారికి వారు సందర్శించిన అన్ని గ్రామములలోను ఆయా గ్రామములవారు ఎక్కువ యుత్సాహముతో తోడ్పడిరి.

ఈ తాలూకా ఎగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటరు శ్రీయుత తాళూరి లక్ష్మీపతిరావుగారు మొదటినుండి చివరవరకు కూడా నుండి కష్టసుఖములకోర్చి అన్నిగ్రామములలోను ఆధునిక వ్యవసాయ పద్ధతులను గురించి ప్రబోధముచేసి సహాయపడిరి.

# సంపాదకీయములు

ఖద్దరుసంస్థానము వారి బెజవాడ, కె. యస్. చార్టరు కంపెనీ (వస్తుమార్పిడిశాఖ)లో రిజిస్టరు చేసికొన్న చందాదారులకు వస్తురూపక మగు చందామీద మాపత్రిక అందగలదు.

మేనేజరు.
గ్రంథాలయసర్వస్వము.

## గ్రంథాలయసర్వస్వము

### గ్రంథాలయముల బిల్లు.

మద్రాసు లైబ్రరీఅసోసియేషన్ వారిపరముగా మన మద్రాసురాష్ట్ర శాసనసభలో ఒక గ్రంథాలయపు శాసనము ను ప్రవేశపెట్టుటకు శ్రీబషీరు అహమ్మదు సయీదు ఎం. ఎల్. ఏ. గారు ప్రయత్నించుచున్నారు. ఆబిల్లును పైలైబ్రరీ అసోసియేషన్ వారే సిద్ధము చేసినారు. ఆ యసోసియేషన్ వారికార్యాలయము యూనివర్సిటీ లైబ్రరీలో కలదు. దానికధికారులైన శ్రీ ఎస్. ఆర్. రంగనాథం ఎం.ఏ., ఎల్. టీ, ఎఫ్. ఎల్. ఏ. గారు బిల్లుప్రతిని మాకు దయచేసినారు. అందుకు వారికి కృతజ్ఞులము. ఈబిల్లులో గ్రంథాలయ నిర్వహణాధికారము మద్రాసు కార్పొరేషన్ వారియందును, మ్యునిసిపలుసంఘములయందును, జిల్లా బోర్డులయందును, నిక్షిప్తమయినది. పబ్లిక్ లైబ్రరీ నిర్వచనము చేయుటయందును ఈ ఆక్టుక్రిందగాని మద్రాసు సిటీమ్యునిసిపలు ఆక్టు క్రిందగాని మద్రాసులోకలుబోర్డుల ఆక్టుక్రిందగాని స్థాపితమయినట్టిగాని నిర్వహింపబడుచుండునట్టిగాని లైబ్రరీ యని నిర్ణయింపబడినది. ఈఆక్టు క్రింద పై అధికారుల యధికారముక్రిందగాని గ్రంథాలయములు పెట్టుటకు వేరే మార్గము లేదు. ఈ పై యధికారులకే 'లోకలు లైబ్రరీ అథారటీ' అని క్రొత్త నామకరణము చేసినారు. ఆ యథారటీవారు తమప్రాంతములలో లైబ్రరీసేవ యెట్లుచేయదలచినది స్కీము సిద్ధముచేయవలెను. దానిని ప్రకటించవలెను. ఆక్షేపణల నాలోచింపవలెను. లోకలు గవర్నమెంటువారికి పంపవలెను. వారి యనుమతిపొందిన వెనుక దానిని అమలులో పెట్టవలెను. ఆయథారటీయే లైబ్రరీకమిటీ నొకదానిని నియమించవలెను. దాని నిర్మాణమువగైరా వివరములతో స్కీము లోకలుగవర్నమెంటుకు పంపవలెను. ఏర్పరచే కమిటీలో ఇరువురైనను లైబ్రరీకార్యక్రమానుభవము కలవారని తమకు తోచినవారిని చేర్చవలెను. లోకలు లైబ్రరీ అథారటీవారు లైబ్రరీల నిర్వహణ విషయములో చేయదలచుకొనిన పనిని గురించి మొదట తమచే సృష్టితమయిన కమిటీ నడుగవలెను. వారి రిపోర్టు వచ్చిన పిదపనే కార్యక్రమము జరుపవలెను. ఏదైన ప్రత్యేకావసరముండి అట్టి రిపోర్టు కోరకనే పనిజరుపుదల కారణములు తెలుపుచూ కమిటీవారికి పంపవలెను. లోకలు అథారటీ ఈ ఆక్టుక్రింద తన కీయబడే అధికారములు ఒక్క పన్ను వేయడము అప్పు తేవడము తప్ప కమిటీకి సంక్రమింపచేయవచ్చును. లోకలు అథారటీవారి యాజ్ఞలకు లోబడి కమిటీవారు తమ సభ్యులతోను సభ్యులుకాని వారితోను చేరిన ఉపసంఘముల నేర్పరచవచ్చును. లోకలు లైబ్రరీ అథారటీతోగాని ఇతర లైబ్రరీ అథారటీలతో సమిష్టి కార్యములు నెరవేర్చవచ్చును. అందుకుగాను జాయింటు కమిటీలేర్పరచవచ్చును. రెండుగాని అంతకంటె ఎక్కువగాని లైబ్రరీఅథారటీలు కోరితే లోకలు గవర్నమెంటు వారు ఒకస్కీము వేసి దానిప్రకారము పనిచేయుటకు ప్రాంతపుకమిటీ నేర్పరచవచ్చును. ఇష్టములేని లోకలు అథారటీని అందులో నిర్బంధముగా చేర్పరాదు. లోకలు లైబ్రరీ అథారటీకి గ్రంథాలయకార్యక్రమము చక్కగా జరుగుటకు అనక్షరతా నిర్మూలము అవసరమని తోచితే తనకమిటీచేత విచారణచేయింపించి రిపోర్టు తయారుచేయించి తానాలోచించి స్కీము తయారుచేసి లోకలు గవర్నమెంటుకు పంపవలెను. లోకలులైబ్రరీ అథారటీ "లైబ్రరీఫండు"అని ప్రత్యేకము నిధినేర్పరచవలెను. ఇందులోనికి లైబ్రరీపనులకుగాను అన్నివైపులనుండి వచ్చేద్రవ్యమును చేర్చవలెను. లైబ్రరీరేటు అని తన అధికారములోని ప్రాంతములో పన్ను విధించవచ్చును. అందులో వసూలగు మొత్తముకూడ ఈఫండులో చేర్చవలెను. లోకలు గవర్నమెంటువారు డైరెక్టరు ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్. అని ప్రత్యేకాధికారిని—తనకాలము పూర్తిగా వినియోగింపగలవానినో పాక్షికముగా వినియోగింప

గలవానినో సర్కారునౌకరునో గౌరవోద్యోగినో— నియమింపవలెను. లోకలు గవర్నమెంటువారికి లోబడి ఇతడు లైబ్రరీలపై తనిఖీ సర్వమును నిర్వహింపవలెను. లోకలుగవర్నమెంటువారు సలహాకమిటీని రాష్ట్రానికంతటికిని ఒక్క దానిని ఏర్పరచవలెను. అందులో విద్యామంత్రి, లైబ్రరీలడైరెక్టరు, శాసనసభలచే ఎన్నుకొనబడే ముగ్గురు సభ్యులు, మద్రాసు లైబ్రరీఅసోసియేషన్ వారిచే ఎన్నుకొనబడే ఇరువురుపెద్దలు, లోకలు గవర్నమెంటువారు నియమించే యిరువురుపెద్దలు సభ్యులుగా నుండవలెను. విద్యామంత్రి దీని కధ్యక్షుడు; డైరెక్టరు కార్యదర్శి.

పైని వ్రాసినవివరములు ఈబిల్లులోని ముఖ్యవివరములు. వీనినిబట్టి చూడగా గ్రామ గ్రామమునందు పలు ప్రాంతములందు మ్యునిసిపాలిటీలకు లోకలుబోర్డులకు ఏసంబంధము లేకుండ నేర్పడియుండు నూర్లకొలది గ్రంథాలయములకు దిక్కుమొక్కు ఉండదనుట స్పష్టము. వానినిగురించి యెచ్చటను ఒక్క మాటయును లేకపోగా పబ్లిక్ లైబ్రరీ నిర్వచనములో అవి బహిష్కరింపబడినవి. వీని కిదివరలో ఇచ్చుచున్న గ్రాంటులు ఈబిల్లు చట్టములలో నిరోధితమగుట దీనికి ఫలముగాతోచును. గ్రామసీమలే మనదేశమునందు చాల యెక్కువ. అచ్చట దేశభాషాధారక వ్యవహారము ముఖ్యముగా జరుగవలెను. దానికీబిల్లులో ఎచ్చటను అవకాశము కన్పించదు. రాష్ట్రసలహాసంఘమునందైనా భాషాధారక ప్రాతినిధ్యము కలపెట్టుదురా? యన నదియును కానరాదు. మద్రాసు లైబ్రరీ అసోసియేషను కంటె నెంతోకాలము ముందే ఏర్పడి రిజష్టరయి పనిచేయుచుండుభాషాధారక సంస్థలమాటయే ఈ అసోసియేషన్ వారికి తోచలేదు. రాష్ట్రాధికారము ఎల్లవిషయములందువలె ఇందులోను మద్రాసులో ఒక్క డైరెక్టరుచేతిలో కేంద్రీకరింపవలెననుట ఈ బిల్లు ఉద్దేశముగా తోచును. కాని లోకలు గవర్నమెంటు అన్నచోట్లన్నిటను డైరెక్టరు అనే అవ్యయము చేసిననేతప్ప బిల్లులోని సెక్షనులలో ఎచ్చటను పైతనిఖీదారుగా నితనినేర్పరచవలెననియు రాష్ట్రసలహా సంఘమున కితడు కార్యదర్శిగా నుండతగుననియు లోకలు అథారటీలు జాయంటుకమిటీలేర్పరచుకొనినప్పుడు ఇతనికి రిపోర్టుపంపవలెననియు ఉన్నచోటులలోతప్ప ఇతనికిచ్చిన అధికారము లేవో సూచితము కాలేదు.

లోకలుబోర్డులుమునిసిపాలిటీలే గ్రంథాలయాధికారము సర్వము నిర్వహించుట కేర్పడునప్పుడు ప్రత్యేక మింతటి బిల్లుపెట్టుట అవసరముగా కన్పించదు. ఈ బిల్లు ఇచ్చునట్టి ప్రత్యేకాధికారము క్రొత్తపన్నువేసికొనుటకు పనికివచ్చును. ఈ పన్నైనను ఎంతవేసికొనవచ్చును, వసూలు చేయుట యెట్లు, ఈపన్నువేసి ప్రజలను హింసించుటకు ఒప్పుకొనినను ప్రభుత్వమువారు తమ భాగమిచ్చితీరవలెనను నిర్బంధముకలదా అను వివరము లెచ్చటను కానరావు. రైతుకు ఇప్పుడుండే బరువుచాలును. ఇంకను ఈ బరువుకుకూడ తావీయరాదు. మరి వేరువిషయములలో లోకలుబోర్డులు మునిసిపాలిటీలకు ఇప్పుడుండు అధికారములనీ బిల్లు సంకోచపరచుచున్నది గాని విస్తారపరచుటలేదు. నిరక్షరత్వనిర్మూలన విషయమందు ఈ బిల్లుచూపు మందగమనము ఆశ్చర్యకరముగానున్నది. దేశమంతటను నిరక్షరత్వమునిండియున్నది దానిని నిర్మూలించుటే ప్రథమాంగముగా గ్రంథాలయోద్యమము నేడు సాగవలసియుండగా స్థానికసంస్థలు విచారణలు జరిపించి రిపోర్టులు తెప్పించి గ్రంథాలయప్రయత్నమున కది యవసరమని తోచితే పనిపూనవలెనట! నిజమున కిప్పటిస్థానికసంస్థల చట్టములలోనే ఆయా స్థానికసంస్థలు గ్రంథాలయములు స్థాపించుటకు నిర్వహించుటకు వాని నిర్వహణమునకు ప్రత్యేకను కమిటీలనేర్పరచుటకు అందులో ప్రత్యేక గ్రంథాలయశాస్త్రజ్ఞులను బయటివారిని చేర్చుటకు అట్టికమిటీలకు తమ యధికారములను సంక్రమింపజేయుటకు అవకాశము లున్నవి. గ్రంథాలయ సమిష్టికార్యములకు లోకలు గవర్నమెంటువారిని తాము కోరిగాని లోకలు గవర్నమెంటువారు తమ్మును కోరిగాని జాయంటు కమిటీ లేర్పరచుటకును వీలున్నది. మునిసిపాలిటీల చట్టము లోకల్ బోర్డుల చట్టము త్వరలో సవరణకు రాగలవు. అప్పటికి కొంత సంస్కారము చేసినయెడల ఆచట్టములలోనే ఈ బిల్లులోని ఏర్పాటు లన్నిటిని ఇముడ్పవచ్చును.

నిజమునకు గ్రంథాలయోద్యమ సందర్భమున కావలసిన గొప్పవిషయము లీ బిల్లులో లేవు. గ్రంథాలయోద్యమమును ఆధారముచేసి నిరక్షరత్వ నిర్మూలనము గావించి ప్రజలకు విజ్ఞానము వ్యాపింపజేయు సాధనము - క్రొత్త బిల్లు పెట్టే యెడల - శాసనబద్ధము కావలెను. అందుకు నేటి విద్యావంతులలోని నిరుద్యోగులను సుశిక్షితులను జేయవలెను. వారికొరకు ప్రత్యేక శిక్షణాలయము లేర్పరచవలెను. శిక్షణయైన పిదప వారిని, మంత్రి శ్రీ వీ. వీ. గిరిగారి కనిష్ఠ కార్యాలోచన ప్రకారమే, ఏడూళ్ళకొకరిని నియమించి వారి స్వాధీనమున నొక పాటి కేంద్ర సంచార గ్రంథాలయము పెట్టవలెను. పంచాయతులలో

చిన్న గ్రంథాలయములు పెట్టుకొనుటకును ప్రోత్సహించవలెను. మండలకేంద్ర గ్రంథాలయములు భాషాప్రయుక్త రాష్ట్ర గ్రంథాలయము లేర్పరచవలెను. నిరక్షర నిర్మూలనత్వమునకు కావలసిన సర్వచర్యయు తీసికొనవలెను. ఇంతటికిని ద్రవ్యమును ప్రభుత్వమువారు సేకరింపవలెను. తమ బొక్కసమునుండి యీయవలసియున్న ఇయ్యవలెను. ఇంత కార్యనిర్వహణమును దేశభాషాధారకముగా జరిగి ఏప్రాంతమున కాప్రాంతము స్వతంత్రముగా పనిచేయుట కేర్పరచి మొత్తముమీద రాష్ట్ర ప్రయత్నము నైక్యపరచుచు రావలెను. ఇంతటి కార్యక్రమముద్దేశించుపట్ల గ్రంథాలయ వయోజనవిద్య, నిరుద్యోగ నిర్మూలనము లొక చెట్టు శాఖలుగా గణించి పనిచేయుటకు క్రొత్తశాసనము చేసిన చేయదగును. నిజమునకు గ్రంథాలయోద్యమమూన నీనాడు ప్రబలవలసినదృష్టి గ్రంథములుంచుట. జాబితాలు తయారు చేయుట, గ్రంథము లెరవిచ్చుట మున్నగు గ్రంథాలయ శాస్త్రోక్త చర్యలతో తృప్తిపడియుండుట కవకాశమేలేదు. జాతి వికాసమునకు కావలసిన విస్తారతమోత్సాహ మీయుద్యమ ప్రచారమువ సాధించవలెను. కాబట్టి కాంగ్రెసు మంత్రివర్గమువారు జాతీయకళగల గ్రంథాలయాభిమానులను చేర్చి యాలోచించి తాము స్థానికసంస్థల చట్టములను సవరించకముందే యీమార్గమున చేయదగిన కృషి నాలోచించి తగిన శాసనము నుపక్రమింతురుగాక యని కోరుచున్నాము.

## మద్యనిషేధశాసనము

సేలముజిల్లాలో మద్యనిషేధశాసనము ఈనెల మొదటి తేదినుండి అమలు జరపించినందులకు మద్రాసుమంత్రులను అభినందించెదము. కాని వారు కల్లుసారాలబదులు ప్రజలకు తేనీరు అలవాటుచేయించు దుకాణములకు ప్రోత్సాహము కలిగించుట ఎంతమాత్రము మంచిపని కాదని తెలుపవలసి వచ్చినందులకు మిక్కిలి చింతిల్లుచున్నాము. నిజమునకు టీ కాఫీలు—కల్లుసారాలు చేయునంత హానిచేయకున్నను--కొంతవఱకైనను శరీరమునకు హాని చేయువస్తువులే, కాన వీనివాడుకకూడ ఎంత తగ్గిన ప్రజలకు అంతమేలు. అందువలన కాంగ్రెసుమంత్రులు, దీనిసత్యముగ్రహించి, తేనీటి దుకాణములను ప్రోత్సహించుట మానెదరుగాక! కల్లుసారా దుకాణములకు మారు మజ్జిగ-గంజి-జావ దుకాణములు పెట్టుటకు ప్రజలు ప్రయత్నించుటమంచిది. కాఫీ హోటేళ్ళలో టీ కాఫీలకు అలవాటుపడి పల్లెటూరివారు పెక్కురు ఇప్పటికే పాడైనారు. కావున, టీ దుకాణములకు ఎంతమాత్రమును ప్రోత్సాహ మియ్యరాదు.

---

# ఉద్యోగనియామకము

శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు

ప్రతిరాజ్యములోను కొందరు ఉద్యోగస్థు లుందురు. వీరిని నియమించుటకు కొన్ని నియమములుండును. రాజ్యాంగమందేగాక పెద్దపెద్ద సంస్థలన్నిటియందును ఇట్లే కొన్ని నియమములకు లోబడి ఉద్యోగస్థుల నేర్పరచెదరు. సంస్థలదాక పోనేల! ప్రతిగృహస్థుడును ఇంటిపనులకు, వ్యవసాయపుపనులకు నౌకర్ల నేర్పరచుకొనును.

తానొక్కడు చేయజాలని పనులందు నౌకర్లుగాని ఉద్యోగస్థులుగాని ఉండక తప్పదు. కూలీలును ఒకరకము ఉద్యోగస్థులే. ఈ ఉద్యోగములలో భేదములుగలవు. కావలసిన అర్హతలలో, సాగెడికాలములలో, ఇచ్చెడి వేతనములలో, చూపెడి ఆదరణలలో విరమించిన పిమ్మట జూపెడు భద్రతలలో తారతమ్యము గలదు. నియమింపబడువారి భేదములవలెనే నియమించువారిలో కూడా భేదము లుండును. కాలక్రమమున, నియమించువారు, నియమింపబడువారు- ఈ రెండు తెగలును, తారుమారగుచుండును.

ప్రతియుద్యోగస్థుని కర్తవ్యము:—తనకు ప్రత్యేకింపబడిన విధులను, హృదయపూర్వకముగా, దాపరికము లేక, నిర్వర్తించుట. వానికి ఈ నిర్వహణ పరిపాలనమునకై ప్రతిఫలము: తనకో తనకుటుంబమునకో పోషణము అనగా అన్నవస్త్రవసతి సంపాదన, ఆరోగ్యరక్షణము లేదా రోగనివారణము, ముసలితనములో సంరక్షణము, యాత్రాస్థల దర్శనము, క్రీడాసౌకర్యము, జ్ఞానసముపార్జనము ఈ సౌకర్యములు కలిగించు అవకాశమే వేతనము. ఇంతకు మించి, ధనమును లేదా పదార్థమును, ధనముగా నిల్వచేయుటకు కలిగించు అవకాశము వేతనాపహరణము.

ఈ అపహరణము రెండువిధములు. (౧) సక్రమరూపకము, (౨) అక్రమరూపకము. అక్రమరూపములు చోరీ, మోసము, దారిదోపిడి, యుద్ధములలో కొల్లగొట్టుట మొదలగునవి. సక్రమరూపములు కృషి, వాణిజ్యము, ప్రభుత్వోద్యోగములు, సుశిక్షితవృత్తులు మొదలగునవి. ఇవియును లాభముకొరకైనచో అక్రమరూపకములే. ఈ తెలిపిన ప్రతిఫలము నియమించువారికిని నియమింపబడువారికిని కావలసియేయున్నది. అయ్యది కనీసము సృష్టిలో సహజముగా పశుపక్ష్యాదులకు గూడ కొంతవరకు లభ్యమగుచున్నది.

ఈ సిద్ధాంత మంగీకరించినచో ఇతరవిధముల పై సౌకర్యములు కలవారు, మరల అట్టివానికై గాని లేదా వేతనాపహరణమునకై గాని పూనరాదు. అట్లు ప్రయత్నించుటలో వేతనావసరము కలవారితో పోటీచేయుటయు

ఒక్కొక్కప్పుడు వారలకు వేతనము దొరకకుండ చేయుటయు తటస్థించును. ఇది సంభవించుట శోచనీయము. అధర్మము. ఇందు చేతనే నిరుద్యోగసమస్య ఏర్పడుచున్నది. నిరుద్యోగులు ప్రభుత్వమునకును ప్రజలకును ప్రమాదకారకులు. బుద్ధిమంతులైనచో, మానమునకు మ్రగ్గి, బిచ్చగాండ్రై, అవసరములుతీరక రోగులై రోగవ్యాపకము చేయుదురు. బుద్ధిహీనులైనచో, దుర్వృత్తులై అపకారులగుదురు. కాన సంఘమును, సర్కారును నిరుద్యోగనివారణ చేయక తప్పదు.

"అవసరమైన అర్హతలు కలవారిలోనుండి ఇతరవృత్తి లేనివారికి, ఉద్యోగ మియ్యవలెను"—ఇది ధర్మసూత్రము. గుంటూరుజిల్లా, కాంగ్రెసుసంఘమువారు దీనిని ఆమోదించిరి. మించిన అర్హతులు పెట్టినచో, విద్యాధికులలో పోటి. ఇతరవృత్తి కలవారిని పిలిచిన, ధనాఢ్యులతో పోటి. పలుకుబడి గలవారన్నచో, అధికారులతో పోటి. మూడుపోటీలును ముప్పుదెచ్చును. నిరుద్యోగి ఏటపడును.

వేతనావసరములేనివారు, వేతనముతో నిమిత్తములేకయే, ప్రజలకును ప్రభుత్వమునకు సేవచేయవలెను. అయ్యదివారి ధర్మము.

"ఒకపలుకు, ఒకభార్య, ఒకబాణము" ఈ మాటివలన రాముడు, లోకాభిరాము డయ్యెను. ఒకేమాటవలన హరిశ్చంద్రుడు, సత్యవంతుడై మార్గదర్శకు డయ్యెను. ఒకేపతివలన సీతాదేవి, జగన్మాత అయ్యెను. ఒకేవృత్తిచే, కడుపు నిండెడి ఒకేవృత్తిచేత, కలియుగము వైకుంఠము అగును. విడిపేణ వృత్తి సాంకర్యమువలెనే, వృత్తిబాహుళ్యమును, నివారింపవలెను.

# గ్రంథవిమర్శ

## బాలరోగములు - చికిత్స.

ఈ గ్రంథము పశ్చిమ గోదావరిజిల్లా హోమోపతి సంఘోపాధ్యక్షులగు డా. తల్లాప్రగడ కామేశ్వరరావు బి. ఏ. ఎం. బి. (హోమియో) గారిచే రచింపబడినది. ఇందు తల్లులు తెలిసికొనదగిన శిశుజనము, శిశుపోషణము ఆరోగ్య అనారోగ్య శిశులక్షణములు, ఆహారనియమములు మొదలగు అనేక ముఖ్యవిషయములేగాక, బిడ్డలకు గలుగు సమస్త వ్యాధులకు లక్షణములు, కారణములు, చికిత్స, పథ్యముసహా విపులముగాను, స్త్రీపురుషులకు పండితపామరులకు అర్థమగునట్లును అతిసులభశైలిలోను వ్రాయబడెను. ఈ గ్రంథసహాయమున వైద్యులసహాయ మక్కరలేకయే ప్రతిగృహమందు తలిదండ్రులు తమబిడ్డల వ్యాధులను తెలిసికొని స్వయముగ నివారణ చేసికొనగలరని మాదృఢవిశ్వాసము, తమ బిడ్డల ఆరోగ్యాభివృద్ధికై పాటుపడు తలిదండ్రులందరకు వినయపూర్వకముగా ఈగ్రంథము అంకితము చేయుటలోనే, గ్రంథకర్తయొక్క విశాలహృదయమును, గృహస్థులకుగల యీ గ్రంథావశ్యకతయును వెల్లడియగుచున్నది. ఇది మంచికాగితముమీద అచ్చువేయబడినది. ౨౦౦ పేజీలుగల క్యాలికోబైండు గ్రంథము. వెల రు 1-12-0

అజీర్ణము:—ఈ గ్రంథముకూడ పై గ్రంథకర్త చేతనే వ్రాయబడినది. ఆంగ్లగ్రంథపరిచయమునకు తోడు పరిశోధనము స్వానుభవముకూడ జేర్చి వ్రాసియుండుటచే దీని ప్రాశస్త్యమును గురించి వేరే చెప్పనక్కరలేదు. ఇందు అజీర్ణకారణములు, నివారణోపాయములు, పెక్కురకముల అజీర్ణములు, చికిత్సలు, పథ్యాపథ్యములు మొదలగు విషయములన్నియు చక్కగా విభజింపబడి అతిసులభశైలిలో వ్రాయబడెను. ఆరోగ్యాభిలాషులందరు ముఖ్యముగా చదువతగిన గ్రంథము. 300 పేజీలుగల క్యాలికోబైండు గ్రంథము 0—12—0 మాత్రము. రెండు గ్రంథములలోను గ్రంథకర్తయొక్క బొమ్మకలదు. మామూలుగా మందులవలన గలుగు అపాయములన్నియు హోమియోపతీవైద్యమందు లేవు. ఎందువలన ననగా దీనియందు మందు భాగము సూక్ష్మాతిసూక్ష్మముగ నుండును.

హోమియోపతివైద్యము ఆంధ్రదేశములో దినదినాభివృద్ధిగాంచుచున్న మాటయెల్లరెరిగినదే, ఈ వైద్యప్రచారము ప్రతియింటను బాగుగా జరుగుటకు ఈ గ్రంథములు మిక్కిలి ఉపయోగకరముగనున్నవి. గ్రంథకర్త ఈగ్రంథములను రచించుటలో ఆంధ్రసోదరసోదరీమణులకు ఎక్కువ సేవచేసియున్నారనుట అతిశయోక్తికాదు. వారి సేవ ఎంతయు ప్రశంసార్హము. ఇట్టి గ్రంథము లింకను వ్రాసి గ్రంథకర్త ఆంధ్రలోకమునకు మహోపకారము చేయును గాక యని కోరుచున్నాము.

ఈ గ్రంథములు రెండిటిని గ్రంథాలయలోనుండుటకు పశ్చిమగోదావరిజిల్లా విద్యాశాఖాధికారిగారు అనుజ్ఞనిచ్చియున్నారు. కావున గృహస్థులేగాక, గ్రంథాలయాధికారులందరును తమ గ్రంథాలయములకు ఈ గ్రంథములను తెప్పించి పాఠకమహాశయులకు మహోపకారము చేయుదురుగాక యని కోరుచున్నాము.

వలయువారు:

డా॥ తల్లాప్రగడ కామేశ్వరరావు, బి. ఏ. ఎం, బి.
ఉంగుటూరు. (హోమియో)
తాడేపల్లిగూడెం తాలూకా, పశ్చిమగోదావరిజిల్లా.
అని వ్రాయవలయును.

## గాంధి మహాత్ముని - ఆత్మకథ

( పద్యకావ్యము )

ఇది మహాత్ముని "ఆత్మకథ"కు సరియైన పద్యానువాదము. ఇందలి కవితాశైలి "ఆంధ్ర మహాభారత ప్రతిబింబ" మని క. రామలింగా రెడ్డిగారు మున్నగు పెద్దలు మెచ్చియున్నారు. దీనిని శ్లాఘించుచు బ్రహ్మశ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు విపులమైన పీఠిక వ్రాసిరి. గ్రంథాలయముల కిది యమూల్యాలంకారము. క్రౌను సైజు పుటలు 270. దళసరి గ్లేజు కాగితము. మొదటి భాగము వెల రు 1-0-0 మాత్రమే!

వలయువారు గ్రంథకర్తకు :—

తుమ్మల సీతారామమూర్తిచౌదరి,

అని వ్రాయవలెను. బాపట్ల.

## రాయప్రోలు సుబ్బారావుగారి గ్రంథ రాజములు

| | |
|---|---|
| జడకుచ్చులు | 1 0 0 |
| స్వప్న కుమారము | 0 4 0 |

## జ్వాల ప్రచురణలు

| | |
|---|---|
| వైతాళికులు | 1 8 0 |
| అశోకం | 1 0 0 |
| అనార్కలీ | 0 4 0 |

ఆంధ్ర బుక్ డిపో, ఏ. జి. ప్రెస్, బెజవాడ.

# 1936

# క్రొత్తవ్యాపారము

**10**

**కోట్లకుపై గాగలదు**

## ఇంతటి స్థితికి ప్రజలయొక్క నమ్మికయే కారణరహస్యము

బీద సాదలనక ప్రతివారికిని జీవితభీమా నిరంభ్యంతరమయిన ఒకమంచి పెట్టుబడి.

ఇతర పెట్టుబడులవలన లభింపని ఫలము దీనివలన ఒకని వారసులకు తదనంతరము పూర్ణమైన హక్కులతో లభించును. ప్రతిసంవత్సరము వివేచనాశక్తి గల ప్రజలు తమజీవితముల "ఓరియంటల్" లో భీమా చేయుటకు దానియొక్క అమోఘమైన వ్యాపార విస్తీర్ణము, సుస్థిరత, జంకులేని హామీయును కారణములు. వెంటనే "ఓరియంటల్" పాలసీదారుగా చేరుము.

## ఓ రి యం ట ల్ గవర్నమెంటు సెక్యూరిటీ
## లైఫ్ ఎస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

స్థాపితం: —1874

హెడ్డాఫీసు :—బొంబాయి.

ఉత్తర సర్కారులకు బ్రాంచి, గోడేవారివీధి, విశాఖపట్నం.

ఇండియా అంతటను బ్రాంచీలు, ప్రతినిధులు గలరు.

RSVM01A171

Grandhalaya Sarvasvam—Registered No. M 1714.

# సతీ సక్కుబాయి

గ్రంథకర్త:—సోమరాజు రామానుజరావుగారు.

ఇతివృత్తమా - నారీభక్తహారమున నాయికామణియగు సతీసక్కుబాయి దివ్యచరిత్రము. కర్తయా - సతీ అనసూయ, రంగూన్ రౌడి మొదలగు మహానాటకరచనమున మహత్తరయశమును సమార్జించిన కవిచంద్రుఁడు. రంగములా - నవరసతరంగములు. పద్యములా - పండితపామరజనహృద్యములు. గద్యములా - అనవద్యములు. పాకమా - ద్రాక్షాపాకము. రసమా - ఇహపరమార్గసాధకమగు భక్తిరసము. ఘట్టములా - ప్రపంచలీలానుభవామృత రసవాహినీ ఘట్టములు. చరిత్రమా - జగత్పవిత్రము. ఇట్టి గ్రంథరాజమునకు వెలగట్ట నెవరితరము?

సీతాదేవి సాక్షాదిందిరావతారము; అనసూయాదేవి మహా తపస్సంపన్నుని దార; సావిత్రి రాజపుత్రి; వీరు మహాపతివ్రత లనఁబరఁగినవారే - కాని, మనకాలమునాటివారు కారు. సతీసక్కుబాయి, మనయుగమునందలి మహారాష్ట్ర కాంతాతిలకము. మనవలెనే - సామాన్యసంసారమున జన్మించినది! కులమున బ్రాహ్మణి! తరుచుగా, మన సంసారములయందు సంభవించు, గృహకల్లోలములు సక్కుబాయి సంసారమునను సంభవించెను, కోడలి పేరెత్తినం తనే కొరకొరలాడు అత్తగారును, తల్లియానతి మీరఁజాలని యమాయకుఁడగు ఛాందసపు భర్తగారును సక్కుబాయికి లభించిరి. పాండురంగవిఠలుని పరిపూర్ణభక్తితో నారాధించు భక్తురాలు సక్కుబాయి.

అత్తగారి హఠమునకు సక్కుబాయి చెక్కుచెదరక నిలిచినది. అత్తగారు పెట్టుచున్న బాధాపరంపరల నొకవంక భూదేవివంటి తాలిమితో సహించుచు - భర్తృపాదరాజీవముల నొకవంక పరమభక్తితో బూజించుచు - పాండురంగనాథు నొకవంక భావపీఠమునఁ బ్రతిష్ఠించి స్వర్గపదవిఁజూరగొనిన సాధ్వీతిలకము మన సక్కుబాయి.

సక్కుబాయి బాధలం జదివి, జలజల కన్నీరు గార్పనివారును - అత్తగారియార్భాటములం జదివిఁ పండ్లు పటపట కొఱకనివారును, అమాయకుఁడగు భర్త యసహాయతం జదివి హృదయమున కటకట వగవనివారును, భక్తురాలగు సక్కుబాయికి, పండరీపుర యాత్రాఫలము ననుగ్రహింపఁదలఁచిన పాండురంగనాథుఁడు, కపట సక్కుస్వరూపమున, సక్కుబాయి భర్తతోఁ గాపురము చేయుటను చదివి - పరంధాముని భక్తవాత్సల్యమునకు శరీరము జలదరింపనివారును గలుగరు!

వెల రు 0-12-0 మాత్రమే.

# కోకిల

గ్రంథకర్త:— పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు.

ఇది యొక అపూర్వవిచిత్రకల్పనాసమేత మగు చక్కని నాటకము. కోకిల ధవునకై తండ్రిని త్యజించిన త్యాగశీల. భవ్యతరప్రాసాదముల సుందరోద్యానముల సంచరించు సతీతిలకమైనను, భయదక్రూరమృగసంకీర్ణ భీకరారణ్యా రంగమున నిజధీరచారిత్రాభినయమున, మోహాంధుడగు మోహనుని హృదయాగారమున ప్రేమజ్యోతిని వెలిఁగించి, దమయంతీ అనసూయాదుల మరపించిన పాతివ్రత్యవిరాజిత. ఈమె రాజ్యపరిపాలనాభారమువహించిన రమణీమణి. ఈనాటకము శృంగారరసమునకునిలయము. శృంగారమున కరుణ, కరుణయందే భీభత్సము, దాన రౌద్రము, దానియందే హాస్యము. అంతయు నొక్కరంగమునందే! పసితనమునందే తలిదండ్రులబాసి, కారాగారమునబద్ధుడై, వేదాంతియైన వసంతకుడు, వేదండయానకు దాసుడై కథానాయకత్వమునువహించును. తరువాత విచారణస్థానమున ప్రణయిని కోకిల విచారణీయస్థానమున నిందితులు ప్రేమస్వరూపియగు జనకుడు, దైవసముఁడగు ధవుడు. విచారణరంగభూమి యురికంబప్రాంతము. నేరారోపణచేయునది తల్లి. దీన ప్రపంచమున స్థాపింపబడు నీతి తరుణీమణులయవ్యాజప్రేమ. ఈయపూర్వప్రణయసంభాషణాకల్పనల మేళవించు శేముషి యీ కవిశేఖరునియందే యీ కవివిరచిత మగు నీకోకిలనాటకమునందే చూడదగును.

వెల రు. 1—0—0 మాత్రమే.

వలయువారు:— సరస్వతీ బుక్కు డిపో, బెజవాడ.

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడి ప్రకటింపబడియె.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 171 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes/No |
| మొత్తం పేజీలు | 47 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 4 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |